భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

మార్చి 1969

★

సంపుటము : 46 : సంచిక : 3 :

విడిప్రతి వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మార్చి 1969

చైత్ర చిత్రము

శ్రీ మిరియాల రామకృష్ణ

దేవుడూరేగ నూదెడు సనాయి వలె
గోర్వంక రొదసేయగా వచ్చెను వసంతుడు!
ఆ యైదు బాణాలె అఖిలమ్ముగా నెంచు
అంగజుని కొక కోటి అస్త్రాలు కనిపించె!

చైత్ర చపలాక్షియంజలిలోని కప్పురము
వలె బొండుమల్లియల తెలినవ్వు వెలుగొందె!
దాచుకొనుచున్న ముగ్ధలసిగ్గు దోచుకొనె
వెన్నదొంగ కుమారుడన్నట్లు మారుండు!

బొమ్మపై కుంచెకొసవోలె లేగొమ్మపై
చిఱుగాలి చేతి కెంజివురాకు కొసే యూగె!
గాలిపల్లకికి బోయీలవలె నేతేర
గలమంచు చిల్కజత కమ్మవిల్తుని గొల్చె

ఐదు ఋతువుల రిత్తకైదులను విడివచ్చి
పచ్చనాకున పికము పచ్చిమెతుకులు తినియె!
మెతుకు లోపలి క్రొత్త బ్రతుకిచ్చు కళకు వి
త్తరవోయి పల్కినది ధన్యవాదము పికము!

ఒక్కొక్క పికము తానొకలాగు కూయు, గుం
డెలలోన పల్కరింపులు గెలలు వేసినవి!
ఎటనుంచో పిల్చి రప్పించి కోయిలపాట
విని పల్లవించు మావికి బ్రతుకు ఫలియించె!
ఇన్నాళ్ళు తన పెదవి యెండగా నోర్మూసి
కొన్న కోయిలకు కొనకొమ్మ వాతెర దొరికె!

గడపలందున బిచ్చగాడు తంబురవోలె
తేటి తన గుండియను మీటు పూవులముందు!
వెలిగింపబడిన దివ్వియమీది నీలిపొగ
వోలె కన్బడె తెల్లపూవుపయి నెలదేటి!
సకిపీడుకొన్న సైనికుడట్లు కనిపించె
పువ్వులగుత్తిని వీడిపోవు నల్లనితేటి!

ఆ మ ని పా ట

ఏను తెమ్మెర ఱెక్కనైన గాలేదు పిక
గానమో సురభిళాహ్వానమో గొనిపోవ!

ఊరె తేనెలు కొన్ని తుమ్మెద
లారగొనె నిద్రాణమయి ఝుం
కారమోహన గాన మంత్రో
చ్చారణము మధుపారణము మాని

తొలి భవమ్ముల వాసనలు పూ
పులకు కొన్నిటి కిపుడు లేవో?
వలపు లేమియు వన్నెలేమియు
తొలక విటు మధువొలక విటు లేల

చలి కదలి కొన్నాళ్ళు గడిచెను
చెలియ కోయిల కాలునిడె! మ్రా
కులకు కొన్నిటికేల కిసలయ
పులక లింపుల మొలకలే లేవు?

వనల తిని వాసనల మూర్కొని
వనుల నర్తన గీతముల హిత
ఖనుల త్రవ్వెను పులుగు లీ యా
మనుల నింతయు నెఱుగడా నరుడు?

పికము గని శారిక లసూయల
శుకము లీసుల నేడ్చి కలహము

లోకట గనునే! నరులలో నీ
యొక విధాన వేమ్రల రాలేదు?
ఏను తెమ్మెర తెక్కనైన గాలేదు! పిక
గానమో సురభిశాహ్వానమో గొనిపోవ.

సుమగీతి

గుండె గుమ్మానికి ఆవలివైపు నిలబడ్డ
చిన్నారి సిగ్గుల నునులేత రెమ్మకు
రాత్రి పల్లకీ నెక్కివచ్చే
సెలయేటి కెరటానికి
అర్పించదగిన ప్రణయ రహస్యాలు!

పాలకడలి పర్వవపు తళుకులోంచి తేలి
ఫాలాక్షుడి శిరఃకిరీటంనుంచి వాలి
అమర ప్రమదల ఆర్ద్ర పాణులనుంచిజారి
పుడమి యెద నిండా
మృదుగీతాల కెరటాలు నింపే
తుహిన ఝరీ విలాసాలు

ఇవి జ్వలద్వాంఛా తరంగాల మీద జల్లి
రుదన్నిశ్వాసకుంతలాలమీదచిమ్మి
నునులేత వలపు నెయ్యాల చిగుళ్లమీద అల్లి
తళుకు నవ్వుల కులుకు పాటలతో
విరజిమ్మదగిన అభినవ జ్యోత్స్నలు!

మల్లీవల్లరీ కపోలాంచలాల నవ్వులు
ఉద్యానవధూభుజాగ్రలోలచేలాంచలాలు
ఆమని కొమ్మల పేరంటపు వేడుక సౌరభాలు
ముగ్ధల నాసాపరీమళాలు
కుటిలాలక నునుసిగ్గులు

గుండెల నిప్పుల కుంపట్లమీద నీహారధార కురిపించే
రతిమన్మథుల ముంజేతులనిండా దాక్కున్నవి!

మధ్యాహ్నతపఝంఝూజ్వాలకు తుకతుకలాడే మొగాలు—
పట్టరాని కోర్కెల నుబికి పగిలి
జిగిబిగి కోల్పోయిన గుండెలు—
చెలి భుజాల చిఱుతాకిడికై
చిరవిరహార్తి కృశించిన బాహాలు—
వలవంత బరువు మోయలేక
వెక్కివెక్కి ఏడ్చిన యింద్రియములు—
చీకటి చెరసాలల శూన్య పరిష్వంగములో
చీకాకుల సంకెళ్లను మోసిన తనువులు—
జరానిరుత్సాహములో తెడ్లులేని నావలు—
అమృత చికిత్స నందే దెక్కడ?
కన్నుల వెన్నెల చిందే దెక్కడ?
ఈ పువ్వులు కనబడి నక్కడ!

తలిరు విల్లుపట్టిన ప్రభువు కిరీటపు తళుకులు
పురివిప్పిన వలపుల తలపుల పలువన్నెల చిన్నెలు
పుడమికి దిగివచ్చిన వాల్గన్నుల వెన్నెల కన్నెలు
అమృత కలశమును చిలికిన నునువ్రేళుల మీగడ తొఱకలు
బాలల ముద్దు మొగమ్ములు!
వ్రాలిన బాల ఖగమ్ములు!

—



బొల్లేపల్లి శిలాశాసనములు

శ్రీ బి. ఎన్. శాస్త్రి

నల్లగొండ మండలములోని భువనగిరి తాలూకా కేంద్రమునకు సుమారు ఎనిమిదిమైళ్ల దూరమున బొల్లేపల్లి గ్రామమున్నది. భువనగిరి — నల్లగొండ మార్గములోగల నాగిరెడ్డిపల్లినుండి బొల్లేపల్లికి పోవచ్చును బొల్లేపల్లి గ్రామము నానుకొని మూసీనది కుపనదియైన చిన్నేరు ప్రవహించుచున్నది గ్రామమునకు దూర్పున నదికి ఇవతలి ఒడ్డునగల శివాలయము ఆవరణములో రెండు శాసనములున్నవి.

ఈ ఆలయము పూర్తిగా మట్టితో నిండి దిబ్బగా కనిపించుచుండుటవలన గ్రామ సర్పంచు శ్రీ లక్ష్మీకాంతరెడ్డిగారి ప్రోత్సాహమున గ్రామీణులు 1968 మే మాసములో మట్టిని త్రవ్వించినారు. చెక్కుచెదరని శివాలయము వెలవడినది. గర్భగుడి, శివలింగము, మంటపము, విగ్రహములు భిన్నము కాకుండనున్నవి. ఆలయముఖమంటపము భూమిలోనికి క్రొద్దిగా క్రుంగిపోయినది. మంటపస్తంభములలో నాలుగు ఒరిగియున్నవి. మంటపమున పఱచిన బండలు పగిలిపోయినవి ఆలయము ఉత్తరాభిముఖముగా మన్నది. ఆలయమునకు దూర్పున పైన పేర్కొనిన శిలాశాసనము లున్నవి.

శ్రీ రావి నారాయణరెడ్డిగారు, 'దేవాదాయ శాఖవారికి--ఆలయమతిపురాతనమైనదనియు, దానికి దగిన రక్షణ కల్పించి పూజ, నైవేద్యాదులు జరుగునట్లు చూడవలసినదని' వ్రాసివారట. దేవాదాయ శాఖాధికారి యొకరు బొల్లెపల్లికి వచ్చి ఆలయమును చూచివెళ్లినట్లు గ్రామము మాలీప ఓలుగారి వలన తెలిసినది. మైలారుదేవర కాలయనిర్మాణము గావించి ప్రతిష్ఠచేసిన సందర్భమును పురస్కరించుకొని పశ్చిమచాళుక్యుల సామంతుడును కొల్లిపుర ప్రభువును అగు మేడెయభట్టు వేయించిన శాసన మొకటియు, కాకతి రుద్రమదేవి పాలించుకాలమున వెలసిన శాసన మొకటియు ఇచట నున్నవి ఇవి రెండును తెలుగు శాసనములు.

మేడెయభట్టు శాసనము

శాసనము

ఈ శాసనము కల్యాణి చాళుక్యప్రభువగు రెండవ జగదేకమల్లుని పదియవరాజ్యసంవత్సరమున కొల్లిపుర ప్రభువగు మేడెయభట్టు, మైలారదేవర ప్రతిష్ఠ గావించు సందర్భమున వేయించెను. రెండవ జగదేకమల్లుని, పెర్మాడి జగదేకమల్లుడని యందురు. ఇతనికి శ్రీమచ్చాళుక్యప్రతాపచక్రవర్తి యను బిరుదము కలదు. ఇతని పరిపాలనాకాలము ప్రశాంతముగ గడిచినది: ఈ మహారాజు సుమారు పన్రెండు సంవత్సరములు చాళుక్య రాజ్యమును పాలించెను. ఇతఁడు క్రీ. శ. 1138–1149 వరకు పాలించినట్లు చారిత్రకులు నిర్ణయించినారు[1].

బాదామి చాళుక్యుల పరిపాలనము క్రీ. శ. 750 ప్రాంతమున అంతరించెను. రాష్ట్రకూటులు మాన్యఖేటము రాజధానిగా రెండువందల సంవత్సరములు బాదామిచాళుక్యుల పాలనములోనున్న భూభాగములను పాలించిరి. బాదామి చాళుక్య వంశీయుఁడగు రెండవ తైలపరాజు క్రీ. శ 973 లో రాష్ట్రకూట వంశమును నిర్మూలించి క్రీ. శ. 996 వ సంవత్సరమువరకు కొలనుపాక రాజధానిగా రాష్ట్రకూటుల పాలనములోనున్న ప్రాంతము లన్నింటిని పాలించెను. ఈతని వంశీయులు సమారు

1. A. P. Government Archaeological Series No. 6. Page 72.

రెండువందల సంవత్సరములు కల్యాణిచాళక్యరాజ్యమును పాలించిరి.

బాదామి చాళుక్యులలో చివరిరాజా రెండవ కీర్తివర్మ కౌథెం శాసనము[2]వలన రెండవకీర్తివర్మ మొదలు కల్యాణిచాళుక్యరాజ్యస్థాపకుడగు రెండవ తైలపునివరకుగల రాజుల పేళ్ళు తెలియుచున్నవి. ఈ రాజుల మధ్యకాలము రెండువందల సంవత్సరములు

బాదామి చాళుక్య విజయాదిత్యుడు

- రెం విక్రమాదిత్యుడు
  - రెండవ కీర్తివర్మ
- మొదటి భీముడు (కల్యాణి చాళుక్య)
  - మూడవ కీర్తివర్మ
  - మొదటి తైలపుడు
  - మూడవ విక్రమాదిత్యుడు
  - రెండవ భీముడు
  - అయ్యన
  - నాలుగవ విక్రమాదిత్యుడు
  - రెండవ తైలపుడు (కల్యాణి చాళుక్యరాజ్య స్థాపకుడు.) (క్రీ. శ. 973–996)

కల్యాణి చాళుక్యరాజ్య స్థాపకుడగు రెండవ తైలపుడు క్రీ. శ. 973 - 996 వరకు పాలించెను. అతని యనంతరము క్రమముగా సత్యాశ్రయుడు 997–1008; త్రిభువన మల్లవిక్రమాదిత్యుడు II 1008–1015; జగదేకమల్ల జయసింహుడు V 1015–1042; మొదటి సోమేశ్వరుడు 1042–1068; భువనైకమల్లసోమేశ్వరుడు II 1068–1076; ఆరవ విక్రమాదిత్యుడు 1076–1126; మూడవ సోమేశ్వరుడు 1126–1138; రెండవ జగదేకమల్లుడు 1138–1149; మూడవ తైలపుడు 1149–1162; నాల్గవ సోమేశ్వరుడు 1182–1200; కల్యాణిచాళుక్య రాజ్యమును పాలించిరి. మొదటి సోమేశ్వరుని కాలమున రాజధాని కల్యాణికి మార్చబడినది. అంతకు పూర్వ వీరి వంశీయులకు కొలనుపాక, మాన్యఖేటము రాజధానులుగా వర్ధిల్లినవి ఈ వంశమున చివరి రాజైన నాల్గవ సోమేశ్వరుడు అంతఃకలహములవలన వెంటనే సింహాసన మధిష్ఠింపలేకపోయెను.

ఈ బొల్లేపల్లి శాసనము రెండవ జగదేకమల్లుని పదియవరాజ్య సంవత్సరమున వేయించినది కావున అప్పటికి తెలంగాణములోని భువనగిరి నల్లగొండ ప్రాంతములు కాకతీయుల అధికారము క్రిందికి రాలేదని స్పష్టమగుచున్నది.

సమకాలిక రాజవంశములు

కల్యాణి నగరము రాజధానిగా పశ్చిమ చాళుక్య రాజ్యమును రెండవజగదేకమల్లుడు పాలించు కాలమున ఆంధ్రదేశమును వివిధ మండలాధిపతులు పాలించుచుండిరి. అందు చాళుక్య చోళులు వెలనాటి చోడులు, కాకతీయులు ముఖ్యులు.

1. చాళుక్యచోళులు

కుళోత్తుంగచోళుని పరిపాలనాకాలము క్రీ. శ. 1070-1120; అతని కాలమునం దాంధ్రదేశ ప్రతినిధులుగను, అతని తరువాత చాళుక్యచోళ రాజ్యాధినేతలుగను, ఈ క్రింది రాజులు పాలించిరి. రాజరాజముమ్మడిచోడుడు 1076–1079; వీర చోడుడు 1079–1084; రాజరాజచోడగంగు 1084–1089; రెండవ పర్యాయము–వీరచోడుడు 1089–1094; వీరపెర్మాడిదేవుడు 1094–1107; పరాంతకదేవుడు – 1107 - 1118; రెండవ విక్రమచోడుడు. 1118–1135; రెండవ కుళోత్తుంగుడు 1135–1150; రెండవ రాజరాజ చోడుడు 1150–1173; రాజాధిరాజు 1173–1179; ఇందు రెండవ కుళోత్తుంగుడు, కల్యాణి చాళుక్య రెండవ జగదేకమల్లుని సమకాలికుడు.

---

2. Indian Antiquary Vol. XVI. P. 15-24.

2. వెలనాటిచోడులు

వెలనాటి చోడు లాంధ్రదేశ ప్రతినిధులుగా పాలించుచు చోళరాజుల సామంతులుగ వ్యవహరించిరి. అందు గొంకరాజు 1076-1108; చోడరాజు 1108-1132; రెండవ గొంకరాజు 1132-1163; వీరరాజేంద్రుడు 1163-1180; మూడవ గొంకరాజు 1180-1186; పృథ్వీశ్వరుడు 1186-1203; ముఖ్యులు. వీరిలో రెండవ గొంకరాజు—రెండవ జగదేకమల్లుని కాలమువాడు.

3. కాకతీయులు

కాకతీయులు చాలకాలమువరకు పశ్చిమ చాళుక్యుల సామంతులుగ వ్యవహరించుచు వారి బిరుదములనే ధరించుచుండిరి. కాకతిరాజన్యులలో మొదటి బేతరాజు క్రీ. శ. 1000-1050; మొదటి ప్రోలరాజు 1050-1080; రెండవ బేతరాజు 1080-1115; రెండవ ప్రోలరాజు 1115-1158; రుద్రదేవుడు 1158-1195; మహాదేవరాజు 1195-1199; గణపతిదేవుడు 1199-1261; రుద్రమదేవి 1258-1296; ప్రతాపరుద్రుడు 1290-1326 ఆంధ్రదేశమును పాలించిరి.

రెండవ జగదేకమల్లుని కాలమున చాళుక్య చోళరాజ్యమును రెండవకుళోత్తుంగచోళుడును, వెలనాటి చోడరాజ్యమును రెండవ గొంకరాజును, కాకతీయరాజ్యమును రెండవప్రోలరాజును పాలించుచుండిరి.

చాళుక్యచోళసామ్రాజ్యాధినేతయగు రెండవ విక్రమచోళునిపాలనాకాలము క్రీ శ. 118-1135; ఇతని అవసానకాలమున, మాండలికరాజులగు వెలనాటి చోడులు, పశ్చిమచాళుక్యులను వేంగీమండలమునుండి తఱిమివేసిరి. రెండవ కుళోత్తుంగచోళుడు క్రీ. శ. 1133 లో యౌవరాజ్యాభిషిక్తుడై సైన్యముల నడిపి, కృష్ణానదికి దక్షిణముననున్న కుంతలసైన్యముల దరిమి, కృష్ణదాటి పశ్చిమచాళుక్య సైన్యమును గోదావరినదివరకు వెంటాడి వేంగీరాజ్యమును కల్యాణిచాళుక్యుల కబంధహస్తములనుండి విడిపించెను. కాని పశ్చిమ చాళుక్యుల అధికారము తెలంగాణమున నెలకొనియుండెను. వెలనాటి గొంకరాజు ఈ యుద్ధమున కుళోత్తుంగచోళునికి సహాయపడెను.

కాకతీయులలో రెండవబేతరాజు కల్యాణి చాళుక్య చక్రవర్తియగు ఆరవ విక్రమాదిత్యుని సామంతుడు. ఇతని పాలనాకాలము 1080-1115; ఆరవ విక్రమాదిత్యుడు 1076-1126 వరకు పరిపాలించెను. రెండవ ప్రోలరాజు పరిపాలనాకాలము 1115-1158; ప్రోలరాజు కాకతీయ రాజ్యమును పాలించుకాలమందు పశ్చిమచాళుక్యరాజ్యమును ఆరవ విక్రమాదిత్యుడు, మూడవ సోమేశ్వరుడు, రెండవ జగదేకమల్లుడును, ఒకరి తరువాత నొకరు పాలించిరి. ప్రోలరాజు పై ముప్వురికి సామంతుడుగ వ్యవహరించెను. కాని రెండవ జగదేకమల్లుని తరువాత మూడవ తైలపునికాలమున (1149-1162) కాకతిప్రోలరాజు విజృంభించి, తైలపుని అధీనమందున్న తెలుగుభూభాగములను జయించి తైలపుని బంధించి, విడిచిపుచ్చెను[3]. అప్పటినుండి కొలనుపాక ప్రాంతము కాకతీయసామ్రాజ్యాంతర్భాగమయ్యెను.

శాసనము — ఆకారాద్ధికములు

బొల్లెపల్లి మైలారదేవర ఆలయ ఆవరణలో ఈ శాసనపుస్తంభము భూమిలో పాతబడియుండ త్రవ్వించి వెలికితీసి శాసన ప్రతిబింబములను తీసికొనుట తటస్థించినది. శాసనశిల నల్లగానున్నది. శాసనాక్షరములు చెక్కబడినంతవరకు నునుపుగానుండి తరువాతి భాగము గరుకుగా నున్నది. శాసనశిల పొడవు 1.37 మీటర్లు, వెడల్పు 0 34 మీటర్లు. శాసనారంభమున సూర్యచంద్ర చిహ్నము లున్నవి.

---

3. 'హస్త్యారోహణకర్మకర్మఠగతిం చాళుక్యచూడామణిం; శశ్వద్యుద్ధ నిబద్ధగహ్వరమతిం యుద్ధే బబంధ క్షణాత్; శ్రీమత్తైలపదేవ మంబుదనిభ స్తంభేరమ స్తంభనాత్; ప్రఖ్యాతో రిపుకంఠఖండన విధౌ భక్త్యానురాగా జ్జహౌ.'—వేయి స్తంభాల గుడి శాసనము, పంక్తులు. 27-30;

శాసనాక్షరములు శాసనశిలకు నాలుగు వైపుల చెక్కబడినవి. శాసనము మొదటి ప్రక్క 21 పంక్తులు; రెండవ ప్రక్క 23; మూడవ ప్రక్క 18; నాలుగవప్రక్క 20 పంక్తులును కలవు మొత్తము శాసనము 82 పంక్తులలో కలదు. ఇది తెలుగు శాసనము శాసన విషయమంతయు, తెలుగు వచనములో నున్నది. చివరనున్న రెండు వ్యాస గీతా శ్లోకములు సంస్కృతములు శాసనమున కల్యాణీనగరము, కొల్లిపురము, భువనగిర్యాదులు పేర్కొనబడినవి.

లి పి

పండ్రెడవ శతాబ్దమునం దాంధ్రదేశమున వాడుకలోనున్న తెలుఁగులిపి ఈ శాసనమున వాడ బడినది. శాసనము వేయించినవాడు కొల్లిపుర ప్రభువు మేడెయభట్టు. శాసనమం దచ్చటచ్చట కొన్ని కన్నడ పదములున్నవి. ఈ ప్రాంతమున పశ్చిమ చాళుక్యుల కాలమున వెలసిన శాసనములన్నియు కన్నడ, సంస్కృత భాషలలో నున్నవి. తెలుగు శాసనము కనిపించుట విశేషము. ఇందు కన్నడ శాసనములలోవలె చాళుక్య వంశ ప్రశస్తి కలదు. శాసనాక్షరములు చక్కగా చెక్కబడినవి. ఈ శాసనాక్షరములు చందుపట్ల శాసనముల అక్షరములను పోలియున్నవి. శాసనము చెక్కిన శిల్పి పేరుగాని, శాసనరచయిత పేరుగాని ఇందు పేర్కొనబడలేదు.

భాష

శాసనారంభమునుండి, చివరి వ్యాసగీతాశ్లోకము వరకుగల శాసనభాగమంతయు వచనములో నున్నది. శాసనశిల నాలుగవవైపు పదునొకండవ పంక్తి చివరి నుండి వ్యాసగీతాశ్లోకము లారంభమగుచున్నవి. శాసనారంభమున సూర్యచంద్రుల చిహ్నములును, మూడవప్రక్క పైభాగమున డమరు త్రిశూల చిహ్నములును ఉన్నవి. శాసనము మొదట చాళుక్య ప్రశస్తి కన్నడభాషలో నున్నది ఇందు పృథ్వీవల్లభం, చాళుక్యాభరణం ఇత్యాదిపదము లున్నవి. శాసనమం దొకటి రెండు కన్నడపదములున్నను శాసనమంతయు తెలుగుభాషలో వ్రాయబడినది. 'ర'కారమునకు పూర్వాక్షరము ద్విత్వముగను, పుష్ప ఐదులు పుఃప ఆదులు కనిపించుచున్నవి.

ప్రవర్ధమాన—ప్రవర్ద్ధమాన
ఆచంద్రార్క—ఆచంద్రాక్కః
ప్రతాపచక్రవర్తి—ప్రతాపచక్రవత్తిః
స్వర్గ—స్వగ్గః

పుష్ప పుఃప ఇత్యాదులు శాసనమునం దచ్చటచ్చట కనిపించును.

శాసన విషయము

జగదేకమల్లుడు కల్యాణీ పురము రాజధానిగా చాళుక్యరాజ్యము నేలుచుండ నాతని రాజ్యవర్షములు 10 ప్రభవ సంవత్సర వైశాఖ శుక్ల అక్షయ త్రితీయ శనివారమునాడు వేంగినాంటిలోని కొల్లిపురమునకు ప్రభువును, అప్పనభట్టు బొల్లనమ్మ దంపతుల వరపుత్రుడును, పాదటూరి సోదరమల్లెయనాయక బిరుద నాయకుల తండ్రియు నగు మేడెయభట్టు, భువనగిరి ప్రతిబద్ధమైన బొల్లేపల్లి తూర్పున నన్దనవనమున సుధాధవళితోత్తుంగరమ్యమైన ఆలయమున మైలారదేవరను ప్రతిష్ఠచేసి ఆ దేవరకు అక్షతగంధపుష్పధూపదీపనైవేద్య తాంబూల వస్త్రాభరణాద్యంగభోగములకు ద్రవ్యనిధి నేర్పరచి బ్రాహ్మణులకు ప్రతిపదిరూకల మాడలును, దేవర పూజారి తుల్లికె యల్లిగంగనపకు చీరలకు రెండు మాడలును, పాడెడు వారికి ఐదు గద్యలును రాకాట వారికి మూడుగద్యలును, రంగవల్లి పెట్టువారికి ఒక మాడను ఏర్పాటు చేసెను. ప్రతిష్ఠాదులకు నూటఒక్కమాడ పెట్టెను. ఇతని కుమారుడు పాదటూరి సోదరమల్లె నాయకులు ఒక చెఱువు క్రింద నీరునేల ఒక మఱుతురును, బొల్లేపల్లి పడుమటి దివద్వారము పడుమట వురయేను పుట్టంగ పట్టు వెలివొలమును ధారాపూర్వకముగా నిచ్చెను.

కాలనిర్ణయము


రెండవ జగదేకమల్లుని పదియవరాజ్యసంవత్సరమున వేయించిన శాసనమిది. శాసనమున కల్యాణి పురము పేర్కొనబడినది. మొదటి సోమేశ్వరుని

కాలమున కల్యాణి నగరమును రాజధానిగా మార్చుట వలన కొలనుపాక ఇత్యాది నగరములు, సామంత మాండలిక రాజుల యధీనమందుండెను రెండవ జగదేకమల్లుని పరిపాలనా కాలమున కొల్లిపాక లేక కొల్లిపురము లేక కొలనుపాక వేంగినాటిలో నుండెను. మేడెయభట్టు కొల్లిపురము ప్రభువుగా ఈ శాసనమున వర్ణింపబడినాడు. ఇతడు భారద్వాజగోత్రుడు ఈ శాసనమున పేర్కొనబడిన వేంగినాడు, వేంగీ విషయము మాత్రముకాదు వేంగోరాష్ట్రము, వేంగినాడు, వేంగీ విషయములు వేర్వేరు మండలములు. వేంగోరాష్ట్రము నెల్లూరు మండలములోను, వేంగీ విషయము గోదావరి మండలములోను, వేంగినాడు తెలంగాణములోని నల్లగొండ మెదకు మండలములలోను వుండెను. ఈ వేంగినాడు పశ్చిమచాళుక్యులకు సంబంధించినది. ఈ శాసనమున పేర్కొనబడిన భువనగిరి, బొల్లేపల్లి, నందనవనము లేక నందనము, ప్రొద్దుటూరు, బ్రహ్మపురి లేక బ్రహ్మదేవరపల్లి — భువనగిరి తాలూకాలోను రామన్నపేటతాలూకాలోను ఉన్న గ్రామములు.

శాసనము చాళుక్యప్రతాపచక్రవర్తి జగదేకమల్లవర్షాలు 10–ప్రభవ సంవత్సరము వైశాఖ శుక్ల తదియ శనివారమున వేయించబడినది. ఇందు పేర్కొనబడిన ప్రభవ సంవత్సరము శా. శ. 1068 కి సరిపోవును. అనగా రెండవ జగదేకమల్లుని పదియవ రాజ్య సంవత్సరము. శక సంవత్సరము 1068 అగును. లేక క్రీ. శ. 1146 అగును ఇతడు రాజ్యమునకువచ్చిన సంవత్సరము క్రీ శ. 1136 అగుచున్నది. కావున జగదేకమల్లుని పరిపాలనా కాలము క్రీ. శ 1136–1149. ఇతని యనంతర విగాతని యనుజుడు మూడవ తైలపుని కాలమున కాకతి రెండవ ప్రోలరాజు చాళుక్యరాజ్య భాగములపై దండెత్తి యుద్ధము లొనర్చి తైలపుని బంధించి, చాళుక్య సామ్రాజ్యముననున్న తెలుగు భూభాగములగు నల్లగొండ, కొలనుపాక, మహబూబు నగర ప్రాంతములను తన రాజ్యమున జేర్చుకొని తైలపుని గౌరవముగా విడిచిపుచ్చెను. రుద్రదేవుని కాలము నాటికి పశ్చిమచాళుక్యసామ్రాజ్యము పతనమయ్యెను.

మేడెయభట్టు శాసనము


మూలము: మొదటి ప్రక్క



1. ఓం స్వస్తి సమస్త భువనాశ్ర
2. య శ్రీ పృథ్వీవల్లభ మహా
3. రాజాధిరాజ పరమేశ్వ
4. ర పరమభట్టారక సత్యాశ్ర
5. య కులతిలక చాళుక్యా
6. భరణం శ్రీమజ్జగదేక మ
7. ల్లదేవర విజయరాజ్య
8. ముత్తరోత్తరాభివృది ప్రవ
9. ర్ధమాన మాచంద్రార్కతారంబు
10. కల్యాణీపురము వెలవిట సు
11. ఖసంకథా వినోదంబున
12. రాజ్యంబు సేయుచునుండ
13. శ్రీమచ్చాళుక్య ప్రతాప చ
14. క్రవర్తి జగదేకమల్లవర్షాలు
15. 10 గు ప్రభవ సంవత్సర వైశా
16. ఖ శుక్లపక్ష మక్షతృతీయ
17. యు వడ్డవారమునాండు వేంగి
18. నాటిలోని కొల్లిపురము ప్ర
19. భుపు భారద్వాజగోత్ర పవిత్రుం
20. డు మేడెయభట్టు తత్పుతుండు
21. శ్రీమత్ పాదటూరి సొదర


బొల్లేపల్లి శిలాశాసనములు

రెండవ ప్రక్క



1. మల్లెనాయక బిరుద నా
2. యకుల బ్రహ్మపురి అ
3. ప్పన భట్లు తత్పుతి బొల్ల
4. నమ్మ తద్దంపతుల వర
5. పుత్రుండు మేడెయ
6. భట్లు శ్రీమతు పెంజెఱ
7. మైలార దేవర పంప్పాన
8. భువనగిరి ప్రతిబద్ధము
9. బొల్లెపల్లి ముందటి ఈ
10. న్త్రగామ తూప్పూ వన్దన
11. వనములోపల సుధా
12. ధవళి తోత్తుంగ రమ్య
13. మైనవవశాడము సేయిం
14. చి యందు మేడెయభ
15. ట్లు శ్రీ మైలార దేవరను
16. ప్రతిష్ఠ సేసిరి॥ ఆ దే
17 వర నగరికి వచ్చు చన్ద్ర
18. రావులోన దేవరకు న
19. క్షత గంధ పుష్ప ధూ
20. ప దీప నైవేద్య తాంబూ
21. ల వస్త్రాభరణాద్యంగ
22. భోగములకుం దగిన
23 ద్రవ్యము నివిధి గొన


మూడవ ప్రక్క



1. ద్రవ్యవ్రయము అధ్యక్షకుం
2. డెదు బ్రాహ్మణ జీవితము
3. నకు వర్షం ప్రతి పదిరూకల
4. మాడలు॥ దేవర పూజారి
5. మల్లికేయతల్లి గంగనవకు
6. చిరెలకు మాడలు ౨ పాడె
7. డు వారికి గద్యలు ౫ రాకా
8. ట వారికి గద్యలు ౩ రంగవ
9. లి వెట్టు వారికి మాడ ౧ ఇట్టి
10. ధలకు నీ మార్గమున మేడె
11. యభట్టు పరితవించిన దేవ
12. కార్యము దప్పక నడిపిన వా
13. రు స్వర్గగాములు నడపక త
14. ప్పినవారు నరకగాములు॥
15. మేడెయభట్టు దేవత ప్ర
16. తిష్ఠాద్రబయము వెల
17. విపదిసేసి రూక
18. మాడలు నూటయొకటి.

బొల్లేపల్లి శిలాశాసనములు

నాలుగవ ప్రక్క



1. దేవరకు పొదటూరి
2. సొదరమల్లెయ నా
3. యక బిరుద వాయ
4. కులు నిర్వాణి చెఱ
5. వు పిఱుద నిండు మ
6. ఱుతు రు ౧. బొల్లెప
7. ల్లి పడుమటి శివద్వా
8. రము పడుమట పుర
9. యెమ పుట్లుపట్టు వెలి
10. పొలము ను ధారాపూ
11. ర్వకము సేసిరి। స్వద
12. త్తాం పరదత్తాం వా యో
13. హరేతి వసుంధరాం ష
14. ష్టిం వర్ష సహస్రాణి వి
15. ష్టాయాం జాయతే క్రిమి
16. ః।. శత్రుణాపి కృతో ధ
17. ర్మ్మః పాలనీయః ప్రయ
18. త్నతః। శత్రురేవహి శ
19. త్రుస్యాత్ ధర్మ్మః శత్రు
20. ర్న కస్యచిత్—

బొల్లేపల్లి శిలాశాసనము

ఈ శాసనము బొల్లేపల్లి ఆలయ ఆవరణములో రెండవ జగదేకమల్లుని కాలమున మేడెయ భట్టు వేయించిన శిలాశాసనముదగ్గర నున్నది. శాసనము కాకతిరుద్రదేవమహారాజుల కాలమున శక వర్షాలు 1189 ప్రభవ సంవత్సర ఆషాఢ శుద్ధ పాడ్యమి గురువారము నాడు వేయింపబడినది. కాకతి రుద్రమాంబ రుద్రదేవమహారాజను పేర రాజ్యపరిపాలనము చేసెను. రుద్రాంబ పరిపాలనాకాలము క్రీ. శ. 1258 1296; రెండవ జగదేకమల్లునికాలపు శాసనము వెలసిన నూటయిరువది సంవత్సరముల కీ శాసనము వేయించబడినది. ఈ రెండు శాసనములును ప్రభవసంవత్సరములో నీయబడినవి.

ఈ శాసనము శాసనశిలకు నాలుగువైపుల జెక్కబడినది. శాసనమున నాలుగవప్రక్క తొమ్మిదవ పంక్తివరకును శాసనము వేయించినవారి బిరుదములు గుణగణములు వర్ణింపబడినవి. శాసనము శక సంవత్సరము 1189 ప్రభవ ఆషాఢ శుద్ధ పాడ్యమి గురువారమునాడీయబడినది. శక సంవత్సరము 1189 క్రీ. శ 1267 కు సమానము.

రుద్రమాంబ రాజ్యమునకు వచ్చిన తొమ్మిదవ సంవత్సరమున, ఈ శాసనము వేయింపబడినది.

శాసనము నల్లరాతిస్తంభము నాలుగువైపుల చెక్కబడినది. శాసనాక్షరము లున్నంతవరకు నునుపుగా చెక్కబడి మిగిలినభాగము గరుకుగా నుంచబడినది. శాసనమున మొదటివైపు 20 పంక్తులును, రెండవ వైపు 20 పంక్తులును, మూడవప్రక్క 22 పంక్తులును, నాలగవవైపు 31 పంక్తులును ఉన్నవి. మొత్తము శాసనము 93 పంక్తులలో నున్నది.

శాసనస్తంభము పొడవు 1.45 మీటర్లు. వెడల్పు 0.30 మీటరు. శాసనమున మూడవ ప్రక్క పైభాగమున సూర్యచంద్రుల చిహ్నము లున్నవి.

ఈ శాసనమున కొన్ని అక్షరములు పెద్దవిగను మరికొన్ని చిన్నవిగను ఉన్నవి. ఆంధ్రదేశమున పదమూడవ శతాబ్ది ఉత్తరార్థమున వాడుకలోనున్న తెలుగు లిపి ఈ శాసనమున వాడబడినది.

మేడెయభట్టు శాసనమున పేర్కొనబడిన మైలారదేవుడే ఈ శాసనమున పేర్కొనబడిన మల్లయదేవుడు. మైలారదేవుడు, మల్లయదేవుడుగా మారియుండవచ్చును. ఇందు పేర్కొనబడిన వడపర్తి భువనగిరి తాలూకాలోనున్న వడపర్తి గ్రామము; స్వయంభూదేవాలయ మీ గ్రామమున నుండియుండ వచ్చును.


ఈ శాసనము బొల్లేపల్లి గ్రామమును పేర్కొనుచున్నది. మేడెయభట్టు శాసనలిపికిని ఈ శాసనలిపికిని ఎంతో వ్యత్యాసమున్నది. నూటఇరువది సంవత్సరముల కాలములో లిపి తన పూర్వస్వరూపమునే కోల్పోయినది. ఈ శాసనలిపి ఆధునిక తెలుగు లిపి కత్యంతసన్నిహితముగా నున్నది.

తేజాల ఏడిండ్లరడ్లు బొల్లేపల్లి మల్లయదేవునికి, ఒక మఱ్ఱు నీరునేల ముప్ఫయిమఱ్ఱుల వెలిపొలము ఇచ్చు సందర్భమున ఈ శాసనమును వేయించినారు. శాసనాంతమున స్థానాపతుల పేర్లు తెలుపబడినవి శాసనాంతమున వ్యాసగీతాదులు కూడా లేవు శాసనము పూర్తిగా బిరుదములు ప్రశస్తితో నిండిపోయినది. కాకతీయులకాలపు శాసనము కావున, ఈ ప్రశస్తిగల రెడ్డివంశీయులకు సంబంధించిన ఇతర శాసనములు లభించినవారి చరిత్రను సమన్వయ పరచుకొనుటకు తోడ్పడును.


బొల్లేపల్లి శిలాశాసనము, తేజాల ఏడిండ్ల రెడ్ల శాసనము

మూలము: మొదటి ప్రక్క

1. స్వస్తిశ్రీ విజ
2. యాభ్యుదయ
3. శ్బ శక వరుషంబు
4. లు ౧౧౨౯ అగు
5 నేంటి ప్రభవ
6. సంవత్సర ఆ
7. షాఢ శుద్ధ పా
8. డ్యమి గురు
9. వారాన స్వ
10 స్తిశ్రీ మను
11. మహామం
12 డలేశ్వర కాక
13. తియ్య రుద్రదేవ
14. మహారాజులు
15. ఉత్తరోత్తరాభివ్ర
16 ద్ధిగాం ప్రిథివీ రా
17. జ్యాంబు సేయుచు
18. నుండంగాను
19. స్వస్తి సమస్త గుణ
20. గణాశ్రయ వీర ల



రెండవ ప్రక్క



1. క్షేత్ర నివాస జ
2. ంధుజన చిం
3 తామణి । దీన
4. జనకల్పవృక్ష
5. భగవతీ వరప్ర
6 సాద । లబ్ధ వి
7. జయుండు
8. ను । సంగీత వి
9. ద్యావినోద ।
10. చతుర దధి
11. వసుంధర అర్థి
12. బిరుదనాయక
13. బంపిదేవండు
14. ను । అశి ముశి
15. ల కణయ కంప
16. ణ తోమర ము
17. శిండి బిండివా
18. ల ముద్గర కాముర్క
19. శాస్త్ర విద్యాపా
20. రంగటుండు


బొల్లెపల్లి శిలాశాసనము లు

మూడవ ప్రక్క

1. పరనారీ దూరుం
2. డును । పతిహిత
3. గరుడుండును । స
4. మర సొంఖ్యుండు
5. ను । విడినాయక
6. గజకేసరి। బిరు
7. ద నాయక జీమూ
8. త వవనుండును ।
9. గండగొటమల్లుండు
10. ను । సమరజయా
11. జ్ఞానుండును । సత్య
12. హరిశ్చంద్రుండును
13. విభవ దేవేంద్రు
14. ండును । విద్వజ్జన
15. రక్షకుండును । ప
16. ర బల శిక్షకుండు
17. ను తురకరి వర
18 తుండును ఉదా
19. ర కణ్ణాండును శ్రీ
20. మద్ నిజవంశ వా
21. ద్ధిణావద్ధణాన సుధా
22. కరుండును



నాల్గవ ప్రక్క



1. వాడపల్లి శ్రీ నయ
2. ంభాదేవ దివ్యశ్రీపా
3. ద పద్మారాధకుం
4. డును। లాడింగ ము
5. స్నీఱు వడలసగన గరు
6. డ నామాది సమ
7. స్త ప్రశస్తి సహితు
8. శ్రైన శ్రీమతు తెలు
9. ల ఏడిండ్లరడ్లున్ను
10. బొల్లెపల్లి మల్లయ
11. దేవునికి పురము పు
12. డ్లయతి అంతవట్టు నిచ్చి
13. తిమి ప్రత్తినీరునేల
14. మఱుతురున్ను వెలి
15. వొలము ముఫయి
16. మఱుతురున్ను కార్తీ
17. క వైశాఖాల సర్వమా
18. న్యముగా నిచ్చితిమి।
19. ఇంత, వట్టులేద
20. న్నం దప్పి గంగకట్టు
21. కపిలం బొడ్చిన పాప
22. ము॥ రాజ్యాలు ఎప్పి చె
23. దిరినాను మల్లిసెట్టి
24. కాసూరి మనుమం
25. డు మల్లి మల్లెసెట్టి
26. పూజారి జాతగొండ
27. పూజారి రేవపలువి
28. పురమునకు సొనప
29. తులు దిరుగొరాన సా
30. రుహ చతుసా సా
31. తకులు.

నళిని

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

దళములు విప్పి తీయగ సు
తారపు తావులు జలుచున్న ఓ
నళిని! భవత్తనూ విలస
నమ్ముల కాదరు వీ వెఱుంగుదే ?
తళుకులు లేని లోతు బుర
దన్‌గల సారము వల్ల అన్నచో
అళుకగునేమొ—కాని నిజ
మద్ది మృణాలము తెచ్చి ఇచ్చెదున్ !

ఆ లోతుల నీలిమలో
జాతే కనరాని ధ్వాంత సంక్రాంత జితో
ద్యోతిత గర్భాంతరముల
మాలిన్యమె నీ విలాస మధుఖాతముతో !

దూర సాగర వారి నీరదమ్ములు మోసి
కొని వచ్చి వర్షించ కొలను నింపు—
లోతులందు కళంక రూషితమ్ములు వ్రేళ్ళ
మూల మూలల సారములు గ్రహించు—
ఖరకర చ్ఛవిని పుష్కలమగు ఆహార
ముగ పత్రములు మార్చి పాదుపానర్చు—
నినుమోసి తిన్నగా నిలుపుకోసము మృణా
లము జీవితము సమర్పణము సేయు—
ఇంత శ్రమనైన పరిణామ మీవు ! నేడు
కులుకుచున్నావు చిరుగాలి అలల కలల—
అరుణ దళపాళి, చాంపేయ ఖరళరజము,
మధుమరందము నవపరీమళము లురల !

నిను నిందించుట కాదో
వనరాణి ! కాని నీ మనసున నిలుపవీ,
ఘనసత్యమ్మిది, మరువక
అనయమ్మును—నీకు శుభమె అగుతే భావిన్ !

అటుగాక మరచి సర్వము,
పటు దర్పోద్ధతిని వీగి పడుదువ, తుది సం
కట మగు—తుంటరి ప్రేళుల
చిటిలి మలినమయి దళాలు చెదరును దెసలన్ !

అందుకొరకె ఈ నగ్న సత్యప్రబోధ -
విన్ను కనిపెంచి చక్కగా నిలిపినట్టి
వారియెడల, పరాశక్తిపట్ల, ఎపుడు
జారనీకు కృతజ్ఞతా భారమెడద !

ఏ మధువ్రత సుధా ప్రేమ గీతారవ
మాధురీ ఝరిణీ నిమగ్నవగుటొ—
ఏ కన్యకా కర్ణికా కుసుమంబువై
ప్రేలి తీయని కల తేలిపడుటొ—
ఏ విభాతార్క శోభా విలాసారుణ
కర పరిష్వంగ సుఖమ్ము గనుటొ —
ఏ దివ్య మంగళ శ్రీదైవ పదధూళి
అమరత్వ మందుటొ అంకితమయి—
వెనుక ఎంతటి శ్రమ కూడుకొనిన తుదకు
క్రమగతి విచిత్ర సృష్టి రంగమున జరుగు
నాటకమున ఏదొ ప్రయోజనమ్ము కొరకు
కదలు పాత్రల నీవు ఒక్కరిత వగుము !

ఆ పరమోద్దేశమేదో,
ఏ పరమాత్ముని ప్రయత్నకృతమో, ఏ లీ
లా పరిణామమొ, తెలియగ
నోపరులే ధరణి నెవ్వరింతటి దాకన్ !

ఏమయిన నేమి—క్షణమి టు
లీ ముగ్ధ మనోజ్ఞరూప నిర్మల దృశ్యం
బీ మది తన్మయ మొనరిచె !
నా మన్నన లందుకొనుము నవసుమరాజ్ఞీ !

వ్యాపారార్థక నామ్నీకరణం

శ్రీ చేకూరి రామారావు

క్రియ వ్యాపార బోధకం. వ్యాపారం భౌతికమూ కావచ్చు, మానసికమూ కావచ్చు. అర్థమగు, అర్థంచేసుకొను, ఎరుగు, తెలియు మొదలైనవి మనో వ్యాపారబోధకాలు. ఆడు, పాడు, కొట్టు, పెట్టు మొదలైనవి భౌతికవ్యాపారబోధకాలు. చూచు, విను వంటి ధాతువులు పై విభాగంలో దేనికిందకి వస్తాయో చెప్పలేం. బహుశా ఇంద్రియ వ్యాపార బోధక ధాతువులని వేరే విభాగం చెయ్యవచ్చేమో. ఈ ధాతువుల్లో కొన్ని కర్త్రపేక్షకాలు, మరికొన్ని కర్త్రనపేక్షకాలు. ఆకలిఅగు, జబ్బుచేయు, దాహం వేయు మొదలైన క్రియలకు కర్త అవసరం ఉన్నట్టు కనిపించదు. ఉదాహరణకు.

(87) నాకు ఆకలి అవుతున్నది.
నీకు దాహం వేస్తున్నదా?
మా అమ్మాయికి జబ్బు చేసింది.

పై వాక్యాల్లో ఫలానిపదం కర్త అని చెప్పలేం. ఆగు, వేయు, చేయు క్రియలకు క్రమంగా ఆకలి, దాహం, జబ్బుఅనే పదాలు కర్తలుగా చెప్పటం ఒక పద్ధతి. కాని పై వాక్యాల్లో ఈ క్రియలు వ్యక్తం చేసే అర్థం అవిన్యస్తంగా ఉపయోగించినప్పటికంటె భిన్నం. పైగా ఆకలి, దాహం, జబ్బువంటి నామాలు అమూర్తపదార్థవాచకాలు. ముఖ్యంగా దేహస్థితిని తెలియజేసేవి. ఇవి వ్యాపారకరణసమర్థాలు కావు. అందువల్ల ఇవి Agent అనే అర్థంలో కర్తలుగా ప్రవర్తించలేవు. అందువల్ల పైన పేర్కొన్న ధాతువులు ఆ నామాల్ని క్రియలుగా ప్రవర్తింపజేయటానికి తెచ్చుకున్నవే. కొన్నినామాల్ని క్రియలుగా ఉపయోగించవలసివచ్చినప్పుడు ఆగు, చేయు, పడు, వేయు వంటి ధాతువుల్ని అనుసంధించి శబ్దపల్లవక్రియలను తయారుచేసుకోటం తెలుగు భాష అనుమతించే పద్ధతి. ఇంగ్లీషులో అయితే అవసరంవచ్చినప్పుడు ఏ నామాన్నైనా సునాయాసంగా క్రియగా ఉపయోగిస్తారు. అంటే ప్రత్యయాన్ని విధించకుండానే ఇంగ్లీషులో నామాన్ని ధాతువుగా వాడుకునే పద్ధతి విరివిగా ఉంది. తెలుగులో 'ఇంచు'వంటి ప్రత్యయంగాని, ఆ పనిని నిర్వహించే ధాతువుగాని అనుసంధించటం అవసరం అవుతున్నది. అట్లా ఏర్పడిన 'అవస్థపడు, బాధపడు, చిక్కుపడు' మొదలైన ధాతువు లుపయోగించినప్పుడా వాక్యాలు కర్త్రపేక్షకాలు. మరికొన్ని శబ్దపల్లవ క్రియలు–(87) లో ఉదాహరించిన వాక్యాల్లోలాగా–కర్త్రనపేక్షకాలు. ఈ రకపు క్రియలు కొన్ని (88) లో ఉదాహరించబడుతున్నై.

(88)

ఆకలిఅగు	పిచ్చిఎక్కు
కష్టంవేయు	పిచ్చిఎత్తు
జబ్బుచేయు	మదం ఎక్కు
జలుబుచేయు	తిక్కపుట్టు
జ్వరంవచ్చు	తిక్కరేగు
కొవ్వుఎక్కు	

పైన పేర్కొన్న శబ్దపల్లవక్రియలు ఉదాహరణప్రాయాలు మాత్రమే. ఇట్లాంటివి ఆలోచిస్తే ఇంకా పై పట్టికను పెంచవచ్చు. పై క్రియలు ప్రాణుల దేహ మన స్థితులను తెలియపర్చేవి. ఇవి ఉపయోగించిన వాక్యాల్లో ఈ క్రియలకు కర్త ఉండదు. ఈ 'స్థితి'కి ఆశ్రయమైన ప్రాణుల్ని బోధించే నామాలకు తెలుగులో 'కు' విభక్తి చేరుతుంది. ఆ నామాల్నే కర్తలుగా చెప్పి 'దేహమనస్థితిబోధక క్రియల కాశ్రయమైన కర్తకు 'కు' వర్ణకం బహుళంగా అవుతుంది'అని సూత్రం చెప్పుకోవచ్చు. బహుళం అనటం 'పడు, పెట్టు'లతో వచ్చే క్రియలను (బాధపడు, బాధపెట్టు మొ॥) నిరోధించటం

కోసం. పై పద్ధతి సూత్రీకరణ ఈ ప్రస్తుత సమస్యను తాత్కాలికంగా పరిష్కరిస్తుందికాని 'కర్త' అనే పదప్రయోగానికి కొన్నిచిక్కుల్ని తెచ్చిపెడుతుంది. 'కర్త' అనే పదం మన వ్యాకరణాల్లో ముఖ్యంగా Agent అనే అర్థంలో వాడారు. 'కర్త' అనే పదాన్ని ఉపయోగించటంలో మన వ్యాకర్తలు అన్నిచోట్లా సరిఅయిన మార్గాన్ని అవలంబించారని చెప్పటానికి వీల్లేదు. ఈ విషయం ముందుముందు తెలుస్తుంది.

ధాతువుల్లో అకర్మకక్రియలు, సకర్మకక్రియలు అని రెండు రకాలున్నై. ఇంచుగాది ప్రత్యయాలు (ప్రత్యయ తుల్యమైన ధాతువులు కూడా) చేర్చటంవల్ల కొన్ని అకర్మకక్రియలు సకర్మకక్రియలుగాను, సకర్మకక్రియలు ప్రేరణార్థకాలుగానూ మారతై. ఈ పద్ధతులు ప్రాచీనవ్యాకరణాల్లో ప్రసిద్ధమే. కాని ఈ పై విభాగం వాక్యంలో వ్యక్తనిర్మాణాన్ని[1] (Surfasce structure) సూచించినట్లు గుప్తనిర్మాణాన్ని[1] (Deep structure) సూచించదు.

ఉదాహరణకు ఈ కింది వాక్యాల్ని పరిశీలించండి.

(89) అద్దం పగిలింది.

(90) కిష్టప్ప అద్దం పగలగొట్టాడు.

(89) లో పగులు అకర్మకం, (90) లో పగలగొట్టు సకర్మకం. (89) లో అద్దం కర్త. (90) లో అద్దం కర్మ, కిష్టప్ప 'కర్త'. కాని ఈ రకమైన సాంప్రదాయిక విభాగం ఈ వాక్యాల గుప్తనిర్మాణాలకున్న సామ్యాన్ని సరిగ్గా సూచించదు. నిజానికి రెండు వాక్యాలూ ఏకవ్యాపారబోధకాలే ఈ రెండు వ్యాపారాలూ జరిగింది అద్దంమీదే. అంటే ఈ రెండు వాక్యాల్లోనూ 'అద్దం' అనే నామ ప్రవర్తన గుప్తనిర్మాణంలో ఒకటే: ఈ సామ్యాన్ని సాంప్రదాయికమైన కర్త కర్మ విభాగం సూచించదు: (89) గుప్తనిర్మాణంలో అద్దం కర్త (Agent) కాదు. ప్రాణి వాచకాలు మాత్రమే వ్యాపారకరణ సమర్థాలు కనక అవే కర్తలుగా ప్రవర్తించగలవు. పై రెండు వాక్యాలకి భేదం ఇది. (89) లో కర్త లేదు. (90) లో కర్త ఉంది. అయితే (89) లో అద్దం ఏమిటి? అనే ప్రశ్న ఉంది. ఈ కింది చిత్రణను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది.

(91) 1	2	3	
opearator (Agent)	operand (Affected)	operation (Action)	
—	అద్దం	పగిలింది	(89)
కిష్టప్ప	అద్దం	పగలగొట్టాడు	(90)

తెలుగులో 1, 3 వరసలకు కర్త, వ్యాపారం అనే పేర్లుపయోగించుకోవచ్చుగాని, 2 వ వరసకి సరిఅయిన మాట ప్రసిద్ధంగా లేదు. అట్లాంటి మాట (89) (90)ల మధ్య ఉన్న సామ్యాన్ని సూచించటానికి అవసరం అని (91) లో చిత్రణనుచూస్తే తెలుస్తుంది. ఈ పద్ధతిలో కర్త అనే పదానికి అర్థం సంకోచించి పటిష్ఠం అయింది.

---

1. పూర్వవ్యాసాల్లో (చూ. భారతి జులై ఆగస్టు 1968) Deep Structure కి లోపలి నిర్మాణంఅనీ, Surface Structure కి వెలుపలి నిర్మాణంఅనీ వాడాను. ఈ వ్యాసంలో పై పదాలకు బదులుగా గుప్తనిర్మాణంఅనీ, వ్యక్తనిర్మాణం అనీ వాడుతున్నాను.

Christopher Caudwell తన Illusion and Reality అనే కవిత్వతత్వ గ్రంథంలో (Published by People's publishing house Delhi 1956 page 213) latent content, manifest content అనే రెండు మాటల్ని దాదాపు Deep and Surface అనే అర్థాల్లోనే కవిత్వపరంగా వాడాడు. ఈ మాటల్ని కె. వి రమణారెడ్డిగారు గుప్తవస్తువు, వ్యక్తవస్తువు అని Caudwell మీద వ్యాసం రాస్తూ తెనిగించారు. (చూ. సంవేదన త్రైమాసిక, కడప, అక్టోబరు 1968). రమణారెడ్డిగారి తెలుగు మాటల్ని భాషాశాస్త్ర పారిభాషక పదాలుగా ఈ వ్యాసంలో ఎంచుకుంటున్నాను. పూర్వం వాడిన లోపలి నిర్మాణం, వెలుపలి నిర్మాణం అనే మాటలు వివరణకోసం పనికొస్తై.

తెలుగులో సకర్మకక్రియలకు ప్రత్యయాల్ని చేరిస్తే ప్రేరణార్థక రూపాలువస్తాయి. ఉదాహరణకి (90) ని ప్రేరణార్థక వాక్యంగా మలిస్తే ఇట్లా ఉంటుంది.

(92) లచ్చప్ప కిష్టప్పచేత అద్దం పగలగొట్టించాడు.

సాంప్రదాయిక వ్యాకరణ పద్ధతిలో (90) లో కర్త అయిన కిష్టప్ప అనే మాట (92) లో కర్మ అయింది (92) లో లచ్చప్పను కర్త అనాలి. దీనికి ప్రయోక్త అనే మాట ప్రసిద్ధంగా ఉంది. కాని (92) లో 'అద్దం' ఏమవుతుందో సాంప్రదాయిక వ్యాకరణ పద్ధతిలో తెలీదు. (91) లో చిత్రణను కొద్దిగా మార్చిచూస్తే ఇక్కడున్న చిక్కు ఏమిటో తెలుస్తుంది.

ఈ సందర్భంలో సూరిగారి 'గతిబుద్ధి ప్రత్యవసానార్థ శబ్దకర్మాకర్మకంబులకు ప్రేరణంబునం గర్త యగునది ప్రేరణంబునం గర్మంబగు- (బాలవ్యా. క్రియ. 123)' అనే సూత్రం (90)-(92) ల మధ్య వ్యక్తనిర్మాణంలో జరిగిన మార్పునే సూచిస్తుందిగాని (89), (90), (92) వాక్యాల గుప్తనిర్మాణాల్లో సామ్యాన్ని సూచించదు.

అంటే ఈ పద్ధతిలో కిష్టప్ప (90) (92) రెండు వాక్యాల్లోనూ కర్తే అన్నమాట (93) సంఖ్యగల పట్టికలో బ్రాకెట్లతో ఉంచిన రూపాలు వ్యక్తనిర్మాణంలో వస్తాయి. ఈ రకమైన పరిశీలనవల్ల 'కర్తకు చేత వర్ణకంబగు' అనే సూరిగారిసూత్రానికి ఆయన ఉద్దేశించిన దానికంటె ఎక్కువ వ్యాప్తి ఉన్నట్టు గ్రహించవచ్చు. అంటే కర్మార్థంలోనేకాక, ప్రేరణార్థంలో కూడా ఈ వ్యాసంలో ఉపయోగించిన అర్థంలో కర్త అయిన పదానికి 'చేత' వర్ణకం అవుతుందన్నమాట.

పై చర్చవల్ల తేలిన ముఖ్యాంశాలివి 1. సాంప్రదాయికమైన అర్థాల్లో, కర్త, కర్మ విభాగం వాక్యాల గుప్తనిర్మాణాల్లో సామ్యాన్ని సరిగ్గా సూచించదు. 2. గుప్తనిర్మాణాల్లో మారని ప్రవర్తన గల పదాల వ్యాకరణప్రవర్తన సూచించటానికి వేరే పదాల్ని ఎంచుకోవాలి. 3. సకర్మక, అకర్మక క్రియా విభాగం భాషలో వ్యక్త నిర్మాణాన్ని సూచించటానికి మాత్రమే పరిమితం.

బహుశా 'క్రియ' అనే మాటనికూడ వ్యక్తనిర్మాణపుపదంగానే గ్రహించి 'వ్యాపారం' అనేమాటని గుప్తనిర్మాణపుపదంగా ఉంచవచ్చునని తోస్తున్నది. సౌలభ్యంకోసం గుప్త వ్యక్త నిర్మాణాల్లో ఉపయోగించదగిన పరిభాషా పదాలని కింద సూచిస్తున్నాను.

Deep Structure		Surface Structure	
ఇంగ్లీషు	తెలుగు	ఇంగ్లీషు	తెలుగు
Initiator	ప్రయోక్త	Subject	?
Operator	కర్త	Object	కర్మ
Operand	?	Verb	క్రియ
Operation	వ్యాపారం		

పైన ప్రశ్నార్థకాలుంచిన చోట సరిఅయిన తెలుగు మాటలు దొరకలేదు. ఈ విషయాల్ని గురించి ఆలోచించ దల్చుకున్నవారికోసం పైపట్టిక కూర్చబడింది.

	1	2	3	4	
(93)	Initiator (Causer)	Operator (Agent)	Operand (Affeted)	Operation (Action)	
	ప్రయోక్త	కర్త	?	వ్యాపారం	
		—	అద్దం	పగులు	(89)
	—	కిష్టప్ప	అద్దం	పగులు (+కొట్టు)	(90)
	లచ్చప్ప	కిష్టప్ప (+చేత)	అద్దం	పగులు (+కొట్టు+ఇంచు)	(92)

ఈ పైచర్చ, వివరణ కొంత దీర్ఘమైనా వ్యాపారానికీ, అందులో భాగస్వాములకీ (Patricipants) ఉన్న తార్కికసంబంధాన్ని సూచించటానికి చెయ్యబడింది[2]. ఇదైనా ఏమాత్రం సమగ్రమనటానికి వీల్లేదు. సూచనప్రాయంగానే గ్రహించాలి. పైన సూచించిన పద్ధతుల్లో ఇతోధికమైన పరిశోధన జరిగితేనే తప్ప ఒకపాటి సమగ్రమైన వివరణ అయినా సాధ్యంకాదు. ప్రస్తుతవ్యాసంలో ఈ వ్యాసకర్త చెప్పదల్చుకున్నది గ్రహించటానికి కొంతైనా పనికొస్తుంది. ఇక వ్యాపారార్థకనామ్నీకరణాన్ని గురించి.

ఆధునికభాషలో 'అటం' భావార్థక ప్రత్యయమనీ, అది క్రియాపదానికి చేరటంవల్ల కాల, పురుష బోధక ప్రత్యయాలకు లోపం జరిగి ధాతువు మాత్రమే మిగిలి ఈ రెంటి సంయోగం వల్ల భావార్థక రూపం నిష్పన్నమవుతుందనీ, నామ్నీకరణాల మొదటి వ్యాసంలో (భారతి—మే. 1968) సూచించబడింది భావార్థకరూపనిష్పత్తికి ఆ సూచన అంగీకరించక పోయినా[2] కాలబోధకప్రత్యయగ్రహణ సమర్థమైన ధాతువులకు మాత్రమే 'అటం' చేరుతుందనటం నిర్వివాదం. ఆ భావార్థక రూపంతో కూడిన వాక్యాలు విషయార్థకనామాలుగా ప్రవర్తించే పద్ధతి ఆ వ్యాసంలో చర్చించబడింది. ఆ రకపు వాక్యాలు వ్యాపారార్థక నామాలుగా కూడా ప్రవర్తించే విధానం ఈ వ్యాసానికి విషయం. అంటే 'అటం' వ్యాపారార్థకనామ్నీకారకంగా కూడా ఉపయుక్తమవుతుందన్నమాట.

క్రియ వ్యాపారబోధకమని ఈవ్యాసం మొదటే చెప్పబడింది క్రియలేకాక కొన్ని నామాలుకూడా వ్యాపార బోధకాలు ఉదాహరణకి పెట్టె—పెండ్లి అనే రెండు నామాల్ని పరిశీలిస్తే ఈవిషయం తెలుస్తుంది. పెట్టె ద్రవ్యబోధకం. ఆ ద్రవ్యం మన ఇంద్రియాలచేత గ్రాహ్యం. పెండ్లి ద్రవ్యంకాదు; కార్యం. అంటే వ్యాపారం. పెట్టె ఉంటుంది (exists). పెండ్లి జరుగుతుంది (happens). ఎన్నికలు, (పంట) కోతలు, నాటకం (పుస్తకంకాదు), (వరి) నాట్లు పని, పరిశోధన, ప్రదర్శన, యుద్ధం, సమావేశం వంట మొదలైనవి పెండ్లివంటి నామాలు. అంటే ఈ నామాలు వ్యాపారాన్ని బోధిస్తై. ఈనామాలు కొన్నిరకాల క్రియలతోనే ప్రయుక్తమవుతై. ఈ వ్యాపారార్థక నామాలస్థానంలో కొన్ని వాక్యాలుకూడా ప్రయోగించవచ్చు.

ఒక వ్యాపారానికి కాలంలో ప్రారంభం ముగింపు ఉంటై. ఈ పైరకపునామాలు, ఆ అర్థంలో నామ్నీకృతవాక్యాలు ఏతదర్థబోధకక్రియలతో ప్రయుక్తమవుతై. ఉదాహరణకు ఈవాక్యాలు పరిశీలించండి.

(94) తెలుగులో కావ్యాలు రాయటం పదకొండో శతాబ్దంలో మొదలయింది.

(95) మాపాటిచేలో జొన్న ఎదబెట్టటం మొన్ననే పూర్తిఅయింది. (94) (95) వాక్యాల్లో వ్యాపారార్థకనామాలు (నామ్నీకృతవాక్యాలు) మొదలగు, పూర్తిఅగు అనే క్రియలకు క్రమంగా కర్తృపదస్థానంలోవచ్చినై. ఈపై క్రియలు అకర్మకాలు. ఇవేనామాలు సకర్మకక్రియాయోగంలో కర్మ పదాలుగా వ్యవహరిస్తై. కర్తృస్థానంలో వచ్చినా, కర్మస్థానంలోవచ్చినా ఈనామాలు బోధించే వ్యాపారంలో భేదంఉండదు ఉదాహరణకు (96) (97) వాక్యాలను పైవాక్యాలతో పోల్చిచూడండి.

(96) తెలుగులో కావ్యాలు రాయటం పదకొండో శతాబ్దంలో నన్నయ్య మొదలుపెట్టాడు.

(97) మాపాటిచేలో జొన్న ఎదబెట్టటం మొన్ననే పూర్తిచేశాం. మొదలుపెట్టు, పూర్తిచేయు అనే క్రియలు సకర్మకాలు. కాబట్టి ప్రాణివాచక కర్తృపదాలు అవసరమయినై.

నామ్నీకృత వాక్యాలు కర్మపదాలుగా మారినై. (94) (95) వాక్యాలకూ, (96) (97) వాక్యాలకూ మధ్యనున్న సంబంధం (89) కి (90) కి మధ్యనున్న సంబంధంలాంటిది. (91) లో చూపించిన

---

2. కాలపురుషబోధకప్రత్యయాలను మొదట చేర్చి, భావార్థక ప్రత్యయయోగంలో వాటికి లోపం అవుతుందనటంలో ప్రక్రియా లాఘవం లేదని డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఈ వ్యాసకర్తతో అన్నారు.

పద్ధతిలో (94) (95) వాక్యాలనీ, (95) (97) వాక్యాలనీ విభజించి చూసుకుంటే ఈ సంబంధం విశదమవుతుంది. (విస్తరభీతివల్ల ఆ పని ఇక్కడ చెయ్యటంలేదు) అంటే (91) లో చూపించిన పద్ధతిలో (94) నుంచి (97) వరకూ ఉన్న వాక్యాల్లో నామ్నీకృతవాక్యాలు ('అటం' అంత రూపాలు) గుప్తనిర్మాణం (deep structure) లో operands గానే ఉంటయ్యన్నమాట. సకర్మకాకర్మక క్రియాభేదంవల్ల వ్యక్తనిర్మాణం (surface structure) లో కర్త్రుకర్మాది భేదాలుత్పన్న మవుతై. ఈ పైన పేర్కొన్న వ్యాపారార్థక నామాలతో వచ్చే క్రియలు ఈ కింద పట్టికలో చూపించబడుతున్నై. ఈ పట్టిక సమగ్రమని ఇక్కడ ఉద్దేశించబడలేదని వేరే చెప్పక్కర్లేదు ఈ క్రియలన్నీ వ్యాపారారంభానన్నీ, అంతాన్నీ సూచించటం ఇక్కడ విశేషం.

(98) అకర్మక	సకర్మక
ప్రారంభమగు	ప్రారంభించు
మొదలగు	మొదలుపెట్టు
పూర్తి అగు	పూర్తిచేయు
ముగియు	ముగించు
ఆగిపోవు	ఆపివేయు
?	మానివేయు

వ్యాపారబోధక నామాల్లో ఎన్నో అంతర్విభాగాలుండవచ్చు. ముఖ్యమైన రెండు రకాల్నిమాత్రం ఇక్కడ పరిశీలించటం అవసరం వ్యాపారం కొంత కాలంపాటు (<Duration>) జరగటానికి వీలున్నవి కొన్ని, వ్యాపార ప్రారంభం, ముగింపు ఏకకాలంలో జరిగినట్టు (<Event>) బోధించేవి మరికొన్ని. ఉదాహరణకు 'సంఘటన' అనే నామం అట్లాంటిది. 'సంఘటన జరిగింది' అని అనవచ్చుగాని, 'సంఘటన మొదలయింది' అనిగానీ, 'సంఘటన పూర్తి అయింది' అనిగానీ అనలేం. అట్లాగే 'ప్రమాదం' కూడా. ఇట్లాంటి నామాల్ని సంఘటనాత్మక నామాలు అనవచ్చు. వీటి స్థానంలో వచ్చే వాక్యాలు కూడా 'జరుగు' అనే క్రియతోగాని, తదర్థకమైన మరో క్రియతోగాని వస్తై. సంఘటనాత్మకంకాని నామాలతో కూడా 'జరుగు' అనే క్రియ ప్రయుక్తం కావచ్చు అప్పుడు ఆ నామాలు బోధించే వ్యాపారానికి పట్టే కాలపరిమితికన్నా కాలావకాశసమిశ్రంలో ఆ వ్యాపారానికున్న అస్తిత్వ (Occurrance) ప్రాధాన్యమే వివక్షితమన్నమాట. ఇంకోరకంగా చెప్తే Duration అనే అంశం కలిగిన నామాలన్నిట్నీ సంఘటనాత్మకాలుగా కూడా భావించే వీలున్నదన్నమాట. ఈ కింది వాక్యాలను పరిశీలిస్తే పై విషయాలు విశదమవుతై.

(99) పట్టాలు తప్పి రైలు పడిపోవటం జరిగింది.

(100) ఆంధ్ర ప్రభుత్వంవారు తెలుగు అకాడమీని స్థాపించటం జరిగింది.

ఈ పై వాక్యాల్లో సమాపకక్రియఅయిన 'జరుగు'ను తొలగించి నామ్నీకృతక్రియను వినామ్నీకరిస్తే—అంటే మళ్లీ క్రియగా మారిస్తే అర్థబోధకు ఏ ఇబ్బందీ రాదు పైగా ఆ వాక్యాలే సహజంగా ఉంటై. అయినప్పటికీ (99) (100) సంఖ్యగల వాక్యాలవంటివి భాషలో ప్రయోగించటం జరుగుతూనేఉంది. ఒక రకమైన శైలీవైవిధ్యం కోసం కావచ్చు. ప్రయోజనం ఏదైనా తెలుగుభాష అనుమతించే వాక్యభేదాల్లో ఇది కూడా ఒకటని ఒప్పుకోక తప్పదు ఈ రకపు వాక్యాల ప్రాచుర్యం మన రాజకీయనాయకుల ఉపన్యాసాల్లో ఎక్కువగా కనిపిస్తుంది పెద్దవాక్యాలు ప్రయోగించటం ఉపన్యాసకుల కిష్టం కాబట్టి కొన్ని 'అట'మంత నామాలతో వాక్యాన్ని కొంతదూరం సాగదీసి ఆ తరవాత వీలుపడక జరగు అనే క్రియతో ఆ వాక్యాన్ని ముగిస్తారనుకుంటాను.

అంటే వాక్యాన్ని కొనసాగించే ఉద్దేశంతో 'అటం' అంతరూపాన్ని ముందెన్నుకొంటే. దాన్ని ముగించటానికి 'జరుగు' అనే క్రియ నుపయోగించటం ఒక తేలికైనమార్గం. అసెంబ్లీలో వాగ్ధాటి కలిగిన ఒక ప్రతిపక్ష సభ్యుడు అనటానికి వీలున్న ఈ వాక్యాన్ని గమనించండి.

(101) దేశంలో ఆహారసమస్యను సక్రమంగా పరిష్కరించలేకపోతే మీరు నాలుగుకోట్ల తెలుగు ప్రజలకు సంజాయిషీ చెప్పుకోవాల్సినరోజు వస్తుందని ఏనాడో మాపార్టీ హెచ్చరించటం జరిగింది.

(101) సంఖ్యగల వాక్యం (99) (100) సంఖ్యగల వాక్యాలంత కృతకంగా కనిపించక పోవటానిక్కారణం రాజకీయనాయకుల ఉపన్యాసాల్లోనూ, రేడియోవార్తా ప్రసారాల్లోనూ, దినవార పత్రికల రాతల్లోనూ ఈరకపు వాక్యాలకి మనం విరివిగా అలవాటుపడి ఉండటమే.

వ్యాపారార్థక నామం స్థానంలో ఉపయోగించిన వాక్యా- పూర్వవ్యాసంలో (భారతి, ఆగస్టు 1968) ప్రవేశపెట్టిన పరిభాష ప్రకారం - గర్భవాక్యం అవుతుంది గర్భవాక్యం గర్భివాక్యంలోని వ్యాపారార్థకనామం స్థానంలో నామ్నీకృతమై చేరుతుంది. గర్భివాక్యంలో క్రియ సకర్మకమైతే గర్భవాక్యం ఆ క్రియకు కర్మగా వ్యవహరిస్తుంది. ఇట్లా వ్యవహరించటానికి గర్భిగర్భవాక్యాల్లో కర్తృపదాలు భాషలో ఏకరూపత (identity in form), భావంలో సమబోధకత (co-referentiality) కలిగి ఉండాలి

ఉదాహరణకు ఈకింది వ్యాకాలు వ్యాకరణ విరుద్ధాలు:


* (102) సుమిత్ర వంటచెయ్యటం సుజాత పూర్తిచేసింది.

* (103) మా అమ్మాయి వంటచెయ్యటం సుమిత్ర పూర్తిచేసింది వాక్యం (102)లో 'సుమిత్ర—సుజాత' అనే పదాలకు ఏకరూపత, సమబోధకత — రెండూలేవు. వాక్యం (103) లో మా అమ్మాయి పేరు సుమిత్ర అని అనుకునేటట్లయితే సమబోధకత ఉండటానికి వీలున్నది. అయినా 'మాఅమ్మాయి—సుమిత్ర' అనే పదాలకు ఏకరూపత లేకపోవటాన వాక్యం (103) వ్యాకరణ విరుద్ధం. పైరెండు వాక్యాల్నీ వ్యాకరణసమ్మతమైన ఈకింది వాక్యంతో పోల్చిచూడండి.

(104) సుమిత్ర వంటచెయ్యటం పూర్తిచేసింది.

వాక్యం (104) లో వంటచేయు పూర్తిచేయు అనే రెండు క్రియలకూ ఒకేవ్యక్తిని కర్తగా మనం అర్థం చేసుకుంటున్నాం. సరూపసమబోధకతలున్న నామాల్లో ఒకటి వ్యక్తనిర్మాణంలో లోపించటంవల్ల వాక్యం (104) ఏర్పడింది. ఈ వాక్యానికి గుప్తనిర్మాణాన్ని సూచిస్తే ఈవిషయం విశదమవుతుంది. గుప్తనిర్మాణాన్ని ఈకింది విధంగా పదబంధ నిర్మాణసూచిక (phrase marker) లో సూచించవచ్చు.

(105)




(105) సంఖ్యగల చెట్టుబొమ్మలో (104) సంఖ్యగల వాక్యానికి వ్యాకరణనిర్మాణం సూచితమైంది. వాక్యనిర్మాణంలో పదాల పరస్పర సంబంధాన్ని కళ్ళకు కట్టేటట్టుగా చూపించటమే వ్యాకరణంలో ఈ చెట్లబొమ్మల ప్రయోజనం. ఈ పై చెట్టుబొమ్మకి ఈ కింది విధంగా అర్థవివరణ చెయ్యవచ్చు.

వాక్యం (చెట్టుబోదె) మొదట రెండు కొమ్మలుగా చీలింది. ఎడంపక్కకొమ్మ నామబంధం. కుడిపక్కకొమ్మ క్రియాబంధం. ఈ రకపు బొమ్మల్లో ఎడంపక్కకొమ్మ చెప్పకపోయినా కర్తృపదంగా అర్థం చేసుకోవటం సంప్రదాయం ఈ వాక్యంలో నామబంధపు కొమ్మకు మళ్ళీ చీలికలు లేకపోవటంవల్ల అదే నామం. కుడిపక్క క్రియాబంధపుకొమ్మ మళ్ళీ రెండుగా చీలింది. క్రియాబంధపు కొమ్మలో మళ్ళీ నామబంధపుకొమ్మ ఉండటం గమనించవచ్చు. (క్రియాబంధపు కొమ్మలోనుంచి చీలివచ్చే నామబంధం కర్మగా అర్థం చేసుకోటం ఇక్కడ ఇంకో సంప్రదాయం. గర్భవాక్యంకూడా నామబంధంలోనుంచే వచ్చింది గాబట్టి అది గర్భివాక్యంలో నామబంధంగానే ప్రవర్తిస్తుందని గ్రహించవచ్చు. గర్భవాక్యపు కొమ్మ తనకు పక్కనేఉన్న సజాతీయమైన కొమ్మని తొలగించి ఆ స్థానాన్ని ఆక్రమించుకుంటుంది ఇట్లా జరగటానికి గర్భవాక్యంలో మొదటి చీలికలో ఎడంకొమ్మ, గర్భివాక్యంలో మొదటి చీలికలో ఎడంకొమ్మ ఒకేరకపువై ఉండాలి. అంటే పూర్వం చెప్పుకున్నట్టు గర్భి, గర్భవాక్యాల్లో కర్తృపదాలు ఒకేరూపం కలిగిఉండి, ఒకే ప్రాణిని సూచించాలి. (ఈ లక్షణాల్నే 'సారూప్యసమబోధకతలు' అని వ్యవహరించాము.)

వ్యక్తనిర్మాణంలో గర్భవాక్యంలోని కర్తకు లోపం, క్రియకు అటం చేరటమూ జరుగుతై. ఈమార్పుల్ని పూర్వవ్యాసంలో (చూ. భారతి ఆగస్టు 1968) పేర్కొన్న పరివర్తన సూత్రాల (transformational rules) ద్వారా సూచించాలి. గుప్త, వ్యక్త నిర్మాణాలమధ్య సంబంధాన్ని నిర్దేశించటమే పరివర్తన సూత్రాలపని. గుప్తనిర్మాణాన్ని వ్యక్తనిర్మాణంగా పరివర్తింపజేసేవి గనక వీటికి పరివర్తన (క) సూత్రాలనిపేరు. ఈ రకపు సూత్రపద్ధతిలో కూర్చిన వ్యాకరణగ్రంథాన్ని పరివర్తన వ్యాకరణం (transformational grammar) అంటారు.

(105) సంఖ్యగల బొమ్మలో సూచించిన గుప్తనిర్మాణపుచెట్టుని పరివర్తనసూత్రం వ్యక్తనిర్మాణపు చెట్టుగా మారుస్తుంది. అప్పుడు వ్యక్తనిర్మాణపుచెట్టు ఈకింది విధంగా ఉంటుంది.


(106)



పై చెట్లబొమ్మల్లో వ్యాకరించిన (వాక్యం 104) వాక్యంలో సమాపకక్రియఅయిన 'పూర్తిచేయు'కు బదులుగా 'పూర్తిఅగు' అనే క్రియను వాడినట్లయితే గర్భవాక్యంలో కర్తృపదానికి లోపం జరగదు. పైన పేర్కొన్న సారూప్యసమబోధకతలు ఉండాలి అన్న లక్షణమే ఇట్లాంటి లోపాన్ని నిరోధిస్తుంది. ఉదాహరణకు:--

(107) సుమిత్ర వంటచెయ్యటం పూర్తి అయింది. అనే వాక్యంలో సుమిత్ర గర్భవాక్యంలో భాగంగానే గ్రహించాలి. వాక్యం (104) లో సుమిత్ర గర్భివాక్యంలోదిగా (106) సంఖ్యగల బొమ్మలో సూచించాం. వాక్యం (107) లో జరిగిన వ్యాకరణకార్యాన్ని ఈ కింది పద్ధతిలో సూచించవచ్చు.

(108)



× = వ్యాపారబోధక అమూర్తనామం

గర్భవాక్యం తన సమాపకక్రియరూపాన్ని అటమంతరూపంగా మార్చుకుని గర్భివాక్యంలోని

వ్యాపారబోధక అమూర్తనామం స్థానాన్ని ఆక్రమించటం (108) లో సూచించబడింది. గర్భవాక్యం లోని 'సుమిత్ర'కు లోపం జరక్కపోవటం మనం గమనించవచ్చు.

పై చర్చలవల్ల వ్యాపారార్థక నామాలు కేవల వ్యాపార ఆది, మధ్య, అంతాలను సూచించే క్రియలతోమాత్రమే రాగలవని అనిపించే ప్రమాదం ఉంది. ఇది సరిగాదని వ్యాపారనామాలు తదితర క్రియలతోగూడా రాగలవని ఈకింది వాక్యాలను పరిశీలిస్తే తెలుస్తుంది.

(109) నాకు కారు నడపటంవచ్చు.

(110) మాలతి మిషను కుట్టటం నేర్చుకుంటున్నది.

వచ్చు, నేర్చుకొను వంటి క్రియలు విద్యా (skill) సంబంధమైన నామాలతోవస్తే ఆ నామాలు వ్యాపారార్థకాలు కావచ్చు, కాకపోవచ్చు నేర్చుకోదగినదేదైనా విద్యేఅని ఇక్కడఅర్థం. ఉదాహరణకు పైవాక్యాల్లో వ్యాపారార్థక నామాలకు బదులుగా భాషానామాలైన ఫ్రెంచి, ఇంగ్లీషు వంటివిగాని, లేక నేర్చుకోదగిన పాట, పద్యం మొదలైన నామాలనుగాని ప్రయోగించటాన్ని వ్యాకరణం సమ్మతిస్తుంది.

పైవాక్యాల్లో గర్భవాక్య నిర్మాణం స్పష్టంగానే ఉంది. కాని గర్భవాక్యాల నిర్మాణం మాత్రం స్పష్టంగా లేదు. (109) (110) సంఖ్యలుగల వాక్యాల్లో—కారు నడపటం, మిషను కుట్టటం—అనేవి గర్భవాక్యోత్పన్నాలు. ఈ గర్భ వాక్యాల నిర్మాణంలో ఈ పైన చెప్పిన వ్యాపారాలకు కర్తను ఊహించాలా అక్కర్లేదా అనేది సరిగ్గా ఇక్కడి సమస్య ఈ వ్యాసారంభంలో పేర్కొన్న దేహ మన స్థితులను తెలియపర్చే నామాలతో ఏర్పడ్డ క్రియాబంధాలైతే అవి కర్త్రనిరపేక్షకాలు అని తేల్చివెయ్యవచ్చు. కాని—కారు నడుపు, మిషనుకుట్టు—అనేవి కర్త్రపేక్షక వ్యాపార బోధక క్రియలు. గర్భి వాక్యాల్లోని ప్రాణుల్నే గర్భవాక్యాల్లోకూడా కర్తలుగా నిర్దేశిద్దామా అంటే అందులోనూ చిక్కులున్నై. ఆ ప్రాణులే గర్భవాక్యాల్లోకూడా కర్తలైతే ఇక వాళ్ళు నేర్చుకోవలసిందేమిటి? ఇంక మిగిలిన పద్ధతి గర్భవాక్యాల లోపలి (గుప్త) నిర్మాణంలో అవ్యక్త కర్తను (unspecified agent) స్థాపించటం కేవలం ఈ వాక్యాల నిర్మాణాన్ని వివరించటం కోసమే ఈ రకంగా అవ్యక్తకర్తను స్థాపించటం అంత పొదుపైన పద్ధతికాదు. ఇకా మిగతా రకాల వాక్యాల్లో కూడా ఇట్లాంటి నిర్మాణమే కనిపిస్తే 'కొన్నిరకాల వాక్యాల్లో (వ్యాకరణ గ్రంథంలో ఆ రకాలేవో నిర్దిష్టంగా చెప్పాలి) గర్భవాక్యాల గుప్తనిర్మాణం లోని అవ్యక్తకర్త గర్భిణీవాక్యంలో గర్భవాక్యం చేరినప్పుడు లోపిస్తుంది' అని మనం ఊహించుకోవచ్చు. ప్రస్తుతానికి తగిన సాక్ష్యం చూపించలేకపోయినా, ఈ 'అవ్యక్త కర్త' చాలా రకాల వాక్యాల నిర్మాణాన్ని అర్థం చేసుకోటానికి అవసరం అని ఈ వ్యాసకర్త నమ్మకం. ముందు ముందు పరిశోధనలో అట్లాంటివి కనిపించవచ్చునని ఆశ 'అల్పాక్షర మసందిగ్ధం. సారవ ద్విశ్వతోముఖం' అని ప్రాచీన సూత్ర విదులు' సూత్రనిర్మాణాన్ని గురించి చెప్పిన లక్షణం ఆధునికులకూ అనుసరణీయమే ఈ విషయాన్ని ఇంత దీర్ఘంగా చర్చించటానికి ప్రధాన కారణం: ఆధునిక వ్యాకరణ నిర్మాణంలో నిరంతరం ఎదుర్కొనే సమస్యల స్వరూప స్వభావాలను సూచించటానికే. అంతే కాదు ఒక్కో చిన్న సమస్యను పరిష్కరించటానికి భాషలో ఎన్నో విషయాలను దృష్టిలో ఉంచుకోవాలనికూడా వ్యాకర్తలు నేర్చుకోవాల్సిన ఇంకో పాఠం.

వ్యాపారార్థకనామాలతో వచ్చే మరి రెండు క్రియలు 'విను, చూచు' గర్భిణీవాక్యాల్లో సమాపక క్రియ 'విను' అయినప్పుడు దానికి <శ్రవ్యత (audibility > అనే అంశం (feature) కలిగిన నామాలు కర్మపదాలుగా రాగలవు అట్లాంటి నామాలకు ఆదేశంగా వచ్చే గర్భవాక్యాలు కూడా <శ్రవ్యత> అనే లక్షణాన్ని కలిగివుండాలి. అట్లాంటి లక్షణం గర్భవాక్యంలోని క్రియవల్ల వస్తుంది. ఇట్లాంటి వాక్యాలు సాధారణంగా భిన్నార్థబోధకాలు అవుతై. ఉదాహరణకు ఈ కింది వాక్యాన్ని పరిశీలించండి.

(111) రవీంద్రభారతిలో సుమిత్ర పాడటం విన్నాను.

ఈ పై వాక్యంలో ఉన్న భిన్నార్థాలు ఈ కింది వివరణవాక్యాల్లో (Paraphrases) గమనించవచ్చు.

(112) రవీంద్రభారతిలో సుమిత్ర పాడిందని విన్నాను.

(113) రవీంద్ర భారతిలో సుమిత్ర పాట విన్నాను.

(112) లో సుమిత్ర పాడిందన్న విషయం మాత్రమే విన్నది (113) లో విన్నది సుమిత్ర పాట. ఈ రెండర్థాలూ (111) లో ఉన్నాయి. ఒకే వాక్యం భిన్నార్థకం ఎందుకవుతుందో వ్యాకర్త వివరించాలి వ్యాకర్త కర్తవ్యాల్లో ఇది ఒకటి. కన్నడంలో కూడా ఈ రకపు వాక్యాలు సరిగ్గా ఇట్లాంటి అర్థాల్నే ఇస్తయ్యని ఎ కె. రామానుజన్ గారు పేర్కొన్నారు. (చూ. A. K. Ramanujan: A Generative Grammar of Kannada. Unpublished Ph. D. Dissertation, Indiana, 1963 Page 66.). కన్నడంలో 'కేళు' తెలుగు 'విను'కు సమానార్థకం రామానుజన్ కేళుకు 'hear, hear of' అని రెండర్థాలు సూచించారు. తెలుగు 'విను'కు కూడా ఈ రెండర్థాలు సూచించవచ్చు. ఈ పద్ధతి ప్రకారం పై రెండర్థాలను విను అనే క్రియకు సూచించటంద్వారా పై రకపు వాక్యాల్లో భిన్నార్థ బోధకతను, వ్యాకరణం వివరిస్తుంది. కాని ఈ ప్రస్తుత వ్యాకర్త పద్ధతి ఇందుకు భిన్నం. గుప్తనిర్మాణాల్లో భేదాన్ని సూచించటంద్వారా (111) వంటి వాక్యాల భిన్నార్థబోధకసామర్థ్యాన్ని వివరించటం ఈ వ్యాకర్తకు ఇష్టం. విను క్రియకు విషయార్థక నామంకాని, శ్రవ్యతాంశం ఉన్న నామం కాని కర్మపదాలుగా రావచ్చు. ఒక అర్థంలో విషయం (information) ప్రధానం. ఇంకో అర్థంలో నాదం (చప్పుడు) ప్రధానం. విషయార్థకనామ్నీకారకంగా 'అటం' ప్రవర్తించే విధానాన్ని నామ్నీకరణాల మొదటి వ్యాసం (చూ భారతి, మే 1968) లో పరిశీలించాం అంటే గర్భవాక్యం ఆదేశంగా వచ్చింది, గర్భివాక్యంలోని <విషయం> అన్న అంశంగల నామానికా, <శ్రవ్యత> అన్న అంశంగల నామానికా అన్నదానిమీద వాక్యం (111) కు చెయ్యాల్సిన అర్థవివరణ ఆధారపడి ఉంటుంది శ్రవ్యతాంశం కొన్ని క్రియలకుకూడా ఉంటుందని పైన సూచించబడింది. అడుగు, అను, అరచు, ఏడుచు, తిట్టు, పాడు వంటి క్రియలకు వ్యాకర్త శ్రవ్యతాంశాన్ని నిర్దేశించాలి. ఈ రకమైన క్రియలు గర్భవాక్యంలో ఉన్నప్పుడే అటమంత నామం విను అనే క్రియతో రాగా సంశ్లిష్టవాక్యం భిన్నార్థబోధకమవుతుంది.

ఇంతకుపూర్వం వ్యాపారార్థక నామానికి గర్భవాక్యం ఆదేశంగా వచ్చినప్పుడు గర్భి గర్భ వాక్యాల క్రియలు ఏకకర్తృకాలై ఉండాలన్నాం విద్యాబోధక నామానికి ఆదేశంగా వచ్చినప్పుడు గర్భవాక్యంలో కర్త అవ్యక్తం అన్నాం.

గర్భివాక్యంలో 'విను, చూచు' సమాపక క్రియలైనప్పుడు గర్భిగర్భవాక్యాల్లో క్రియలు ఏకకర్తృకాలు కాగూడదనే నియమం ఒకటి ఇక్కడ చెప్పుకోవాలి. లేకపోతే—

*(114) సుమిత్ర పాడటం సుమిత్ర విన్నది అనే వాక్యం వ్యాకరణనిష్పన్నం కావాల్సివస్తుంది. పునశ్చర్వితమైన 'సుమిత్ర' అనే పదం భిన్నప్రాణుల్ని సూచిస్తేతప్ప పై వాక్యం వ్యాకరణ సమ్మతం కావటానికి వీల్లేదు. కొన్నివిచిత్రసన్నివేశాల్లో పై రకపు వాక్యాలు వ్యాకరణసమ్మతం కావచ్చు. ఈ కింది వాక్యా లట్లాంటివి.

(115) రాత్రి కలలో నేను పాడటం నేనే విన్నాను.

(116) రాత్రి కలలో నేను గాలిలోఎగరటం నేనే చూశాను.

(115) (116) సంఖ్యలుగల వాక్యాల్లో గర్భిగర్భవాక్యాల కర్తృపదాలకు సారూప్య సమబోధకత లున్నప్పటికీ (114) లాగా వ్యాకరణ విరుద్ధాలుగా కనిపించటంలేదు. ఇందు కారణం ఆ కర్తృపదాలు స్వప్నప్రపంచంలో భిన్నరూపాలుగానే భావితాలవుతై. స్వప్నప్రపంచంలోగాని, జానపద గాథల్లోగాని, లేక మారే ఇతర మిథ్యా ప్రపంచంలోనైనా ఇట్లాంటి సన్నివేశాలు తటస్థపడవచ్చు. జాగ్రదవస్థలో ఉన్న మానవుడు పంచేంద్రియాలద్వారా

గ్రహించే జ్ఞానానికి, మిథ్యాప్రపంచజ్ఞానానికీ ఉన్న భేదం తత్వశాస్త్రజ్ఞులు తేల్చవలసిన విషయం. రూపైకత ఉన్నప్పటికీ (పైన చెప్పిన అర్థంలో) సమబోధకత లేకపోవటంవల్ల 'ఏకకర్తృకాలు' కాగూడదని పైన విధించిన నియమానికి భంగం కలగలేదనేదే వ్యాకర్త గ్రహించవలసిందీ, సూచించవలసిందీ.

ఇంతవరకు వ్యాపారార్థక నామాలు కొన్ని క్రియలకు కర్తలుగాగాని, కర్మలుగాగాని ప్రవర్తించే విధానాల్ని పరిశీలించాం అంతేకాక ఇవి కొన్ని నామాలకు కర్తృపదస్థానంలో (కర్త (agent) గాకాదు) —అంటే సూత్రంగా విషయులు అనవచ్చు—(చూ. భారతి, మే 1968) రాగలవు. కొన్ని నామాలు తెలుగులో ఆఖ్యాతలు (Predicates) గా ప్రవర్తిస్తే, ఇట్లాంటి నామాలు ఆఖ్యాతనామాలని (Predicative nominals) వ్యవహృతం. ఉదాహరణప్రాయంగా ఈ కింది పట్టికను గ్రహించండి.

అలవాటు	తేలిక
ఇష్టం	మామూలు
కష్టం	సుఖం
గుర్తు	సులభం

ఈ పై నామాలు అఖ్యాతలుగా వచ్చే వాక్యాలకు వ్యాపారార్థకనామాలు విషయులు (Topics or Subjects ?) గా వ్యవహరిస్తై. పై పట్టికలోని నామాలు ఒక ప్రాణిపరంగా ప్రయుక్తమవుతై. ఆ ప్రాణిని సూచించే నామానికి 'కు' విభక్తి చేరుతుంది. 'కు' విభక్తి బంధాన్ని ప్రస్తుతానికి అముఖ్య కర్మబంధం (indirect object phrase) అందాం. ఈ కింది వాక్యాలను పరిశీలిస్తే పై విషయం విశదమవుతుంది.

(117) నాకు సినిమాలు చూడటం అలవాటు
నాకు వ్యాకరణం చదవటం ఇష్టం
నాకు వ్యాయామం చెయ్యటం కష్టం
నాకు ఆలస్యంగా నిద్రపోవటం మామూలు

ఈ పై వాక్యాల్లో వ్యాపారార్థక నామానికి బదులు ఒక్కోసారి నిర్వ్యాపార నామాలుకూడా కనిపిస్తున్నై. ఈ కింది వాక్యాలు అందుకు ఉదాహరణాలు.

(118) నాకు కాఫీ అలవాటు
నాకు నిద్ర ఇష్టం
నాకు వ్యాయామం కష్టం

ఈ పై వాక్యాల వ్యక్తనిర్మాణంలో వ్యాపార నామం లేకపోయినప్పటికీ వాటిని అర్థం చేసుకోటంలో మాత్రం 'కాఫీతాగటం, నిద్రపోవటం, వ్యాయామం చెయ్యటం' అనే గ్రహిస్తున్నాం. అందువల్ల పై రకపు వాక్యాల గుప్తనిర్మాణంలో వ్యాపారార్థక నామాన్ని భావించాలి

పైన పేర్కొన్న ఆఖ్యాతనామాలున్న వాక్యాల్లో కొన్నిభేదాలు అందువల్ల వ్యాకరణ రచనలో వచ్చే చిక్కులు కొన్ని ఉన్నై. ఉదాహరణకు అలవాటు, కష్టం, తేలిక, సులభం, మామూలు మొదలైన నామాలకి 'విషయులు'గా వచ్చే గర్భవాక్యాల్లో కర్త, గర్భివాక్యంలో అముఖ్యకర్మబంధం (కు- బంధం) ఒకే ప్రాణిని సూచించాలి. ఇట్లాంటి వాక్యాల్లో జరిగే ప్రక్రియాగతి (Grammatical Process) (119) లో సూచితం.

(119)
నేను + కు — [x] — అలవాటు

[నేను సినిమాలు చూస్తాను]

X = వ్యాపారబోధకనామం.

పై ఆదేశకార్యం జరగాలంటే కింద గీతలుంచిన పదాలు సరూపసమబోధకాలై ఉండాలి. ఆదేశం జరిగినప్పుడు గర్భవాక్యంలో నేను — కు లోపకార్యం జరుగుతుంది.[3]

(119) లో లాగా గర్భవాక్యపు కర్త, గర్భవాక్యపు కు—బంధం లోని నామమూ సరూప సమబోధకాలు కాకపోతే (120) లో లాగా ఆదేశకార్యం

---

3. పూర్వవ్యాసంలో (చూ. భారతి, ఆగస్టు 1968, పేజీ 55) ఇట్లాంటి విషయాన్నే చర్చిస్తూ గర్భివాక్యంలో 'నేను'కు లోపం సూచించాను. అది పొరపాటు ఈ పొరపాటును ఎత్తిచూపించినవారు, డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారు.

నిరోధితమవుతుంది. నిరోధితం కాకపోతే (121) వంటి వ్యాకరణవిరుద్ధమైనవాక్యం నిష్పన్న మవుతుంది.

(120)

నేను+కు—[X]—అలవాటు

[నువ్వు సినిమాలు చూస్తావు]

*(121) నాకు నువ్వు సినిమాలు చూడటం అలవాటు.

కింద గీతలుంచిన పదాలు సమబోధకాలు కానందువల్లనే వాక్యం (121) వ్యాకరణ విరుద్ధమయింది.

కాని పై పదాల్లో 'ఇష్టం' ఆఖ్యాతగా వచ్చినప్పుడు ఈ సమబోధక నియమం వర్తించదు. అంటే (122) లో సూచించే ప్రక్రియాగతి జరిగి వ్యాకరణ సమ్మతమైన (123) నిష్పన్న మవుతుందన్నమాట.

(122)

నేను+కు—[X]—ఇష్టం

↑

[నువ్వు పద్యాలు చదువుతావు]

(123) నాకు నువ్వు పద్యాలు చదవటం ఇష్టం.

(122) లో కింద గీతలుంచిన మాటలు వేర్వేరైనప్పటికీ ఆదేశకార్యం జరిగింది. ఒకటే అయితే గర్భవాక్యపు కర్తకు లోపం జరిగిఉండేది. దీన్నిబట్టి 'ఇష్టం, అలవాటు' అనే నామాల ప్రవర్తనలో భేదం ఉందని తెలుస్తుంది. ఈ విషయంలో 'గుర్తు' అనే నామంకూడా 'ఇష్టం'లాగే ప్రవర్తిస్తుంది. అంటే (122) లో 'ఇష్టం' బదులు 'గుర్తు' అనే నామాన్ని వాడినా ఈ ఆదేశకార్యం జరుగుతుందన్న మాట ఇట్లా ఒకే రకం ప్రవర్తన కలిగి ఉన్నట్టు కనిపించినా, లోతుగా పరిశీలిస్తే 'ఇష్టం, గుర్తు' అనే నామాల ప్రవర్తనలో కూడా భేదమున్నట్టు మనం గ్రహించగలం. ఈ కింది వాక్యాలను పరిశీలించండి.

(124) నాకు నువ్వు పద్యాలు చదవటం ఇష్టం.

(125) నాకు నువ్వు పద్యాలు చదవటం గుర్తు.

పై రెండు వాక్యాలకి కింది రెండు వాక్యాలూ సమానార్థకాలుగా గ్రహించవచ్చు.

(126) నాకు నువ్వు పద్యాలు చదివే పద్ధతి ఇష్టం.

(127) నాకు నువ్వు పద్యాలు చదివిన విషయం గుర్తు.

వాక్యం (125) లో గర్భవాక్యానికి 'అని' తగిలించవచ్చు. (124) కు సాధ్యం కాదు. సాధ్యం కాదంటే ఉద్దిష్టార్థంలో వీలుకాదని ఉదాహరణకు (128), (129) సంఖ్యలుగల వాక్యాల్ని చూడండి.

(128) నాకు నువ్వు పద్యాలు చదివావని గుర్తు.

*(129) నాకు నువ్వు పద్యాలు
చదివావని }
చదువుతావని } ఇష్టం.

(129) సంఖ్యగల వాక్యంలో 'అని' హేత్వర్థకం, (128) లో విషయార్థకం. (125) (127) సంఖ్యలుగల వాక్యాలనుకూడా విషయార్థకాలుగానే వ్యాఖ్యానించాలి (124) కి ఈ పద్ధతి సరిపడదు. (124) (125) వాక్యాల్లో గర్భవాక్యం ఒకటే అయినప్పటికీ గర్భివాక్యాల్లో ఉన్న ఇష్టం గుర్తు అనే నామాలవల్ల ఈ భేదం వచ్చింది. (126) లో సూచించిన అర్థాన్నిబట్టి (124) గర్భవాక్యం 'పద్ధతి'ని సూచించే నామంగా ప్రవర్తిస్తున్నదని తెలుసుకోవచ్చు అంటే రీత్యర్థక నామవ్యాకరణాన్ని కూడా గుర్తించాలా? గుర్తిస్తే దాని లక్షణ మేమిటి? రీత్యర్థకనామం ఏ రకపు క్రియలతో వర్తిస్తుంది? — ఇట్లాంటి ప్రశ్న లుత్పన్నమవుతై. ఈ ప్రశ్న లన్నిటికీ ఈ వ్యాసకర్త దగ్గర సమాధానాల్లేవు. అసలు ఈ రకపు ప్రశ్నలే కొత్త. ఇంకా లోతుగా పరిశోధన జరిగితేనే గాని వీటికి సమాధానాలు దొరకవు సమాధానాలు ప్రస్తుతానికి దొరక్కపోయినా ఈ ప్రశ్నలు రేప

టానికి కారణం, ఈ విషయాల్ని గురించి ఆలోచించే జిజ్ఞాసువుల మేధలకు మరింతపని కల్పించటానికే.

ఇంకో చిన్నవిషయాన్ని ప్రస్తావిస్తే వ్యాపారార్థక నామ్నీకరణాన్నిగురించి ఈ వ్యాసకర్త ప్రస్తుతానికి చెప్పదల్చుకున్నది దాదాపు పూర్తి అవుతుంది. ముందుగా ఈ కింది వాక్యసమూహాన్ని పరిశీలించండి.

నువ్వు ఎక్కడ ఉంటున్నావు? ⟶ నువ్వు { ఉండటం / ఉంటున్నది } ఎక్కడ?

నువ్వు ఎప్పుడు వచ్చావు? ⟶ నువ్వు { రావటం / వచ్చింది } ఎప్పుడు?

నువ్వు ఎందుకు వెళ్లావు? ⟶ నువ్వు { వెళ్లటం / వెళ్లింది } ఎందుకు?

పై వాక్యాల జంటల్లో ఎడంవైపు వాక్యాల్లో ఉన్న 'ఎక్కడ, ఎప్పుడు, ఎందుకు' అనే ప్రశ్నార్థక క్రియావిశేషణాలు చివరికి జరగటంవల్ల కుడివైపు వాక్యాలు నిష్పన్నమయినై. అందువల్ల ఉపోత్తమస్థానానికి చేరిన క్రియాపదం నామ్నీకృతమయింది. ఇది రెండు రకాలు. ఒకటి 'అటం'వల్ల. ఫలితం: కాల పురుష బోధక ప్రత్యయాలు లోపించినై. రెండోది తచ్ఛబ్దం ('అది')వల్ల. ఫలితం : పురుషబోధక ప్రత్యయాలు మాత్రం లోపించినై. పూర్వం చర్చించిన నామ్నీకరణాలు గర్భవాక్యాలు గర్భివాక్యాల్లో చేరినప్పుడు జరిగినవి. అంటే సంశ్లిష్ట వాక్య సందర్భాల్లో నన్నమాట. ఇప్పుడివి ఏకవాక్యంలో జరిగిన మార్పులు. (130) లో ఎడంపక్క వాక్యాలకీ, కుడిపక్క వాక్యాలకి శైలీవిన్యాసంలో Stylistic differences) భేదంతప్ప ప్రధానార్థబోధలో భేదమున్నట్టు కనిపించదు వీటిని శైలీవిన్యాసహేతుకనామ్నీకరణాలనవచ్చు. ఈ రకపు పరివర్తనకు ప్రశ్నార్థక క్రియా విశేషణాలకూ దగ్గరి సంబంధం ఉన్నట్టు కనిపిస్తున్నది ఉదాహరణకు (130) లో ఉదాహరించిన వాక్యసమూహాన్ని(131)తో పోల్చిచూడండి.

(131)

నేను హైదరాబాదులో ఉంటున్నాను.

*నేను ఉండటం హైదరాబాదులో.

నేను నిన్న వచ్చాను. *నేను రావటం నిన్న.

నేను పనిమీద వెళ్లాను. *నేను వెళ్లటం పనిమీద.

(131) లో జరిగిన పరివర్తన (130) లో జరిగిందనిలాంటిదే. కాని (131) లో జరిగిన పరివర్తనవల్ల నిష్పన్నమైన (చుక్క గుర్తుపెట్టిన కుడిపక్క) వాక్యాలు వ్యాకరణ సమ్మతమైనవిగా కనిపించవు. కనీసం వీటి వ్యాకరణప్రతిపత్తి (130 లో కుడిపక్క వాక్యాల వంటిది కాదన్నంత వరకైనా తెలుగుభాషా వ్యవహర్తలంతా అంగీకరిస్తారనుకుంటాము. మళ్లీ, (131) లో చుక్క గుర్తున్న కుడిపక్క వాక్యాల్లో నామ్నీకరణానికి 'అటం' బదులు 'అది' ఉపయోగిస్తే వీటి వ్యాకరణప్రతిపత్తి మారుతుంది. (130) లో లాగానే సందేహం లేకుండా వ్యాకరణ సమ్మతంగా కనిపిస్తై.

(131) లో చుక్క గుర్తుకి కుడిపక్కఉన్న వాక్యాల్ని (132) లో వాక్యాలతో పోల్చిచూస్తే ఈ విషయం అర్థం అవుతుంది.

(132) నేను ఉంటున్నది హైదరాబాదులో.
నేను వచ్చింది నిన్న
నేను వెళ్లింది పనిమీద.

ప్రశ్నార్థకంకాని క్రియావిశేషణ పదాన్ని వాక్యాంతానికి జరిపినప్పుడు 'అది' నామ్నీకరణం వ్యాకరణసమ్మతమై 'అటం' నామ్నీకరణం వ్యాకరణ దూరం కావటానికి కారణ మేమిటి? ప్రశ్నార్థక క్రియావిశేషణాలు జరిపినప్పుడు రెండు రకాల నామ్నీకరణాలూ వ్యాకరణసమ్మతం ఎందుకయినై? మళ్లీ ప్రశ్నలే సంతృప్తికరమైన సమాధానాలకోసం ఇంకా పరిశోధించాలి.

పైన వీటిని శైలీవిన్యాసహేతుక నామ్నీకరణాలన్నాను. ఈ రకమైన శైలిక ప్రయోజనం ఏమిటి? వాక్యం చివరికి జరిగిన పదానికి వాక్యం ప్రయోగంలో ప్రాధాన్యం కనిపిస్తున్నది. ప్రాధాన్య వివక్ష ననుసరించి వాక్యంలో ఒకమాట చివరికి జరుగుతున్నది. ఉదాహరణకి (133) లో గీతపక్క వాక్యాల్ని పరిశీలించండి.

(133) 'యూసఫ్' బస్సులో యూనివర్సిటీకి వెళ్లాడు.
—యూసఫ్ బస్సులో వెళ్లింది యూనివర్సిటీకి.

– యూసఫ్ యూనివర్సిటీకి వెళ్ళింది బస్సులో.

– బస్సులో యూనివర్సిటీకి వెళ్ళింది యూసఫ్.

(133) లో గీత గుర్తుకు కుడిపక్కనున్న మూడు వాక్యాలూ గీత గుర్తుకు పైనవున్న వాక్యం నుంచే నిష్పన్నమయినట్లు మనం గ్రహించాలి. ఈ వాక్యాలన్నీ ఒకే విషయాన్నిగురించి చెప్తున్నై. ప్రధానంగా చెప్పదల్చుకొన్న అర్థంలో భేదం లేదు. కాని చెప్పే పద్ధతిలో తేడా ఉంది. ఈ తేడా వాక్యాంతానికి జరిగిన పదభేదాన్నిబట్టి వచ్చింది. చివరికి జరిగిన మాట వక్త ఉద్దేశించిన ప్రాధాన్యాన్ని సూచిస్తుంది. అంటే ఈ పైన చెప్పిన శైలీ విన్యాసభేదం విషయైకదేశ ప్రాధాన్య వివక్ష కోసం ఏర్పడిందని తాత్పర్యం. ఇక్కడ విషయం అంటే వాక్యం వ్యక్తంచేసే information.

ఈ వ్యాసంలోనూ, ఇంతకు పూర్వపు నామ్నీకరణాల వ్యాసాల్లోనూ 'వ్యాకరణ సమ్మతి' అనే మాట ప్రవేశపెట్టబడింది. దానికి కొంచెం వివరణ అవసరం. భాషావ్యవహర్త మనస్సులో అవ్యక్తంగా ఉండి భాషావ్యవహారాన్ని నడపించే సూత్రావళి లేక నియమావళి అనే అర్థంలో వ్యాకరణ శబ్దం ఈ వ్యాసావళిలో ప్రయుక్తమయింది. ఆ అవ్యక్త సూత్రావళిని అందుకోటానికే వ్యాకర్తలుచేసే ప్రయత్నం. అంటే అవ్యక్త సూత్రాలకు వ్యక్త రూపాన్నియ్యటమే వ్యాకర్త సాధించాల్సింది. ఈ సూత్రావళి అనుమతించేవాక్యం వ్యాకరణ సమ్మతమనీ, నిరాకరించే వాక్యం వ్యాకరణ విరుద్ధమనీ ఈ వ్యాసాల్లో వ్యవహరించాను. వ్యాకరణ సమ్మత వాక్యాలను, వ్యాకరణవిరుద్ధవాక్యాలను వేరు చెయ్యటం అన్నిసందర్భాల్లోను అంత తేలికైన పనికాదు. మంచీ–చెడూలాగా వ్యాకరణసమ్మతి, అసమ్మతి అనేవి ద్వంద్వభావాలు కావు. ఈ రెండు ద్వంద్వాల మధ్య అసంఖ్యాకమైన అంతరువు లుండవచ్చు. ఈ కారణంగానే ఒక్కోసారి ఫలానివాక్యం వ్యాకరణసమ్మతమా? కాదా అంటే అవును, కాదు అని తేల్చి చెప్పలేం. కొన్నివాక్యాలమధ్య వ్యాకరణ సమ్మతిలో తరతమభేదా లుండవచ్చు. ఒక్కోసారి ఈ విషయంలో భాషావ్యవహర్తలమధ్య అంగీకారం కుదరక పోవచ్చుకూడా. ఈ విషయాలనుగురించి ప్రత్యేకంగా చర్చించినపుడు, ఇంతకన్నా వివరంగా చెప్పుకోవచ్చు.



కాళిదాస కళామందిరము

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

రసజ్ఞులకు కళాప్రియులకు అర్ద్రచిత్తులకు స్వాగతము! శుభస్వాగతము!!

విదేశ నాగరికతలు, పర సాహిత్య ప్రభావములు, ఆధునిక శాస్త్ర విద్యలు మీ హృదయముల నెంతగా చూరగొన్నను దేని విలువ దాని కిచ్చుచు కంటపడిన ఒక అపూర్వ రాగరేఖకు రమణీయార్థమునకు తన్మయులయి తలలనూచు అమృత పుత్రులకు మీకు అభినందనములు!

తలవని తలంపుగా అనల్ప శిల్పకళా ద్వారములవద్ద మీరు నిలిచియున్నారు. స్తిమిత చిత్తముతో ధీరగమనముతో ఈ కళాభవనము లోనికి విచ్చేయుడు!

సింహద్వారము దాటగనే మీరు మరపు మసకలలో మాయమైన ఒక అద్భుత ప్రాచీనయుగములోనికి ప్రవేశింతురు. అందలి అపూర్వ సభ్యతా సంస్కృతులతోడి పరిచయము మిమ్ములను ఆశ్చర్య చకితులను చేయును. అందలి తేజోమయ, మాధుర్యమయ, సౌందర్యమయ సీమలలో అడుగిడినంతనే ఒక్కసారి శరీరము పులకరించి యే వస్తువును అనుపదముననే తేరిపార చూడజాలరు. ఆ అద్భుత లోక సందర్శనమునకు అలవాటుపడినమీదట నెమ్మదిగా కన్నులెత్తి పరికింపగలరు.

మీ రడుగిడు పుణ్యభూమిలో పరరాజ పద కళంక చిహ్నములు సముద్రితములు కాలేదు. విజాతీయ భావవాహిని స్థిరముగ కాల్వలు గట్టలేదు.

అది అచ్చపు భారతీయ విజ్ఞాన శతపత్ర సౌరభముతో నిండిన స్వర్ణయుగము! హైందవ స్వచ్ఛంద కాంతి ధారలకు ఆలవాలమైన శోభావరసీమ! ఆ యుగ ప్రభావముచే ఉత్తేజితుడై, ఒక మహా కళాస్రష్ట రసరామణీయక తపస్వి, కాంచిన దివ్య స్వప్నములు ఇచట సుస్థిరముగా నిలిచియున్నవి. వానిలోని కిపుడు మీరు నడిచి సకలేంద్రియ సంతృప్తి నందబోవుచున్నారు.

ఎన్నడును మీ రూహించిన ప్రపంచము కాదది! మీ రూహింపగల్గిన అనుభూతులును కావవి!

అది ఒక కళామయ లోకము!
అనల్ప కల్పనాలోకము!

దానిముందు దట్టముగ వ్రేలుచున్న నీలి కాలయవనిక చల్లగా ప్రక్కకు తప్పుకొనుచున్నది:—ఇక దృష్టి సారింపుడు:—

ఎన్నడును ఒక్కచోట ఒక్కసారిగా కాన్పింపని ఆరు ఋతువులు ఇప్పుడు మీ ఎదుట ప్రత్యక్షములగును. ఆ ఋతుచక్రములోని వింత ప్రకృతిని చూచి ఆశ్చర్యపడుచున్నారా?

ఇవి విరియబూచిన కర్ణికార కోవిదారములు! ఇది లోధ్రము! ఇవి సర్జ అర్జున నీపములు! అనగా కొండ గోగులు, ఎర్ర కాంచనములు, లొద్దుగలు......... ఆ సంస్కృత మెంత తెలిసినదో ఈ తెలుగును అంతియే! అని చిరునవ్వు వెలయించుచున్నారా? నాటి మన జాతీయ వృక్షసంపద నేడు మన కెంత క్రొత్తయైపోయినది!

ఈ వంక సరస్తీరముల హంసలు, కదంబములు, సారసములు—రెక్కలు టపటప కొట్టుకొనుచు ఒయ్యారముగ నడయాడుచున్నవి!

ఇక వీ నగర సీమలలోనికి చూడుడు!

అభిసారికలు, అంతఃపురములు, లాక్షారుణ చరణములు, సుగంధి నిశ్శ్వాస వికంపి తోత్పల మధువులు! కాలాగురు కాళీయక అంగరాగములు! ఏమి రుచులు! ఏమి భోగములు !

పట్టణము దాటితిమా? అడవులు! కార్చిచ్చులు! విద్రుత మృగయూథములు! ఎన్నటికిని మరపురాని అద్భుత ప్రకృతి చిత్రములు!

ముందుకు నడువుడు:—

పలుచని మంచు తెరలచాటున కాన్పించు భవన శిఖరములను, అందలి పతాకములను, అంతిపురములను దాటి చూచిన—మున్యాశ్రమములు, లేడిపిల్లలు, చిన్న మొక్కలకు నీళ్ళుపోయు మునికన్యకలు తారసిల్లుదురు.

అరుగో! మహారాజులు! శరీర సౌష్ఠవమున, శీల సౌభాగ్యమున సాల ప్రాంశులు! మూర్తీభవించిన దాన, దయా యుద్ధవీరములు! మానవతా మధువు మనసులో తొణికిసలాడు ప్రసన్న గంభీరులు!

పొదరింట పూల గుత్తులవలె కన్పించియు కాన్పింపక గుణసౌరభముతో పరిమళించు ఆ రమణీమణులు వారి రాణివాసము! తల్లులు, బిడ్డలు, కోడండ్రు, కులదీపికలయి వెలుగుచున్నారు!

ఇదిగో! మీ కొరకు సిద్ధముగానున్న భావనా వ్యోమయానము నధిష్ఠింపుడు! కనుమూసి తెరచినంతలో దివ్యస

నెగిరివచ్చి ఇపుడు మహోన్నత హిమ శృంగములపై నున్నారు.

ఆ పర్వత మేఖలలందు పొరాడు నీలమేఘముల క్రింద ఎంత చల్లగా నున్నది! చిన్న నీటి తుంపురులు గూడ రాలు చున్నవా? దానికేమి? ఆ పై శిఖరములందే ఎఱ్ఱని ఎండ యున్నది! అక్కడకు పోవచ్చును.

వాహ్యాళిగా కొంచెము ముందుకు పొండు. లేళ్ళిసులనే ధాతురసములందు ముంచి భూర్జపత్త్రములపై ప్రియులకు ప్రేమలేఖలు వ్రాయు విద్యాధర సుందరీమణులు పాడ గట్టుదురు. అచటికి అనతి దూరములో కాన్పించునదే నగరాజు రాజధానీ నగరము, ఓషధి ప్రస్థము! గిరిజా శంకరుల కల్యాణ మండపము! ప్రక్కనే గంధమాదనము! అందలి సాయం సంధ్యా శోభ పరికింపనిది ఏమి జన్మము?

ఆ నీలిమబ్బు పాగా ధరించి ధవళ శరీరముతో ఠీవి నొలకబోయునది ఏమో తెలియునా?

అదే కైలాసము!

దాని ఒడిలో కులుకుచున్నది అలకాపురి!

అది ఒక కవితా స్వప్నము! పక్షాంచలములు విసరి పరువెత్తు మహాకవి భావ విహంగ పరమావధియగు గంధర్వ నగరము!

భవనముల నిత్య సంగీతము! చెట్ల నిత్య పుష్పములు! రాత్రుల నిత్య చంద్రికలు! పౌరులది నిత్య యౌవనము!

సరస్సుల బంగారు తామరలకు వైడూర్య నాళములు! ఇంద్ర నీల శిఖరముల క్రీడా పర్వతములకు కనకకదళీ వేష్టనములు! ఒహోహో! ఏమి లోకమయ్యా ఆ ? ఏ ఐంద్ర జాలికుని పింఛ చాలనమునుండియో పుట్టిన అద్భుతలోకము అట్లే నిలిచిపోయినది గాబోలు!

ఆ ఐంద్రజాలికు డెవ్వడు?

ఇంతవరకు మనము వీక్షించిన ఆపూర్వలోకమును సృష్టించిన ప్రజ్ఞా ప్రకర్షముల పేరేమి? అన్నిటికిని ఒకే సమాధానము! 'కాళిదాసు!'

ప రి చ య ము

కాళిదాస మహాకవి కవితారంగమున అవతరించునాటికి సర్వ సామగ్రీ సంపన్నమైన అలంకార గ్రంథములు లేవు. ఉన్న నాట్యశాస్త్రము తాను శ్రవ్య కావ్యమునకు దూరపు చుట్టమ నని తన ముఖముననే చెప్పుచున్నది. ఇంక నాతని రచనా లక్ష్యముగా నిలిచినవి మహాపర్వతములవంటి రామాయణ, భారతములు. ఆతని కవితా ప్రసక్తికి అవియే లక్షణములు. అవియే లక్ష్యములు.

అతఁడు రామాయణ క్షీరసాగరమును బహువారము మథించి అనేక అనర్ఘ రత్నములతోబాటు అపూర్వ కవితా లక్ష్మినిగూడ ప్రత్యక్షము గావించుకొనెను. బహు విషయ విస్తారములో మునిగిపోయిన కవితాలక్ష్మికి ఒక ప్రత్యేక రసరాజ్యమును సృష్టించి ఆమెను అందలి స్వర్ణ సింహాసనమున ప్రతిష్ఠించెను. ఈ రాజ్యమున శాస్త్ర ప్రమేయములు, మత, నీతి తర్కములు, పాండిత్య శౌండీర్యములు తమ తమ హద్దులలో నొదిగి యుండవలయును. అవి హద్దు మీరినవా? శిక్షింపబడును. ఇట్లు—తాను నిర్మించుకొనిన నిర్దిష్ట పథకములతో నిర్ణీత లక్ష్యములతో ఆతడు తన కావ్యసృష్టి ని సాగించెను. పిమ్మట ఆతని కావ్యములే లక్షణకర్తలకు లక్ష్యము లయినవి.

కాళిదాసుని దృష్టిలో కావ్యమునకు రస, రామణీయకములు ప్రాణభూతములు. తాను స్వీకరించిన కథ, పాత్రలు, సన్నివేశములు సర్వమును, ఆ రస, రామణీయకముల వైపునకే నడచి పోవలయును. ఆ గమనమునకు అడ్డుగా నిలుచు కథను గాని, సంఘటనమునుగాని నిష్కరుణముగా పరిహరించును.

చరిత్రకారునకు ఐతిహాసిక సత్యాంశములయందున్న శ్రద్ధాసక్తులు రచనా సౌందర్యమునం దుండవలసిన అవసరము లేదు. ప్రకృతి శాస్త్ర పరిశోధకుని దృష్టి వస్తు సౌందర్యమునందు విముఖమయి, వస్త్వవయవ విశ్లేషణమునందును తద్గత సత్య పరిశీలనమునందును నిమగ్నమగుట సహజము కాని—కవి ప్రవణతయును, ప్రయాసయును సర్వమును అపూర్వ సౌందర్య సాక్షాత్కారము కొరకుగాని, నీరస సత్య నిరూపణము కొరకుగాదు.

శాస్త్రము సత్యభూమిపై పెరిగి పెద్దదయి నటులే కవిత సౌందర్య పీఠముపై వేరుదన్ని పూలు పూచును. ఆ పుష్ప ప్రలోభముచేతనే మతిమంతులు వాఙ్మయ మంతటి యందున్ను కావ్యములందే తరుగని మొగ్గు చూపుదురు.

కవికి సర్వదా ఉపాస్యదైవమైనది సౌందర్యము అనుకొంటిమిగదా? ఆ సౌందర్యముయొక్క రూపాంతరములే రస, రామణీయకములు. కావ్యము నొక చక్కని పుష్పముతో పోల్చినచో దాని హృద్గత మధువే రసము. దాని పరిమళ, మనోజ్ఞతలే రామణీయకము అని చెప్పవచ్చును.

ఈ రస రామణీయకములను కావ్యములో సమృద్ధిగా పండించుటకు అనితర సాధారణమయిన ప్రతిభ కావలయును.

అట్టి మహా ప్రతిభావంతుడు కాళిదాసు!

ప్రతిభ రెండు విధములుగా నుండు నన్న పండితరాయల మాట పరమ సత్య మనిపించును. ఎందుచే ననగా—కాళిదాసు ప్రతిభావంతు డైనట్లే భారవి, మాఘ, శ్రీహర్షాదులును ప్రతిభావంతులే అనవలయునుగదా? ఐనచో ఉభయుల కావ్యములను చదివినపుడు కలుగుచున్న అనుభూతి

ఒక్క విధమైనదేనా? అనునది కావ్య ప్రియులను నిలువరించి ఎదుట నిలుచు ప్రశ్నము. దానికి తదుభయ కావ్యాస్వాదమును ఒక్క విధమైనది గాదని అనుభవ సాక్షిక మయిన సమాధానము. వారి కవితా ప్రపంచము హృదయమునుండి పొంగులు వారి పుట్టినదిగాక మేధాసంపత్తినుండి ఉద్భవించిన దని సుస్పష్టమగును. దీనినే వేరొక విధముగా చెప్పిన—కాళిదాస కవిత ప్రకృతి ప్రేరణమువలన సహజముగా పొదరింటబుట్టిన సుందర కుసుమము! భారవి మున్నగువారిది చేయి తిరిగిన శిల్పి శాస్త్రప్రకారము నిర్మించిన లోహపుష్పము! మొదటిది సృష్టి! రెండవది నిర్మాణము! ఉదాహరణమునకు కుమార సంభవ, కిరాతార్జునీయముల హిమవద్వర్ణనమును, కాళిదాస, శ్రీహర్షుల పార్వతీ, దమయంతీ సౌందర్య వర్ణనములను, రఘువంశ శిశుపాలవధముల రస చిత్రణములను చూడవచ్చును. కాళిదాసుకవిత చదివినపుడు మనస్సు కరుగగా వారి కవిత చదివినపుడు తల యూగును. కనుకనే రస గంగాధర కర్త యుగ్గడించిన ప్రతిభాద్వయము నంగీకరించుట.

ఒకటి పూర్వ పుణ్య సంజనితము! నైసర్గికము!

రెండవది వ్యుత్పత్త్యభ్యాసముల ప్రాబల్యముచే ప్రాప్తించినది! కృతకము.

ఋ తు శో భ

మహాకవి మొట్టమొదటి సృష్టి ఋతు సంహారము! ఉదయింపబోవు కాళిదాస ప్రతిభా సూర్యునకు అరుణోదయము ఈ ఋతు కావ్యము!

ఏమి ఈ ఋతు చక్రశోభ!

ప్రకృతి రంగస్థలమున ఒకదానివెంట నొకటిగా వన్నె వన్నెల తనూసౌందర్యము నొలికించుచు వివిధ రుచుల వెలయించుచు వెనువెంటనే మాయమగుచు గిర్రున తిరిగి పోవుచున్నది!

నిరంతర సుఖ దుఃఖ యాత్రా శీలమును, విసుగు వేసటల కూడలియును నగు మానవ జీవితములో అలసి సొలసిన కన్నులకు, అలమటించు హృదయములకు—సుధాంజనము పూసి క్రొత్త ఆశలను, క్రొత్త ఉత్సాహములను పోసి ఊరట నిచ్చు కాలపురుషుని వర ప్రసాదములు గాబోలు ఈ ఋతువులు!

నవ్య ఋతు సందర్శనమున హృదయముప్పొంగి తత్సౌందర్యగానము చేయని కవిమాత్రుడు ఏ సాహిత్యమునందయినను ఉండడని చెప్పవచ్చును. ఆది కవీంద్రుడు వాల్మీకియు, ఈ ఋతు శోభకు వశుడై రామాయణకావ్యమున లోకోత్తరము లయిన ఋతు చిత్రములు కల్పించెను. ఆ భావ సంపత్తియు, రచనా సౌందర్యమును తరువాతి కవుల నుత్తేజపరచి, ప్రలోభపరచి ఋతుసౌందర్య గానాభిముఖులను చేసినది.

కాళిదాసు వాల్మీకి మహర్షికి అగ్రశిష్యుడు! సందేహములేదు. రఘువంశమున వాల్మీకి ప్రసక్తి వచ్చినపుడు ఆతనిని సగౌరవముగ 'కవి' అని వ్యవహరించెనేగాని పేరుపెట్టి పిలువలేదు. వాల్మీకి కవితా ప్రభావము కాళిదాసు కవితపై తగినంత ఉన్న దనుట నిశ్చయము. వాల్మీకి ఋతు కవితను ఈతడు తనివితీర ఆస్వాదించియు నుండవచ్చును. కాని—కాళిదాస కవిత వాల్మీకికి ప్రతిబింబప్రాయము కాలేదు.

పుస్తకములు చదివి పుస్తకము వ్రాయువాని అనుభవ దారిద్ర్యము ఆతని రచనమునందు స్ఫుటముగా కాన్పింపక తప్పదు.

కాళిదాసు ఋతుకవిత వశాళీకము. స్వానుభవైక సంజనితము. శ్రుతులు బిగించి సిద్ధపరచిన వీణియ ఒక గాలి తాకున ఉద్వేలముగ మధుర సంగీతము వెలయించునట్లు సౌందర్యాభిముఖమైన యువకాళిదాసు హృదయము ఒక్కొక్క ఋతువునే చూచి ఉప్పొంగి తన అనుభవ మాధుర్యమునే తాను పాడినది! వాల్మీకి రచనమున హేమంతము సామంతము చేయగా ఈయన కావ్యమున గ్రీష్మము కిరీటము ధరించినది. ఛాయామాత్రముగా స్ఫురించు వాల్మీకి భావమునకు ఈతడు క్రొత్త రూప మిచ్చి ఆత్మీయ మొనర్చుకొనెనుగాని అంధానుకారణమునకు పాల్పడలేదు.

ఋతు సంహార రచనమునాటికి కాళిదాసు కవితా ప్రతిభ రావలసినంత పరిపాకమునకు రాలేదనుట నిక్కువము. ఈ లేతదనము చూచి కొందరు ఈ రచనము కాళిదాసునిది కాదేమో? అని సందేహించుటయును జరిగినది. కాని ఆ సందేహమును శ్రీ అరవిందులు సోదాహరణముగ నివారించి ఈ రచన మాతనిదేయని నిర్ణయించిరి. అంతియేకాదు—కాళిదాసు రచనములతో తగినంత పరిచయమున్నవారి కెవ్వరికైనను ఈ రచనము కాళిదాసునిదే యని తోచితీరును ఋతు కావ్యమున బీజప్రాయముగానున్న అనేక భావములును, శిల్పమును, ఆతని ఉత్తరోత్తర ప్రౌఢ కావ్యములందు వికాసము నందిన తీరును అశ్రమముగ నిరూపింపవచ్చును.

ఆదికవి కావ్యమున కథా సందర్భము నమాత్రమే దర్శనమిచ్చు ఋతువులకు ప్రత్యేక కావ్య గౌరవమును ఇచ్చిన ప్రతిష్ఠ కాళిదాసుని కొక్కనికే దక్కినది. ఖండ కావ్య రచనమునందును సంస్కృత సాహిత్యమునందు కాళిదాసునిదే అగ్ర తాంబూల మనుట గమనింపదగిన అంశము.

ఋతు సంహారమును తెఱచినంతనే వివిధ వర్ణ శబలమయిన మయూర పింఛమువలె కనుల మిరుమిట్లు గొల్పుచు ఒకదాని వెన్నంటి వేరొకటిగ ఆరు ఋతువులు ప్రత్యక్షమగును. ఆనాటి సంపన్నుల భోగములు, జీవన రుచులు, రసజ్ఞతలు, పొలములు, పొలిమేరలు, పాంథులు, ప్రవాసినులు, మున్నగు వారితో గూడిన వింత లోక మొకటి ఈ ఋతు కావ్య దర్పణమునుండి మనవైపు తొంగిచూచును.

ఊహాశాలితలో, భావనా పటుత్వములో, కాళిదాసు ఋతు కావ్యము వాల్మీకికి కవితా శిఖరములను తాకలేకపోయి నను, తన విలక్షణ మధురిమతో రసజ్ఞులను ల గొనుచున్నది.

తన ఎదుట ప్రత్యక్షమయిన ఋతుశోభలోని ప్రకృతి లీలా ఖేలనమును, మానవ హృదయములలోని పులకరింతలను తన రచనా లాలిత్యములో, శబ్ద సంగీతములో పట్టి చూపగల కాళిదాస కౌశలము ఈ ఋతు కావ్యము నలంకరించినది. ఆ మెత్తని మాటలలో, మృదు సమాస కల్పనములో, ఛంద స్పౌంద ర్యములో ఏ ఋతువునకు ఆ ఋతువునకు చక్కని వాతావరణ మేర్పడి అది అచ్చముగ ఎదుటికివచ్చి కూర్చున్నటులేయుండును. సొగసయిన భావముతో పద్య మెంత ఒయ్యారములు పోవునో, వట్టి మాటల ప్రోగయిన పద్యమును అంత సుకుమారమయిన కూర్పుతో నాదసౌందర్యముతో నడచిపోవును. రసజ్ఞ సమ్మో హనము అయిన ఈ ప్రసన్న, మాధుర్య గుణములే ఈ ఋతు కావ్యములోని భావనా శైథిల్యమును, సర్వతోముఖ, దర్శనా భావమ్మును పునరుక్తులను విజయవంతముగా కప్పివైచినవి. ఇంతియేకాక ఈ ఋతు కావ్యమునందు వేరొక గుణ విశేష మును నిపుణముగా ఉపలక్షింపవలసియున్నది. పరిపూర్ణ వికా సము నొందిన తక్కిన మూడు కావ్యములలోని కవితా సంపత్తికిని ఇందు రేఖామాత్రములయిన బీజ నిక్షేపములుకాన్పించు చున్నవి. ఆ యా ప్రసక్తులయందు వాని వివరములను పరి శీలింపగలము

రచనోత్సాహతరంగిత మైన హృదయముతో యువ కాళిదాసు లేఖిని చేపట్టగనే గ్రీష్మము ప్రత్యక్షమైనది. వాల్మీకి మహర్షి చురుకైన కన్ను గ్రీష్మముపై పడలేదు. అది కాళి దాసునకు మంచి అవకాశము నిచ్చినది. నూత్న ఋతు దర్శన మున పొందిన ఆత్మానుభూతితో ఆ ఋతువర్ణనమున కుపక్ర మించినాడు!

కాళిదాసు నగరవాసి. దేశము సుసంపన్నము. జాతి భోగభాగ్యసమృద్ధము. కవి హృదయము మధురభావ సంచాలి తము. ఈతడు మొట్టమొదట గ్రీష్మము ప్రజా జీవితమున నెట్లు ప్రవేశించినదో చూచినాడు! అందును శృంగార జీవిత మునకే అగ్రపీఠము! ప్రేయసులు, ప్రియులు, అంతఃపుర ములు, హర్మ్యాగ్రతలములు, తొలిచూపునకు కనువిందులు.

గ్రీష్మము నగరవాసుల కెంత సుఖప్రదమో అరణ్య ప్రకృతికి అంత భయంకరము! ఈ రెండువైపులలోని మూల తత్త్వమును నిశితముగా చూచి సజీవచిత్రములు నిర్మించుట యందే కాళిదాసు కౌశలమును పసికట్టగలము.

గడుసువాడయిన శిల్పి ఒక చిత్రమును చిత్రింపదలచి నపుడు ఆ వస్తువునకు జీవభూతములగు అంశములను గుర్తించి తన రేఖలోనికి తెచ్చెనా?—అతడు విజయి! అట్లే కాళిదాసు— ఋత్వవతరణ చిత్రములలో లోకోత్తరశిల్పము తేకున్నను, ఆ ఋతువునకు ప్రాణప్రాయము అయిన అంశములను స్మరిం చుటలో ఆ ఋతువు సాక్షాత్కరించి నట్లుండును.

గ్రీష్మము అవతరించినది! దాని ప్రథమ రూప చిత్ర మిది!

> ప్రచణ్డ సూర్యః స్పృహణీయచన్ద్రమాః
> సదావగాహక్షమ వారి సఞ్చయః
> దినాంతరమ్యో ఽభ్యుపశాన్త మన్మథో
> నిదాఘకాలో ఽయ ముపాగతః ప్రియే

"తీవ్రమైన సూర్యుడు, ఇంపైన చంద్రుడు, ఎప్పు డైనను స్నానము చేయదగిన నీటి కొలకులు, రమ్య సాయంత నములు, వెనుకబట్టిన కామన, అట్టిది వేసవి తొలిదర్శనము.

ఇది బాహ్య దర్శనము. ఇక అభ్యంతరము.

> సువాసితం హర్మ్యతలం మనోహరమ్
> ప్రియాముఖోచ్ఛ్వాస వికమ్పితం మధు
> సుతన్త్రిగీతం మదనస్య దీపనం
> శుచౌ నిశీథే ఽనుభవన్తి కామినః.

'సువాసన లెగయు సౌధోపరిభాగములు, ప్రియురాలి ఊర్పుచే కదలు మధువులు, రాగమును ప్రోత్సహించు తంత్రీగానములు, ఈ సుఖపరంపరను శృంగారులు వేసవి రాత్రులం దనుభవించుచున్నారు'

ఈ బహిరంత శ్చిత్రణములో గ్రీష్మ ప్రధాన లక్షణ ములు ప్రతిఫలించి ఆ ఋతుమూర్తిని ప్రత్యక్షము చేసినవి. తరువాత కాళిదాసునకు సహజమయిన ఒక చమత్కృతి!

'నిదాఘతాపమున సొమ్మసిలిన మన్మథుని—మంచి గంధపునీట తడిసిన వీవనల వీవలితో, హారములతో శోభించు పాలిండ్ల స్పర్శలతో, వీణానాదములతో మేల్కొలుపుచున్నారు.

(ఋతు—1—8)

ఈ గ్రీష్మ సౌందర్యము ఇంకను పరిణతమయి రఘు వంశము పదునారవసర్గలో కాన్పించును. ఒక మచ్చుతునక!

> 'స్నానార్ద్ర ముక్తే ష్వనుధూపవాసమ్
> విన్యస్త సాయన్తన మల్లికేషు
> కామో వసన్తా త్యయ మన్దవీర్యః
> కేశేషులేభే బలమఙ్గనానామ్'

పై ఋతు సంహార పద్యములోని 'విబోధ్యతే సుప్త ఇవాద్య మన్మథః' అనుమాటయే యిచ్చట మఱింత బలము సంపా దించుకొన్నది.

ఈ ఋతువర్ణనమునకు స్వీకరించిన తొలి రేఖలలో కవి పరిశీలన కౌశలమును, అయత్నస్ఫూర్తిని దర్శింపగలము.

ఇక రెండవవైపున చూడవలసినది కవి ప్రకృతి పరిశీలన నైపుణ్యము.

గ్రీష్మమున ఆరణ్యక ప్రకృతి దుర్దర్శము. ఒకవైపున జంతుకోటిపడు దురంత గ్రీష్మతాపము! వేరొకదెస నాల్కలు చాచి చెలరేగు కార్చిచ్చులు! నడుమ శుష్కవన వీథులు! ఇచటి గ్రీష్మరూపమును రూపించుటయందు పరువెత్తిన కాళిదాస భావన ఆతని భావి కీర్తికి పునాదులు పరచినది.

ఆశ్రమమున విరోధ జంతువులు ముని మహిమవలన కలిసి మెలసియుండుట ప్రసిద్ధము! కాని ఇట నిదాఘ తాపమునకు తాళలేని విరోధ జంతువులు నిస్స్పృహతో, సహజ వైర ముడిగి తమ వైరులచెంతకే చేరుట దయనీయ మయిన దృశ్యము!

శ్లో. రవే ర్మయూఖై రభితాపితో భృశమ్
విదహ్యమానః పథి తప్తపాంసుభిః
అవాఙ్ముఖో జిహ్మగతిః శ్వస న్ముహుః
ఫణీ మయూరస్య తలే నిషీదతి

“సూర్య కిరణములు మొదట మాడ్చినవి. పిమ్మట బాటలోని వేడిధూళులు కాల్చినవి! తలవంచి నిట్టూర్చుచు వంకరలు పోవుచు, పాపము, పాము—నెమలిపురినీడ క్రిందికి చేరుచున్నది.’

హంతవ్యము హంత యొద్దకు జేరుచున్నట్లే హంత హంతవ్యము చేత చిక్కినను, ఆసక్తి చూపకున్నది.

హుతాగ్ని కల్పైః సవితు ర్గభస్తిభిః
కలాపినః క్లాన్త శరీర చేతసః
న భోగినం ఘ్నన్తి సమీపవర్తినమ్
కలాప చక్రేషు నివేశితాననమ్

“వ్రేల్చిన హోమాగ్నివలె నున్న సూర్య కిరణములచే శరీర, చిత్తములు చూడిన నెమళ్ళు తమ పురులందు మొగము దూర్చి చెంతకుచేరిన పామును చంపకున్నవి.’

ఇట్లే ఏనుగులు సింహములకును, కప్పలు పాములకును భయపడక ఒకదాని చెంతకు వేరొకటి చేరుచున్నది.

కాని ఈ ప్రకృతి చిత్రణ పరాయణత్వములో పునరుక్తిని సైతము లెక్కచేయలేదు. నిదాఘ సందర్భమున కవి చేసిన ఈ ఉత్ప్రేక్ష చూడదగినది.

వరాహములు తమ పొడవయిన ముట్టెలతో బురద ఎండిన చెరువులందు తుంగ ముస్తెలకై త్రవ్వుచుండగా ఎండవేడిమికి తాళజాలక అవి భూమిలోనికి చొచ్చుకొని పోవ తలచి నట్లున్న' దట.

ఇది యిట్లుండగా వనాంతములందు కార్చిచ్చులు విజృంభించినవి.

శ్లో. జ్వలతి పవన వృద్ధః పర్వతానాం దరీషు
స్ఫుటతి పటు నినాదైః శుష్కవంశ స్థలీషు
ప్రసరతి తృణమధ్యే లబ్ధవృద్ధిః క్షణేన
గ్లపయతి మృగవర్గం ప్రాంతలగ్నో దవాగ్నిః

‘గాలికి చెలరేగిన దవాగ్ని, పర్వతపు గుహలందు మండుచు, ఎండిన వెదురు పొదలను పటపట ప్రేల్చుచు, క్షణములో గడ్డితావుల పెచ్చుపెరిగి, జంతు సంతతిని చీకాకు పరచుచున్నది.

ఈ పద్యమునందలి ‘స్ఫుటతి, పటు’ శబ్దములు వెదుళ్ళ ధ్వనిని ‘లగ్నో దవాగ్నిః’ అనుమాటలు అగ్నిహోత్రుని పట్టును చక్కగా వ్యంజించుచున్నవి. ఇటులు పుట్టిన దవాగ్ని క్షణములో విశ్వరూపము నందినది.

శ్లో. బహుతర ఇవ జాతః శాల్మలీనాం వనేషు
స్ఫురతి కనక గౌరః కోటరేషు ద్రుమాణామ్।
పరిణత దళశాఖా నుత్పతన్ ప్రాంశువృక్షాన్
భ్రమతి పవన ధూతః సర్వతోఽగ్నిర్వనాన్తే॥

‘అగ్ని బూరుగుచెట్లతోపులందు పెల్లుగ రేగి చెట్ల తొర్రలందు బంగారపు రంగులతో వెలిగిపోవుచున్నది. ఎండుటాకుల చెట కెగబాకుచు, గాలికి మరింత పెరిగి అడవి యందంతటను స్వేచ్ఛా సంచారము చేయుచున్నది.’

ఈ దావాగ్నికి ఒడలు కాలిన ఏనుగులు, గురుపోతులు, సింహములు, తమ విరోధములు మరచి ఇసుక తిన్నెల నదిచెంతకు చేరుకొనుచున్నవి. (ఋతు—1—27)

ఇట్లు గ్రీష్మమును వర్ణించి “వ్రజతు తవ నిదాఘః। కామినీభి స్సమేతః। నిశి సులలితగీతే హర్మ్యపృష్ఠే సుఖేన॥” అను ప్రియ వచనముతో కవి ఈ ఋతువును ముగించినాడు!

అనుపదముననే వానకారు వచ్చినది. అది ఒక ఉద్ధత తేజస్వి యగు రాజువలె మేఘ దంతావళములతో మెరుపుజెండాలతో పిడుగు చప్పుళ్ల వాద్యములతో ఏగుదెంచినది! ఐనను అది కామిజన ప్రియమైనది.

సశీకరామ్భోధర మత్తకుఞ్జరః
తటిత్పతాకోఽశని శబ్ద మర్దలః
సమాగతో రాజవ దుద్ధతద్యుతిః
ఘనాగమః కామిజనప్రియః ప్రియే॥

ఈ వర్షర్తు వర్ణనమును వాల్మీకి పటుతర కవితా వైభవముతో నిర్వహించెను. ఆయన వర్షా చిత్రణములో కట్టిన బొమ్మలు అనితర సాధ్యములు. కాళిదాసు వర్షర్తు

వర్ణనము అంత శక్తిమంతము కాకున్నను, ఆతని ప్రకృతి వర్ణన కౌశలముతో, రసస్ఫూర్తితో, నిసర్గ లలితోక్తులతో హృద్యముగనే నడచినది.

పై ప్రారంభ పద్యమునకు వాల్మీకి ఒక భావము ప్రోద్బల మిచ్చియుండును.

శ్లో. విద్యుత్పతాకా స్సబలాకమాలాః
శైలేంద్ర కూటాకృతి సన్నికాశాః।
గర్జన్తి మేఘా స్సముదీర్ణవేగాః
మత్తా గజేంద్రా ఇవ సంయుగస్థాః॥

మెరుపు జెండాలతోడను, బలాక మాలలతోడను గూడి పర్వత శిఖరాకారముతో గర్జించు మేఘములు యుద్ధరంగము నందలి మదగజములవలె నున్నవి. అను ఉపమానము ఋతు కావ్యమున ఘనాగమమునకు రాజోపమానముగా పరిణమించి యుండవచ్చును.

వర్షాగమమును కలయజూడగా కవికి, అందలి ప్రకృతి నవజీవనమును, భూమి క్రొత్తయందమును, పులకించిన వన స్థలుల పుష్పశోభయును, ప్రకృతి పుక్కిలించిన సౌందర్యాతిశయమును చూచి ప్రియురాండ్రు జ్ఞప్తికిరాగా పరితపించు ప్రవాసులును, ప్రియులను తలంచుకొని విలపించు ప్రవాసినులును, తప్త భూధరముల నోదార్చు జలద సౌహార్దమును, మేఘమిత్రుని చూచి నృత్యముచేయు వనసీమల సంతోషమును, ఒక్కటొక్కటిగా పొడగట్టి ఆతని ఆర్ద్రచిత్తమును కవితాయత్తము చేసినవి! కనుకనే కవి ఈ ఋతువును 'జలద సమయ ఏష ప్రాణినాం ప్రాణభూతః' అని ప్రశంసించెను. ఈ భావమే పక్వమయి 'మేఘాలోకే భవతి సుఖినో ప్యన్యథావృత్తి చేతః। కణ్ఠాశ్లేష ప్రణయిని జనే కింపున ర్దూర సంస్థే' అని మేఘదూతమున దర్శన మిచ్చును. ఈ ఋతువునందు కవికిగల రసోత్సుకత బహు విధముల పరిణతమై మేఘదూత, విక్రమోర్వశీయములందు రసవత్కవితా సమృద్ధిని పండించినది.

ఈ ఋతురాజు ఎంత అతిశయముగ, ఆడంబరముగ ప్రవేశించినను, హృదయమున నెంత 'సరసుఁడు'? కనుకనే ఈతనిని కామిజన ప్రియుం డనుట—

'శిరసి వకుళమాలాం మాలతీభి స్సమేతామ్
వికసితనవపుష్పైః యూథికా కుట్మలైశ్చ।
వికచనవకదమ్బైః కర్ణపూరం వధూనామ్
రచయతి జలదౌఘః కాన్తవ త్కాల ఏషః

ఈ జలద సమయము ప్రియునివలె మాలతులతో కూర్చిన పొగడపూలదండలను సుందరాంగుల వేణి భరము అందును, క్రొత్తపూలను, మొల్లమొగ్గలను కడిమి పూలతో కలిపి కర్ణములందును అలంకరించుచున్నది.

Statement about ownership and other particulars about newspaper

Under Section 19 D (b) of the Press and Registration of Books Act.

BHARATI

1. Place of publication: Madras
2. Periodicity of its publication: Monthly
3. Printer's Name: Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: 6&7, Thambu Chetty Street, Madras-1
4. Publishers Name: Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: 'As above'
5. Editor's Name: Sri S. Sambhu Prasad
   Nationality: Indian
   Address: 16, Luz Avenue, Mylapore, Madras-4
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one percent of the total capital.

NAMES	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	16, Luz Avenue, Mylapore, Mdras-a4.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street, Madras-1.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA

1-3-69 Signature of Pudlisher

ఈతనిని చూచి వసుంధర హర్ష ప్రఫుల్లయై రత్నాభరణ భూషిత యైనది.

శ్లో. ప్రభిన్న వైడూర్య నిభై స్తృణాంకురైః
సమాచితా ప్రోత్థిత కన్దళీదళైః।
విభాతి శుక్లేతర రత్న భూషితా
వరాఙ్గ నేవ క్షితి రిన్ద్రగోపకైః॥

లేబచ్చిక వైడూర్యములతో, నేలతాడిమొలకల నీలములతో, ఆరుద్ర పురుగుల కెంపులతో అలంకృతమైన క్షితిసుందరి ఉత్తమ స్త్రీవలె ఇంపు లొలుకు చుండెను.

ఈ కారున పూవింటిదొర విల్బడి అప్రతిహతమై చెల్లు చున్నది.

శ్లో. పయోధరై ర్భీమగభీర నిస్వనైః
తటిద్భి రుద్వేజిత చేతసో భృశమ్।
కృతాపరాధా నపి యోషితః ప్రియాన్
పరిష్వజన్తే శయనే నిరన్తరమ్॥

గర్జించు మేఘములకును, చరాలున మెరయు మెరపులకును భయపడి స్త్రీలు తమ కెగ్గుచేసినను ప్రియులను స్వయంగ్రాహమున పొదువు కొనుచున్నారు!

సంయుక్తులను ఇట్లు అలరించ నీ ఋతువు వియుక్తుల హృదయముల నెంత గాయపరచుచున్నది!

శ్లో. వలాహకా శ్శాశనిశబ్ద మర్దలాః
సురేన్ద్ర చాపం దధత స్తటిద్గుణమ్।
సుతీక్ష్ణ ధారా పతనోగ్ర సాయకైః
తుదన్తి చేతః ప్రసభం ప్రవాసినామ్॥

పిడుగుచప్పుడు వాద్యములును, మెరపునారితో గూడిన ఇంద్రధనువును కలిగిన మేఘములు జలధారల వాడిబాణములతో వియోగుల హృదయముల నొప్పించుచున్నవి.

ఇంకొక వైపున ఈ వియోగుల కాంతల దయనీయ మూర్తులును ఇట్లు ప్రత్యక్షము లగును.

శ్లో. విలోచనేన్దీవర వారి బిన్దుభిః
నిషిక్త బిమ్బాధర చారుపల్లవాః
నిరస్త మాల్యాభరణా నులేపనాః
స్థితా నిరాశాః ప్రమదాః ప్రవాసినామ్॥

కలువరేకుల వంటి కన్నులనుండి తొరగిన భాష్పజలము ఎర్రని చివురుపెదవులను తడుపగా పూతలను, పూలను విడిచి నగలను నిరసించిన ప్రవాసి కాంతలు నిరాశతో కుమిలి పోవుచున్నారు. ఈ భావమునుండియే అలకాపురిలోని యక్ష వధువు చిత్రము రూపు కట్టినది.

మేఘ దర్శనమున ప్రఫుల్లము అయిన వనసీమలు నవ్వుచు నాట్య మాడుట మానవ మైత్రీ మాధుర్యమునకే వన్నెపెట్టు దృశ్యము!

శ్లో. ముదిత ఇవ కదమ్బైః జాతపుష్పైః సమన్తాత్
పవన చలిత శాఖైః శాఖిభి ర్నృత్యతీవ
హసిత మివ విధత్తే సూచిభిః కేతకీనామ్
నవసలిల నిషేకాత్ శాంత తాపో వనాన్తః

ఇట్లే మేఘ, పర్వతముల మైత్రియును ఈ ఋతు కావ్యమున వేరొక హృద్యమయిన దృశ్యము.

'జలభర భరితములమయిన మమ్ములను శిరసావహించిన ఉదారుడని గ్రీష్మాగ్నితప్త మయిన వింధ్యమును మేఘములు చల్లని జలధారాలతో అభిషేకించుచున్న' వట!'

ఈ మేఘ పర్వతమైత్రి మేఘదూతమున 'ఆపృచ్ఛస్వ ప్రియసఖ మముం తుంగ మాలింగ్య శైలమ్' అని మరింత బలముతో పొడగట్టెను.

ఈ ఋతు నిష్క్రమణమును వాల్మీకి శరత్ప్రారంభమున ప్రహృష్ట వదనమున విషాద రేఖవలె చిత్రించినట్లే కాళిదాసును జాలిగొలుపు వీడ్కోలు దృశ్యముగా రూపించెను.

శ్లో. నీలోత్పలదళశ్యామాః శ్యామీకృత్వా దిశో దశ
విమదా ఇవ మాతంగాః శాన్తవేగాః పయోధరాః

శ్లో. ఘనానాం వారణానాం చ మయూరాణాం చ లక్ష్మణః
నాదః ప్రస్రవణానాం చ ప్రశాంత స్సహసా నఘ॥

అని వాల్మీకి అనగా కాళిదాసు—

శ్లో. నష్టం ధనుర్బలభిదో జలదోద రేషు
సౌదామనీ స్ఫురతి నాద్య వియత్పతాకా
ధున్వన్తి పక్షపవనై ర్నభో బలాకాః
పశ్యన్తి నోన్నతముఖా గగనం మయూరాః॥

'మేఘ గర్భముల ఇంద్రధనువులు నశించినవి. గగనవైజయంతి సౌదామిని మరి మెరయదు. బెగ్గురు లిక ఆకాశమున రెక్క విసరవు తలలెత్తి నెమళు లిక ఆకాశమును చూడవు.'

ప్రకృతి రంగమున మబ్బుల తెర ప్రక్కకు లాగగా 'రెల్లు పూల తెలిపట్టు చీర ధరించి వికసించిన పద్మముఖముతో హంస కూజితముల నూపురములు గల్లుగల్లున మొరయగా పండిన పచ్చని వరిచేలమెరుగుల తనువల్లి ఒయ్యారముగా ఇంచుక వంగియుండ శరత్తు అందాలరాణి కొత్తకోడలి వలె మన కన్నుల ఎదుట నిలిచినది.'

తొలి ఋతువులు రెండును 'నిదాఘః' 'ఘనాగమః' అని పుంలింగములు. శరత్తు రమణీమణి. 'ప్రాప్తా శరత్'.

శ్లో. 'కాశాంశుకా వికచపద్మ మనోజ్ఞవక్త్రా
సోన్మాద హంసరవ నూపుర నాదరమ్యా
ఆపక్వశాలి లలితానత గాత్రయష్టిః
ప్రాప్తా శరన్నవ వధూరివ రూప రమ్యా'॥

శరత్తు లోకమునందవతరింపగానే సర్వ ప్రకృతియును హర్ష ప్రఫుల్ల మధుర హాసప్రాయమై ధవళశోభతో వెలిగిపోవుచున్నది.

శ్లో. 'కాశైర్మహీ శిశిర దీధితినా రజన్యః
హంసైర్జలాని సరితాం కుముదైః సరాంసి
సప్తచ్ఛదైః కుసుమ భారనతైర్వనాంతాః
శుక్లీకృతా న్యుపవనాని చ మాలతీభిః'॥

తెల్లని పూలతో భూమి, చంద్రునితో రాత్రులు, హంసలతో నదీజలములు, తెల్లగలువలతో సరస్సులు విరియబూచిన ఏడాకులరటులతో వనప్రదేశములు, మాలతిపూలతో పూదోట శుభ్రశోభలను వెలార్చుచున్నవి.

ఋతు సాధారణము లయిన కొన్ని అంశములను వరుసగా పేర్చినను ఈతడు కన్నులకు చల్లనైన ఒక విలక్షణ శరద్దృశ్యమును కల్పింపగలడు.

శ్లో. సంపన్న శాలి నిచయావృత భూతలాని
స్వస్థ స్థిత ప్రచుర గోకుల శోభితాని
హంసైస్ససారసకులైః ప్రతినాదితాని
సీమాన్తరాణి జనయన్తి నృణాం ప్రమోదమ్॥

'పండి యొరగిన పచ్చని వరిచేలలో నిండిన భూభాగములు, నిరామయముగ, నిర్భరముగ సంచరించు గోగణములు, హంసల బెగ్గురుల కంఠనాద ప్రతినాదములు.– వీని అకృత్రిమశోభతో ఇంపులొలుకు గ్రామసీమలు ఒకనాటి భారత శరద్విభూతిని ఎంత చక్కగా చాటుచున్నవి!

ఈ శరన్మనోహర దృశ్యములలో తన ప్రియురాలిని భావించుకొని ప్రవాసి పథికుడు ఖిన్నుడగుచున్నాడు.

శ్లో. అసితనయన లక్ష్మీం లక్షయిత్వోత్పలేషు
క్వణిత కనక కాఞ్చీం మత్త హంసస్వనేషు
అధర రుచిర శోభాం బన్ధుజీవే ప్రియాణామ్
పథిక జన ఇదానీం రోదితి భ్రాన్త చిత్తః

నల్లగలువలందు ప్రియురాలి నీలికన్నుల అందమును, మత్తహంస ధ్వనులందు ఆమె బంగారు మొలనూలిరవళిని, బంధుజీవ పుష్పమున ఆమె కెంజెదవి సొగసును చూచి ఆతడు మనసు చెదరి దుఃఖించుచున్నాడు.

ఈ భావమే మేఘదూత విక్రమోర్వశీయములందు ఇంకా వికాసమునొంది కాన్పించును.

శరల్లక్ష్మి ప్రకృతి రంగమును విడిచి పోవుచున్నది. ఆ పోవుటలో ఎంత ఒయ్యారము! ఎంత ఔదార్యము.

శ్లో. స్త్రీణాం విహాయ వదనేషు శశాఙ్కలక్ష్మీమ్
కామం చ హంస వచనం మణినూపురేషు।
బన్ధూకకాన్తి మధరేషు మనోహరేషు
క్వాపి ప్రయాతి సుభగా శరదాగమ శ్రీః॥

చంద్రశోభను స్త్రీల ముఖములందును, హంస ధ్వనిని వారి రత్నపుటందెల యందును, మంకెనపూవు సొగసును వారి పెదవులందును విడిచి శరత్సుందరి యెచటికో పోవుచున్నదట!

శరద్వైభవమును శ్రద్ధమై చిత్రించిన కవి శరత్తునకు ముఖ్యలక్షణమయిన జైత్రయాత్రలను విస్మరించుట ఇందు ఆతని ప్రకృతిదర్శనైకలౌల్యమును వెల్లడించును.

'ఉద్యోగ సమయ స్స్వామ్య పార్థివానా ముపస్థితః'

అను రామాయణ వచనము నెరిగియున్నను, ఆ మాట ఈ రచన నాటికి కవి హృదయమున భావితము కాలేదు. రఘువంశమున ఈ లోపము తీరి

'సరితః కుర్వతీ గాధాః పథ శ్చాశ్యాన కర్దమాన్।
యాత్రాయై చోదయామాస తం శక్తేః ప్రథమం శరత్॥

అని శరత్తునకు సర్వతోముఖ పుష్టిని చేకూర్చినది.

తరువాతిని హేమంత శిశిరములు. ఈ ఋతువుల యొద్దకువచ్చునరికి ఈతని చూపు వివిధప్రకృతిదృశ్యములను పరిశీలించుటకు బదులు ఎక్కువగ శయ్యా గృహములందును, శృంగారవతులందును కేంద్రీకృతమయి పరిమిత పరిధిలో నడిచినది.

శ్లో. గాత్రాణి కాలీయక చర్చితాని
సపత్రలేఖాని ముఖాంబుజాని।
శిరాంసి కాలాగురుధూపితాని
కుర్వన్తి నార్యః సురతోత్సవాయ॥

'స్త్రీలు శరీరమున చక్కని పసపు పూతలు పూసికొని ముఖములందు మకరికాదిపత్త్రరచనలు చేసికొని కేశపాశములకు అగురు ధూపములు వేసికొని శృంగారక్రీడకు సిద్ధమగుచున్నారు.'

ఇట్లు కామకేళికి నాంది వాక్యము పలికి తర్వాత చిత్రించిన ఈ దృశ్యములు ఆతని హేమంత వర్ణనములోని సొగసైన చెణుకులు!

'తరుణ్యః హసంతి నోచ్చై ర్దశనాగ్ర భిన్నాన్
ప్రపీడ్యమానా నధరా నవేక్ష్య

తరుణులు పెదవి విప్పి పకపక నవ్వరు. ఏల? పలు నొక్కులకు గాయపడిన పెదవులు చలిగాలికి బిగబట్టి నవ్వనిచ్చుట లేదు.

శ్లో. పీనస్తనోరఃస్థల భాగ శోభామ్
ఆసాద్య తత్పీడన జాత ఖేదః।
తృణాగ్రలగ్నై స్తుహినైః పతద్భిః
ఆక్రందతీ వోషసి శీతకాలః

శీతకాలము యువతుల పొంకపు పాలిండ్ల అందము చూచి అచటికి చేరినది. కాని (అది ప్రమాదస్థలమని పాపము దానికి తెలియదు) యువదంపతుల ఒత్తిడికి నలిగి నవసి ప్రాతః కాలమున బయటికి వచ్చి ఏడ్వగా దాని కన్నీటి బొట్లే లేతగడ్డి పోచలపై మంచు బిందువుల నెపమున గన్పడుచున్నవి.

ఇంకొక హేమంత స్త్రీ చిత్రము!

శ్లో. 'కాచి ద్విభూషయతి దర్పణ సక్తహస్తా
బాలాతపేషు వనితా వదనారవిందమ్।
దంతచ్ఛదం ప్రియతమేన నిపీత సారమ్
దంతాగ్రభిన్న మవకృష్య నిరీక్షతే చ॥'

ఒక స్త్రీ చేతిలో అద్దముంచుకొని ప్రాతఃకాలపు లేత ఎండలో ముఖము నలంకరించుకొనుచు రాత్రి ప్రియునిచే సారము గ్రహింపబడిన పెదవిని ఇంచుక పైకిలాగి చూచుచున్నది.

ఇట్టి నిర్దయ ప్రియోపభోగమే ఇంచుక భంగిభేదమున హేమంత వర్ణనమున 12, 14, 16 శ్లోకములందును, శిశిరమున 7, 9, 11, 15 శ్లోకములందును పాఠకు ప్రత్యక్షమగును. విజమునకు ఈ రెండు ఋతువులకును విశేష భేదము లేకుండుటచే ఒకే ఋతువును పూర్వాపర భాగములుగా విభజించి వర్ణించినట్లు కాన్పించును. కనుకనే ఈ రెండు ఋతువులందును శ్లోకసంఖ్య మిక్కిలి తగ్గి 18, 16 అయినది. ప్రకృతిలో పరిణత శాలివనములు క్రౌంచ నినాదములు, ప్రచురశాలీక్షురమ్యతలు, కాలాగురు వాసనలు, ప్రబల సురత కేళులు—ఉభయ సాధారణములయి దర్శనమిచ్చును.

మిగిలినది వసంతము. సర్వకవుల దృష్టిలోను వసంతము ఋతురాజు. కాని ఈతడీ ఋతువును చివరికి తెచ్చెను. ఈ ఋతువును వాల్మీకి మహర్షి రామాయణ కిష్కింధ కాండమున అమోఘముగ వర్ణించెను. అతని ప్రభావమునకు లోనయి ప్రారంభముననే అనుకరణము పొలగుదునను జంకు చేతనో, లేక మనోహరమగు నా ఋతువుతో కావ్యమును ముగింపవలయునను కోరికచేతనో దీనిని చివరకు తెచ్చెనని ఊహింప వలసియున్నది. అట్లు లయినను, ఇది హేమంత శిశిరములవలె సామాన్యముగనే సాగి పోయినది. కాని— కుమార సంభవములోని శక్తివంతమయిన వసంత వర్ణనమునకు మూల ద్రవ్యమిచటి నుండియే లభించినదని చెప్పిన ఆశ్చర్యము కలుగును.

శ్లో. కర్ణేషు యోగ్యం నవకర్ణికారమ్
చలేషు నీలేష్వలకే ష్వశోకమ్
పుష్పంచపుల్లం నవమల్లికాయాః
ప్రయాంతి కాంతిం ప్రమదా జనానామ్

'ఈ వసంతమున చెవులందు కొండగోగులను, ముంగురులయందు అశోక, మల్లికాపుష్పములను స్త్రీలు అలంకరించుకొనుచున్నారు ఈ పుష్పాలంకారమే మరింత ప్రౌఢమయి కుమార సంభవమున పార్వతి శరీరము నలంకరించినది.

శ్లో. 'అశోక నిర్భర్త్సిత పద్మరాగమ్
ఆకృష్ట హేమద్యుతి కర్ణికారమ్
ముక్తా కలాపీకృత సింధువారమ్
వసంత పుష్పాభరణం వహంతీ'

వసంతమున తిర్యక్కులందును విజృంభించిన కామదీప్తి ఇందు సూచితమయి అదియే కుమారకావ్యమున స్ఫుట మూర్తి నందినది.

శ్లో. పుంస్కోకిల శ్చూతరసాసవేన
మత్తః ప్రియాం చుంబతి రాగహృష్టః
కూజద్ద్విరేఫో ఽప్యయ మంబుజస్థః
ప్రియం ప్రియాయాః ప్రకరోతి చాటు॥

ఈ ఋతు కావ్య భావమునుండియే 'మధుద్విరేఫః కుసుమైకపాత్రే ....దదౌ సా త్పంకజరేణుగంధి' అను కుమార సంభవ తృతీయ శ్లోకములు వచ్చినవి.

ఈ వసంత పద్యమున కాళిదాసుతనము తొంగిచూచుచున్నది.

శ్లో. నేత్రేషు లోలో మదిరాలసేషు
గండేషు పాండుః కఠినః స్తనేషు।
మధ్యేషు నిమ్నో జఘనేషు పీనః
స్త్రీణా మనంగో బహుధా స్థితో ఽద్య॥

'మధు మత్తములయిన స్త్రీల నేత్రములందు చంచలుడయి, కపోలములందు తెల్లబడి, పాలిండ్లయందు కాఠిన్యము దాల్చి, నడుములందు సన్నబడి, జఘనములందు బలసి మన్మథుడు అనేక విధముల కొలువు దీర్చియున్నాడు'. అనగా ఆయా వనితావయవములలోని సౌందర్యమే మన్మథోద్దీపకమై యున్నదని కవిచమత్కారము.

ఈ ఋతువర్ణనమును ముగించుచు ఈతడు చిత్రించిన మన్మథరాజు తైల వర్ణచిత్రము మరపురానిది.

శ్లో. ఆమ్రీ మంజుల మంజరీ వరశరః సత్కింశుకం యద్ధనుః
జ్యాయస్యాళికులం కళంకరహితం ఛత్రం సితాంశుస్సితం
మత్తేభో మలయానిలః పరభృతో యద్వందినో లోకజిత్
సో ఽయం వో వితరీ తరీతు వితనుః భద్రం వసంతాన్వితః

'మామిడిపూగుత్తి బాణము, మోదుగుపూవు ధనువు, తుమ్మెదల బారు నారి, చంద్రుడు వెల్లగొడుగు, మలయమారుతము పట్టపుటేనుగు, కోకిలలు వందిమాగధులు— ఈ పరివారముగల మన్మథప్రభువు వసంతసహితుడై మీకు భద్రములిచ్చుగాక!'

ఇంతవరకు చేపట్టిన పెద్ద వృత్తము నెత్తికొని తననుండి రాబోవు మహాకవికి స్వాగతముగా చక్కని సమాప్తినిచ్చినాడు.

ఎఱుకకందని కన్య

శ్రీ డి. వేంకటసుబ్బారెడ్డి

అల్లంతదూరాన అల్లిబిల్లిగ పెరుగు
మొయిలుమేతల నడుమ మొలిచె నొకవనము
గుబురు గుబురుల వనము కొండ కోనల వనము
పచ్చపచ్చని వనము బంగారు వనము
సెలయేటి పాటతో చెమ్మగిల్లే వనము
కలకంఠి స్వరములో కరగేటి వనము
గుహల పొత్తిలి నొదిగి గుటకతీసే వనము
తెలిమబ్బు జల్లులను పులకించు వనము.

ఆ వనములో కొలని కావలను ఈవలను
పొదరిండ్ల చుట్టునను పూబాటలోన
అడుగు జాడలు కొన్ని అచ్చుపడి ఉండేవి
ఎవ్వరివో ఎన్నటివో ఎఱుకందనివి.

రాజ్యాల నేలేటి రారాజవరులవో
వాహ్యాళికై వచ్చు వనదేవతల్లవో
మించులను దిగి వచ్చు మేఘ కన్యలవో
జలక్రీడకై వచ్చు జలకామినులవో.

ఆ వనిని తోచినది అందాల ఓ బాల
నీడలో నీడగా గాలియల మాదిరై
ఎఱుక అంచుల మసలు ఏదో కల తీరుగా
ఆ బాల లేమోవి నల ప్రాకు చిరునవ్వు
కొనలలో నిలిచేరు కోటి చందురులు
ఆ కండ్ల కొలకులను ఆమె హృది కలహంస
అలవల్ల తిరిగేది ఆట్టేదాగేది.

ఆ మంజులమనోజ్ఞమౌ నామె వదనాన
జలపాతమై ప్రకృతి జారిపోయేది.
పాలకడలి యలలై ప్రసరింపసాగేది
నీలాభ్ర యవనికలు తేలిపోయేవి
ఆ సిగ్గు తెరలలో ఆ ఒయారపు నడక
నిద్రాణమౌ ప్రకృతి నిర్మలపు హృదివి
పాటు పోటులురేపి పరవళ్లు త్రొక్కేది
విద్యుత్తరంగమై వినిపించు చేదొ.

ఎవ్వతెయొ ఆబాల ఎక్కడిదొ ఏమిటో
తల్లిదండ్రులు లేరొ తనవారు లేరొ
మిలమిలా మెరిసేటి మింటి దివ్వెలుతప్ప
మించు బాలలుతప్ప మంచుసడితప్ప.

ప్రకృతిలో పుట్టినదొ ప్రకృతివలె పుట్టినదొ
ప్రకృతిలో పెరిగినదో ప్రకృతి పోలికనె.

ప్రకృతిలోనే ఆది ప్రకృతివలెనే ఆది
ప్రకృతిలోనే మురిసి ప్రకృతి మరపించి.

ఆ పూల సౌరభం ఆమెలో వీచినదో
వింత వింతల భావ వీచికల రేపి.

ఆ పూల మార్దవం ఆమెలో విరిసినదొ
వెలిమబ్బు కెంజాయ వింతయల్లికగ.

ఆ పూల అందాలు ఆమెలో మొలిచినవొ
ఆద్యంతములు గనక ఆకసములట్లు

ఆ పూల మధువులును ఆమెలో చిందినవొ
చల్లదనము లనెన్నో పెల్లు పెనవేసి.

మై మఱచి పోయినదొ మనసు మనసున లేదొ
పొలిమేరలను కనగ పొడకట్టసాగె.

ఎఱుకకందని కన్య

కలతయెఱుగని నిదురకౌగిలి కరగు ప్రకృతి
మూగ చెలువపు సరసి మూగ తామరగ.

ఒక్కటిగ ఒంటరిగ ఒక్కచో నిలిచినది
మేఘ మాలికనీడ మిసమిసల సంధ్య
ప్రకృతి మాత ధరించు పరికిణీ అంచుల
మెరయుచు గులాబీల మెలిరేఖవోలె.

ఆ ప్రకృతి విడివడిన ప్రతిసృష్టి ఆ కన్య.



అవతలి వైపు

డా. అక్కిరాజు రమాపతిరావు

రంగనాధరావుకి ఉలికిపడినట్లు మెలకువ వచ్చింది. ఒకటి, రెండు, మూడు. తలుపుమీద చేతి చరపులు వినవస్తున్నాయి. బద్ధకంగా ఒత్తిగిల్లాడు. కొంచెం విరామం. మళ్లా తలుపుమీద చప్పుడు. ఈ సారి చాలా కోపంవచ్చింది. లివ్వటు విరీక్షించాడు. సుభద్రలేస్తుందేమోనని. ఊహూ. ఆవిడ హాయిగా పవ్వళించే వుంది. విసురుగా పోయి తలుపు తెరచాడు. సన్న తుంపరులు పడుతున్నట్లున్నది. ఆహ్లాదకరమైన అనుభూతిని కలగచేసే వాతావరణం. చిరుచలి. ఇంకా సూర్యుడి కిరణాలు చెట్ల చివరలకైనా చేరలేదు. 'అమ్మగారు ఇయ్యాల శేరు పాలు ఎక్కువతెమ్మన్నారు?' అంటోంది పాల మనిషి. కళ్ళ కేమిటో కొత్తగా వుంది. మాంచి బింకమైన వయసులో, మంచు బిందువులు పడిన ముద్దబంతి పూవులాగుంది, పాలగిన్నె కిందపెడుతున్న వయసులోవున్న ఆడకూతురు. 'ఎవర్నువ్వు' అన్నాడు, రావు. 'నాను తెల్దేటీ'అని పళ్ళు పదీ కనపడేలా తళుక్కున నవ్వింది. 'మా లక్షింని కాదేటీ?'అని పలికింది. ఆసివి దుంపతెగ. ఎంతలావొళ్ళు చేశావే'—అనుకున్నాడు రావు. టీపాయ్‌మీద గంగాళంలాటిగిన్నె వుంటే దాన్నితెచ్చి పాలు పోయించుకున్నాడు. మాలక్ష్మి వెళ్ళిపోయింది.

రావు మళ్ళా తలుపు గడియపెట్టి పక్కమీద కూచున్నాడు. టీపాయ్‌మీద సిగరెట్‌పెట్టితీసుకుని, సిగరెట్ వెలిగించాడు. సుభద్ర వేపు చూశాడు. ఇటువేపు ఒత్తిగిలి పడుకుంది. బుజంమీద ఆచ్ఛాదన పక్కకిజారి పోయింది.పెదవుల మీద తీరిపోయిన అలసటను సూచిస్తున్న చిరునవ్వు. పెదవుల్లో సౌకుమార్యంలేదు. మొద్దుబారిపోయి వున్నాయి. ముసలి చిరునవ్వు అనుకున్నాడు. అట్లా సుభద్రను చూడగానే చిరాకు పుట్టుకొచ్చింది రావుకు. ఈ పెదవులనేనా, గులాబి రెక్కలనీ, మందార మొగ్గలనీ, నాల్రోజులు పుట్టింట వుండవలసి వచ్చిన పెళ్ళాన్ని ఆకాశానికెత్తేస్తూ తాను ఉత్తరాలు వ్రాసింది. ఒళ్లు గరుపొడిచింది. ఒదులుఒదులుగా రెవిక వేళ్ళాడిపోతున్నది. జుట్టంతా చిందరవందరగా వుంది. నిన్న సాయంకాలం తలంటుకొని వుంటుంది. లెక్క పెట్టటానికి వీలుగా తెల్లటి వెంట్రుకలు కనపడుతున్నాయి.

గాలిపోయినటైరూ, పాగిపోయినరబ్బరూ, అరిగిపోయిన జోడూ, ఆ గదిలోనే అక్కడాలక్కడా కన్పించాయి. సుభద్రవేపు చూశాడు. సిగరెట్టు పొగతో గుండెంతా వెచ్చబడింది. సుభద్ర చెయ్యిమీద చెయ్యివేసి గాజులు సవరించాడు. చెయ్యికాస్తా వెనక్కు లాక్కుంది. భువనైక సుందరి. రుబ్బురోలులా అటునుంచి ఇటు కదిలింది. అబ్బా, ఆ ముసలి నవ్వు. ఆ పెదవులపైన నల్లనిచారలు. రావుకి కష్టమనిపించింది.

బయటవాన పెద్దదయింది. పది నిముషాలు తక్కువ ఆరు. అయినా ఇంకా ఐదుకూడా కానట్లే వుంది.

సుభద్ర కళ్ళు తెరిచింది. ఆకళ్ళ చుట్టూ నల్లని వలయాలు. భావగర్వితంగా నవ్వింది తనవేపు చూసి. మెడకింద ముడతలు ముడతలుగా జారిపోతోంది శరీరం. రావు నవ్వలేదు. నవ్వు రాలేదు.

'పాలమనిషి వచ్చిందా?'

రావు విసుక్కున్నాడు.

'ఎక్కువ పోయించుకున్నారా?'

'తప్పుతుందా, నువు చెప్పిన తరువాత'.

'ఆహా ఏం భయభక్తులు!' అని వెటకారంగా ఆపైపయట బయటకు తీసి బుజాల చుట్టూ కప్పుకుంది. పొట్ట దగ్గర చూశాడు. ముడతలు ముడతలుగా పొట్ట కిందికిజారిపోయింది.

'ఇవాళ ఎంత పనుందో! వేగిరం లేపకపోయారా'అంటూ లేచి, ఊడిపోయిన జుట్టును, కొప్పుగా ముడుచుకుంది. ఇంట్లోకి వెళ్ళిపోయింది. వరండా తలుపు తీసి. రావుకి చాలాకోపం వచ్చింది. పాతికేళ్ళుగా కాపురం చేస్తున్నా, ఎప్పుడు ఏ విధంగా ప్రవర్తిస్తే తనకు నచ్చుతుందో సుభద్రకు తెలీదు. ఐదుగురు పిల్లలైతే కలిగారు. రావుకి చాలా అసంతృప్తి కలిగింది. ఆ తలుపు దగ్గరగావేసిపోవాలని తోచలేదు సుభద్రకు. మళ్ళీ వెల్లకిలాపడుకుని దుప్పటి కంఠం వరకూ లాక్కున్నాడు రావు. హాల్లో పిల్లల్ని నిద్రలేపుతోంది సుభద్ర. 'బాబ్జీ, అక్కయ్య ఇవాళ వచ్చేస్తుంది. వేగిరంలే, సుందరం, నువ్వు స్టేషన్‌కి వెళ్లొ ద్దూ. లే, పళ్ళు తోముకో, కాఫీ తాగు. మార్కెట్‌కు వెళ్ళాలి. అరటిపళ్లు గెల తేవాలి, లేలే.!' ఊ ఒకటే హడావుడి చేసేస్తున్నది.

పక్కమీదినుంచి లేవబుద్ధి పుట్టటంలేదు రావుకి. నరాల్లో ఏవిటో వెచ్చగా, మత్తుగా శక్తిపాకుతోంది. వెలిసిపోయిన దుప్పటిలా, మాసిపోయిన తలగడలా, సుభద్ర కూడా

స్తున్నది. పాలు బోయటానికి వచ్చిన పిల్ల మాలక్ష్మి ఎంత బింకంగా వుంది! వీధివాకిలిపక్కనే ఆకులురాలిపోయిన బాదంచెట్టు కనపడుతున్నది. పై కొమ్మలమాత్రం అక్కడక్కడ పండుటాకులున్నాయి. వరండాలో కంచుగంటలా ఎవరిదో గొంతు వినపడుతున్నది.

'అమ్మాగారో, సుభద్రమ్మగారో'. రావుకి పక్కమీద నుంచి లేవాలనిలేదు. తనగదిలోంచి వరండాలోకి పోయే తలుపులు బార్లా తీసిలేవుగాని, పూర్తిగా వేసిలేవు. చూశాడు.

కూరల తట్ట దింపుకొంటోంది. ఎవరో మనిషి. ఆడ కూతురు. సుభద్ర వచ్చి చేయేసి సాయంచేసింది. పొరపాటు చేశాడు తాను. చప్పునపోయి తాను చేయివేయాల్సింది. కూరల తట్టపైకి పూర్తిగా పైటజారిపోయింది. మళ్ళా ఆపైటను, కూరలమ్మి బుజాలమీద కప్పుకునే దాకా గుండె దడదడ కొట్టుకుంది రావుకు. పటుపైనకొప్పు. కోక బిర్రుగాకట్టింది. పొట్ట దగ్గర ముడతలు లేవు. కళ్ళు నవ్వుతున్నాయి.

'బోణి మనింటికాడనే చేద్దామని వచ్చానమ్మా. మళ్ళా ఏరింటుకైనా పోతే, తాజాసరకుకాదని మీరంటారు' అంటోంది. బుజాలమీద రవిక తడిసి చర్మానికి అంటుకున్నది. బయట చిన్న జల్లులోంచి వచ్చిందామె. పైటతో ముఖం తుడుచుకుంది. శిలలో మలచినట్టుగా వుంది. సుభద్ర బేరాలా సారాలా చేస్తోంది. 'ఏసుకోండమ్మా, ఇంతలో నేను సెడిపోయేదిలేదు. ఈ ఇంటికాడ తిని బతికినదాన్నేను' అంటోంది. ఆ గొంతు ఎక్కడో విన్నట్టుగా వుంది. ఆ నవ్వు ఎక్కడనో చూసినట్టుగా వుంది. ఆ వాలకం ఎప్పుడో తన కళ్ల పడ్డట్టేవుంది. ఆశ్చర్యం. మంచందిగి ఆ మనిషిని పరకాయించి చూడాలనిపిస్తోంది రావుకు. సుభద్ర కూరల బేరం ముగిసింది. కూరలమ్మి తట్ట ఎత్తుకొని వెనక్కు తిరిగింది. రావు సిగరెట్ అవతల పారేసి లేచి కూచున్నాడు. 'కందిరీగ నడుముదాన, కాళ్ళ కడియాలదాన'. ఎక్కడిదో యీ పాట యీ భావం. తళుక్కున మనసులో స్ఫురిస్తుండగానే, కూరలమ్మి వరండా దిగిపోయింది. రత్తాలేనా? అన్న అనుమానంలో పడ్డాడు. వానజల్లు తెరిపిన పడ్డది. రావు వీధి వాకిట్లోకి వచ్చి చూశాడు. పని మనిషి వాకిలి చిమ్ముతోంది. దూరంగా కూరలమ్మి, తన బరువో, తట్టబరువో, లయగా పిరుదులు కదలేట్టు వెళుతోంది. బావుండదని లోపల కొచ్చేశాడు రావు.

సుభద్ర కూరలన్నీ బుట్టలో కెత్తుతోంది.

'ఎంత ఖర్చు చేశావ్ పొద్దున్నే'.

'ఏం రాసుకోవాలా'

రావుకి చిర్రెత్తుకొచ్చింది. తానొక్కడే ఇంట్లో పిసినారి వాడు. సుఖంగా, హాయిగా భారుభూరున బ్రతకలేడు. ఎవరి కయినా బాధలేదు. తమ ఇష్టం వచ్చినట్టు తాము ఖర్చు చేస్తారు. స్వేచ్ఛగా, నిబ్బరంగా వుంటారు. తన ఒక్కడిదే సంసారమైనట్టు తనకే సంసారపు జాగ్రత్త అంతా. చిరాకునంతా అణచుకొని చిరునవ్వుతో,

'ఎవరీ మనిషి కొత్తగా వుందే అన్నాడు యధాలాపంగా అడిగినట్టు జాగ్రత్త పడుతూ.

'రత్తాలు తెలీదండీ. మన పెళ్ళి నాటికి మనింటో పని చేస్తుండేది'. రావు వెళ్ళి మళ్ళీ పక్కమీద కూచున్నాడు. దుప్పటినిండా కప్పుకున్నాడు. సిగరెట్ వెలిగించాడు.

రత్తాలు. పచ్చగా, దబ్బపండులాగా, బొంగరంలాగా వుండేది. చీపుర్లు పుచ్చుకుని గదులన్నీ శుభ్రం చేస్తుంటే నక్కి నక్కి వెనకవెనక తిరిగేవాడుతాను. కిటికీలోంచి, అరుగుమీది నించీ వంటింటిగడపమీదనుంచీ పులుకూపులుకూ చూసేవాడు తాను. పాతికేళ్ళ క్రింద. రత్తాలు కళ్ళు తనకళ్ళతో కలిస్తే ఎండకు కగ్గిన పువ్వుల్లా కళ్ళు వాల్చేసుకునేవాడు. 'ఛా నాకు సిగ్గు, ఇప్పుడా' అనేది రత్తాలు. తనకు భయం. అసహ్యం. చీదర. పెళ్లైంది. రత్తాలుకీ తరువాత పెళ్ళయిందట. రత్తాలును ఎప్పుడూ, దగ్గరగా తాకలేదు. చూడలేదు. పాతికేళ్ల నాటిమాట. ఆ రోజులు గుర్తు వచ్చినప్పుడల్లా తనమీదతనకే ఎన్నోసార్లు అసహ్యమయ్యేది. విసుగ్గేసేది. కోపం కలిగేది. కాని తరువాత రోజులుగడిచిపోయినయ్. సంపాదన. పరువు. ప్రతిష్ఠ పిల్లలు. చదువులు. ఉద్యోగాలు. పెళ్ళిళ్ళు —తన చుట్టూ గిరిగీసిన గీతలు.

సుభద్ర వచ్చి చూసింది, ఇదేం విడ్డూరమమ్మా!అన్నటు గా! "ఇవాళ ఇంకోసారి కాఫీ కలపను, త్వరగా తెముల్తారా? తెమలరా". రావుకి విసుగొచ్చింది. సుభద్ర చేతుల నిండా బొగ్గు మసి. ఆర్పేసిన కుంపటిలాగా వుంది. తనకు చలిగావుంది, గుండెల్లో వెచ్చగావుంది. నరాల్లో వింతగా వుంది. రావు లేచాడు. కాఫీతాగాడు.

కచ్చేరి గదిలో కూచున్నాడు.

ఇంకా రత్తాలే కళ్ళముందూ, కాగితాలముందూ, కనపడుతున్నది. పెద్దకూతురినివాళ పెద్ద కుర్రాడు, అత్తారింటి నుంచి తీసుకుని వస్తున్నాడు. సుభద్ర చేసే ఆర్భాటాని కంతా అర్థం అదే.

రేడియోలో తెలుగు వార్తలు వినపడుతున్నాయి. 'వాతావరణం పొడిగా వుండదు. ఆకాశం మేఘావృతంగా వుంటుంది. అడపాదడపా జల్లులు పడవచ్చు.'

సుందరం అప్పుడే స్నానం చేసి వచ్చాడులా వుంది. 'అమ్మ పది రూపాయలిమ్మంటోంది' అంటున్నాడు, ఎదురుగానిల్చుని. రావుకి చాలాకోపం వచ్చింది. తాను లక్షలులక్షలు సంపాదిస్తున్నాడనీ, సంపాదిస్తాడనీ అనుకుంటోంది గాబోలు సుభద్ర.

'ఎందుకట? అన్నాడు విసుగ్గా. 'అరటిపళ్ళూ, తమలపాకులూ, చామంతిపూలూ, అగరొత్తులూ, పసుపూ, కుంకుమా' సుందరం లిస్టు చదివాడు. రావుకి బ్రహ్మాండంగా చిరాకు వేసింది. నిన్న సాయంకాలం సుభద్ర బజారెళ్ళి రెండువందలు ఖర్చు పెట్టింది. నూట ముప్పై రూపాయల చీర కొంది. అమ్మడు నూడిదలకు ఇంకా ఏవేవిటో అర్థంలేని ఖర్చులు. ఉడికి పోతూనే పదిరూపాయలనోటు ఇచ్చి పంపించాడు సుందరానికి.

సుందరం మళ్ళా అమ్మదగ్గరకు వెళ్ళాడు సంప్రతింపులకు. వాడట్లా వీధిలోకి వెళ్ళగానే సుభద్రవచ్చి, 'ఈ పూట వంట మనిషికి కబురెడదాము. లడ్డూలు కట్టించాలి' అంది. రావుకి చాలా కోపంవచ్చి కుర్చీలో కుతకుతలాడాడు. ఆ కోపంలో చేతిలో వున్న లాజార్నల్ వాల్యూము, అట్టలూడి చేతిలోకొచ్చి, పుస్తకం క్రింద పడిపోయింది. అట్ట మీద సంవత్సరం చూశాడు. పాతికేళ్ళ క్రిందటిది. సుభద్ర వయసు—అప్పుడే వచ్చిం దీవాల్యూమ్ కు.

'సరే పిలిపించు'.

క్రిందికి వంగి పుస్తకం తీశాడు. ముసలివాసన వస్తోంది పుస్తకం. సుభద్ర లోపలకు వెళ్ళిపోయింది.

తనకు భయం. ఏమాటా తాను కాదనలేడు. అందరూ తన మీద అధికారం చెలాయించే వాళ్ళే. తను భీరువు. అసమర్థుడు. చేతకానివాడు. పరువుప్రతిష్ఠలు, గౌరవమర్యాదలు, తనకు సంకెళ్ళు. ఉరులు.

అమ్మడు, రాజా, సుందరం, పద్మ, బాబ్జీ అందరూ తనపైన అధికారం చెలాయిస్తారు. తాను ధైర్యంగా, ఉద్రేకంగా, అతిశయంగా, దర్పంగా, తృప్తిగా, చేసిన ఒక్కటంటే ఒక్కపని ఏమిటి? ఎప్పుడైనా చేశాడా? అవాళ ఒకరోజు రత్తాలు, వాన్నగారాఫీసుకువెళ్ళి, అమ్మ పురాణానికి వెళ్ళి, మధ్యాహ్నం తన గదివూడ్చేప్పుడు, తలుపు దగ్గరగావేసి తనవేపు చూసి ఆదోలానవ్వితే, తనకు చెమటలు పట్టి, ఒణికిపోతే, తలుపు తీసి నవ్వుతూ వెళ్ళిపోలేదు.

రావు మనసంతా ఇవాళ అదోలావుంది. చిదరగా, చికాకుగా, అసంతృప్తిగా.

రోజులానే పదింటికి కోర్టుకెళ్ళిపోయినాడు. పిండి వంటా, అదీ సాయంత్రానికిగానికాదు, అన్నది సుభద్ర. 'నామొహాన పోనీ పచ్చడి మెతుకులే కొట్టు' అనుకున్నాడు మనసులో రావు. మూడింటికి సుందరం కోర్టుకి కాఫీ పట్టుకొచ్చాడు. వాడి మొహం సినిమా కెళ్ళేముందులా కళకళలాడిపోతున్నది. 'అక్కయ్యొచ్చింది నాన్నా, రైలు గంటలేటు. సాయంత్రం మనింటో పేరంటం. అక్కయ్యతో అత్తగారు కూడా వచ్చారు. అన్నయ్య బజారుకెళ్ళి, చీరా, రవికా తెచ్చాడు. అక్కఅత్తగారికి పెట్టాలట. మీరుక్లబ్బుకెళ్ళి ఏడుకో, ఎనిమిదికో రాండి'అని సుందరం పరిగెత్తుకుని వెళ్ళాడు. రావు ఉస్సురని నిట్టూర్చాడు. అవాళ నిజానికి కోర్టులో పనికూడా లేదు. ఎక్కడికీ పోవాలనిపించలేదు. మధ్యాహ్నం లడ్డు కట్టివుంటారు. జిలేబీ చుట్టివుంటారు. చూశావా, సుభద్ర తనను గుర్తించుకొని పంపనైనాలేదు— ఆడది, అతిశయానికి ముందో వెనకోపుట్టి వుంటుంది. మగవాడ దానిబానిస. వాడిశక్తినంతా హరించివేసి వాణ్ణి ఆడిస్తుంది. పెళ్ళితో మగవాడినోటికళ్ళెం ఆడదాని చేతి కొస్తుంది. అటు తరువాత యావజ్జీవమూ గుర్రం మగవాడూ, సంసారం మోతబరువూనూ—

ఐదు గంటలైంతరువాత ఎటు పోవాల్సిందీ తోచలేదు రావుకు. కోర్టు ఆవరణ దాటి బయటకు వచ్చిన తర్వాత ఒకరిద్దరు మిత్రులు పలకరించారు, క్లబ్బుకు ఆహ్వానిస్తూ. రావు హోటల్ కెళ్ళి స్వీట్ తిని కాఫీ త్రాగాడు. తన హక్కులేవో తాను గుర్తిస్తూ ఇప్పుడిప్పుడే నిలుపుకొంటున్నట్లు అనిపించింది. క్లబ్బవేపు వెళ్ళాడు. పేకాటంటే మోజులేదు, అంటాడు ఇతరులతో. తనకు తెలుసు. తను పిరికి. తనకు భయం. తను పెద్ద సంపాదన పరుడుకాదు. గొప్పగా అనుభవించే సాహసం లేదు జీవితాన్ని. రెండుమూడు న్యూస్ పేపర్లు చూశాడు. న్యూస్అంతా ఒక్కటే కాబట్టి, ప్రత్యేకంగా వ్యాపార ప్రకటనలు చూశాడు. ఒక బొమ్మ బాగా ఆకర్షించిందతణ్ణి. నడుము సన్నం దగ్గరకాకుండా, ఇంకా బాగా కిందికి చీరకట్టి, వీపు కనపడేలా వెనుతిరిగి విలాసంగా నిలుచుని యీ చీరకటితే అందం, ఆనందం, స్వర్గం, సంతోషం, అంటోందో యువతి. పెద్దకొప్పు. రత్తాలు జ్ఞాపకం వచ్చింది చటుక్కున రావుకు. మనస్సంతా ఉసూరు మనిపించింది. ఎవరో పలకరించారు 'దూరంనుండి, లోకాభిరామాయణంలో కలవమని. రావు మనసుకి వాళ్ళతో చేరాలనిపించలేదు. ఇంటికి వెళ్ళేందుకూ లేదు. ఆ పకపకలూ, హాస్యాలూ, ముసలి ముత్తైదులూ, పసిపిల్లల కేకలూ, చిరుళ్ళూ, తాను భరించలేడు. ఆ చీరలు ఖరీదైనవేకాని, ఎందుకో తనకు నచ్చవు. అరచేతి మందం వెడల్పు జరీలూ, బోసిదవడలూ, పెద్దపెద్ద బొట్లూ. వెక్కిళ్ళ గూర్చి, పెళ్ళిళ్ళను గూర్చి, కడుపులను గూర్చి, కాన్పులను గూర్చి కోలాహలంగా మాట్లాడుకుంటారు. అవే మర్యాదలు, అవే మన్ననలు. విసుగులేదు. వేసటలేదు వాళ్ళకు.

రావు చల్లగాలికి వూరి బయట దాకా నడచివద్దామని బయలుదేరాడు. ఆకాశం మేఘావృతంగా వుంది. వాతావరణం మనోజ్ఞంగా వుంది.

వూరి కోలాహలాన్ని తప్పుకుంటూ, నెమ్మదిగా వూరి బయటకు వచ్చేశాడు.

తన చిన్నతనంలో అక్కడ ఏడాదికి ఆరునెలలు టూరింగ్ టాకీస్ వుండేది. ఇంటర్ పాసై, బి.ఏ.లో చేరి వక సంవత్సరం గడిచిందాకా, రహస్యంగా భయంభయంగా నేల టిక్కెట్టు

తీసుకుని తాను సినిమాలు చూసే వాడక్కడ. ఇప్పుడక్కడ పర్మనెంట్ హాలు కట్టేశారు. చుట్టూకిళ్ళీబడ్డీలూ, న్యూస్ పేపర్‌స్టాల్సూ, పకోడీలూ, ముంతకిందపప్పూ, నూనె మిఠాయిలూ అమ్మే చిన్నచిన్నదుకాణాలూ, చాలాసందడిగా వుంది ఆ ప్రదేశమంతా. ఇరుకువాడలూ మురికి గోడలూ, పిరికినీడలూ వెకిలి జాడలూ, ఇప్పుడక్కడ. ఇంకాముందుకు నడిచాడు రావు. మదనమోహన్ స్కీన్‌లో నుండి 'బృందావన మందిరిదీ' అని కీచు గొంతుతో పాత రికార్డు గోల పెడుతున్నది. జనం పల్చగానే వున్నారు, సినిమాహాలుముందు. చిన్న తనాన, ముంత కిందపప్పు మెరపకాయబజ్జీలూ, అటూఇటూ చూసి, కొనేసి తినేసేవాడు. ఇప్పుడు నోరూవాయీ కళ్ళూకాళ్ళూ అన్నీకట్టేసు కోవాలి. అన్యాయం. ఈ మెరపకాయ బజ్జీలమ్మే వ్యక్తి పాతి కేళ్ళుగా అమ్ముతున్నాడు. ఇతని తండ్రి అమ్మేప్పుడు పక్కన వుండి పొట్లాలుకట్టి ఇస్తుండేవాడు. ఇప్పుడు తాను యజమాని అయినాడు. రావుకి మిరపకాయ బజ్జీలు తినాలనివుంది. కాని అశక్తతతో ముందుకి వెళ్ళాడు. తన జరీకండువా, పైన తలపాగా వెక్కిరించాయి. బాగా ముందుకి నడిచి పొలాలమధ్య రోడ్డు పైకివచ్చేశాడు. అప్రయత్నంగా వెనుదిరిగి చూశాడు. సినిమాహాలుపైనలైటు ఉజ్జ్వలంగా కానవస్తున్నది. నమో వెంకటేశా, నమో శ్రీనివాసా అని అరిగిఅరిగి అరుస్తోంది లౌడ్‌స్పీకర్. అనుకోకుండా ఆకాశంకేసి చూశాడు. చల్లనిగాలి, వర్షపువాసనను మోసుకొచ్చి, శరీరాన్ని తాకింది. వానవచ్చే లాగుంది. తానేదోధ్యాసలో ఇంతదూరం వచ్చాడు. వేగంగా వెనుదిరిగి నడవటం సాగించాడు రావు. సినిమా హాలునుండికాక ప్రక్కగా ఊళ్ళోకి దగ్గర దోవుంది. ఊళ్ళోకి వస్తే రిక్షా అయినా దొరుకుతుంది. వడివడిగా నడుస్తున్నాడు రావు. ఊళ్ళోకివచ్చి తానుప్రవేశించిన సందుగొందులను తలచుకు సిగ్గుపడ్డాడు రావు. ఇంతలో చిరుజల్లు అతణ్ణి పరామర్శించింది. నిముషంలోనే వాన ఇంకా కొంచెం పెద్దదైంది. కళ్ళముందు రిక్షాకూడా కనరాలేదు.

చాలా ఇరకాటమైన పరిస్థితి. తాను చిన్నపిల్లాడిలా పరిగెత్తలేడు. తప్పలేదు. పక్కనేవున్న అరుగుల ఇల్లు చూరు కింద ఓరగా నిలుచున్నాడు రావు. అటూ ఇటూ చూస్తున్నాడు రిక్షా కోసం. ఆ వీధిలో ఎవ్వరూ నడవడం లేదు. ఎదురుగా చిన్న పెంకుటింటి వీధితలుపులు తెరుచుకున్నాయి. 'బాబుగారూ రాండి. ఒక్క నిముషం కూచునిపోదురు' అని ఓర కళ్ళతో, ఒంటివిరుపుతో, గౌరవమో, అభిమానమో, రత్తాలు పిలుస్తున్నది. రావుకి కాళ్ళలోనూ, గుండెల్లోనూ దడ ప్రవేశించింది. రత్తాలు తన కళ్ళలో ఆంక్ష పెట్టిందో, కాంక్ష పెట్టిందో, రావులో తిరుగుబాటు ధోరణి, ఉద్రేకమూ, ధీమా కలిగాయి. అటూఇటూ చూశాడు. తన నక్కడ ఎవ్వరూ గుర్తు పట్టేవాళ్ళు లేరు.

చప్పున ఎదురునడచి రత్తాలువాళ్ళింట్లోకి వెళ్ళాడు. తాను పిరికివాణ్ణి కానని జీవితంలో ఒక్కసారైనా నిరూపించు కోవాలి. రత్తాలు పాతకుర్చీ చూపించింది. రావు కూర్చున్నాడు. కొంచెం దూరంలో నేలమీద చతికిలబడి కూర్చున్నది రత్తాలు. రావుకి ఏం మాట్లాడాలో, రత్తాలుకు ఏం మాట్లాడించాలో, అర్థంకావటంలేదు. ఊరినిండా దీపాలు వెలిగాయి. గొంగడి పురుగు సీతాకోకచిలకైనట్లుగా సంజకాస్తా చీకటైపోయింది. రత్తాలు కొప్పునిండా చామంతిపూలు పెట్టుకుంది. అప్పుడే సాయంత్రం భోజనం అయిందేమో తాంబూలం కూడా వేసింది. ఆ గదిలో చౌకరకం సెంటువాసన కూడా వస్తున్నది. రావు శరీరానికి ఉక్కగావుంది. చెమటపడుతున్నది. గాలి ఆడుతున్నట్లులేదు. తనకు రత్తాలుపైన కోర్కె వున్నట్లు సంజ్ఞలు ఎట్లా చెయ్యాలి? ఒకవేళ రత్తాలు ఇష్టపడితే, తాను సంకోచం విడిచిపెట్టవచ్చునా? ఈ ఒక్కసారి తాను ఏదో భ్రాంతి తీర్చుకుంటే తన పరువుమర్యాదలకు భంగమా? భ్రాంతి ఏం. సుఖమంటే రత్తాలుతోనే నిజమైన సుఖముంటుంది. పొద్దున్న నిద్రలేవగానే సుభద్ర రూపం గుర్తుకొచ్చింది రావుకు.

రత్తాలు అదోలా చూసింది రావును. రత్తాలుతో ఏమనాలో తోచటంలేదు రావుకు. ఒకవేళ తాను లేచిపోయి రత్తాల్ని చేయిపట్టుకుంటే, తననిగూర్చి ఏమనుకుంటుందో రత్తాలు. లోపల ఈసడించుకుంటుందా? లోకువ కడుతుందా? అయ్యగారూ, ఇదేంటి అంటుందా.

రావుకు ముచ్చెమటలు పోస్తున్నాయి. చెవికిందద దోమ ఏదో పరామర్శించి సంగీతం పాడుతూ వెళ్ళింది. వీధి వాకిటి మురికికాలువ వాసనకూడా పలకరించి పోయింది. రత్తాలు పైట జారినా మళ్ళీ తీసుకోలేదు.

బాత్‌రూంలో, రంగనాథం, గ్రంథసాంగుడేనోయ్, ఏమో ఏమో ననుకున్నాం, అని తోటి లాయర్లు చెవులు కొరుక్కుంటున్నట్లూ, మర్రోజు పొద్దున్నే రత్తాలు కూరల తట్టతో వచ్చి, తననిచూసీ, సుభద్రను చూసీ—ఓసి నీ ధీమా నాకు తెలీదా అని భావగర్భితంగా నవ్వినట్లూ. రావు వణికి పోయినాడు.

'ఈ ఊరెప్పుడొచ్చావు?' అన్నాడు పొడిగా, నిస్సారంగా. తాను నిజంగా పెద్దమనిషను సుమా అని హెచ్చరిస్తూన్నట్లు. ఇంకా లోపల భయం పీకుతున్నది. మొగుడూ మొద్దులూ ఏమైనట్లు. లేక ఎవరైనా తలుపుతోసుకుని వస్తే. తాను వెనక వచ్చాడు. తలుపు తానైతే వేసిరాలేదు.

'నెలరోజులైంది' అన్నది రత్తాలు. పొడిగానే.

'నీ మొగుడేం చేస్తాడు?'

రత్తాలు నిర్లక్ష్యంగా నవ్వింది. 'ఓయ్! నాపెళ్ళిసంగతి మీకు గుర్తుందే. ఆడు లారీ డ్రైవరు. తాగితాగి యాక్సిడెంటై చచ్చాడు. ఈడ యీరసామని గుర్రబ్బండాడుండేవాడు. ఆణ్ణి సాయంచేసుకున్నాను కొన్నాళ్ళు. ఆడితో ఆ

ఊోరు, ఆఊరూ తిరిగాను. ఆడెవత్తినో మరిగి, ఒకటి రెండు సార్లు చేయిచేసుకొన్నాడు. 'ఓరి ఎదవనాయాలా, నీవేఏటి నాకుదిక్కు' అని ఒగ్గే శానాళ్ళు. ఏమైనా పుట్టిపెరిగినూరు, మమకారంపోక, యీడికే జేరా. మా అమ్మకాలంజేసెగా. ఈ ఇల్లు ఐదు రూపాయలద్దె. కూరలమ్మితే నా బతుకు గడవదా అని యీ యాపారం మొదలు చేశాను. ఇదీ కుదరకపోతే మానేత్తా. నాకేం పరునా ప్రతిష్టె, పిల్లాపాపా?! మొగుడామొద్దులా. పిగ్గాశరమూ, నేనడవిలో చెట్టును. ఎండా, గాలీ, వానా, వాగూ, పంటిదాన్ని.

రావు అడిగాడు. 'వాన తగ్గిందా?'

ఓరగా చూసింది రత్తాలు. 'బిరాన ఇంటికెళ్ళాలా?'

రత్తాలు నవ్వింది. 'సిన్నప్పటి బయంపోలేదు'.

రావుకు తల కొట్టేసినట్లనిపించింది. తన బ్రతుకు, పార్కులో పదిరోజులకోసారి మాలి కత్తిరించివేసే కాగితప్పూల చెట్టు లాటిది. తనఇష్టం వచ్చినట్లు తాను గాలీ, ఎండా, వేడీ, వెల్తురూ, చూసేందుకులేదు. ఏపనీ చేసేందుకు లేదు. పరువుప్రతిష్ఠలు, మానమర్యాదలూ, కృత్రిమమైన సాంఘిక నియమాలు, సాంప్రదాయాలు. తనకు ఏ భావం అన్నా నిండక ముందే ముసలితనం వచ్చేసింది. సుభద్రకు నలభైదాటి మూడు నాలుగేళ్ళన్నా గడవకముందే, చప్పి దవుడలూ, ముసలి పళ్ళూ, ముడతల ఒళ్ళు. లోతైన కళ్ళు. రత్తాలు చూడు. గిబ్బరోశ్శేలా వున్నది. ప్రకృతి సిద్ధంగా ఏ నియమాలకు, ఏ కృత్రిమమర్యాదలకూ తలఒగ్గకుండా ఏటఒడ్డున చెట్టులా, అడవిలో పారే ఏరులా, అందమైన కొండలా స్వేచ్ఛగా, తృప్తిగా బ్రతుకుతోంది రత్తాలు. ఆకాశంలా, భూమిలా, రత్తాలు వయసొచ్చినా, బిగువుగా, బింకంగా బిర్రుగా వుంది. ఛీ, తానూ మనిషేనా. బ్రతుకంతా భయమే. అడుగడుగునా ఆత్మవంచనే. ఒక్కసారి సుఖంకోసం కాకపోయినా, తన పిరికితనాన్ని తోసి పారేసేందుకైనా రత్తాలును తాకాలి. అని ఒక అల.

రావుకి కళ్ళముందు అనేక దృశ్యాలు. పురిటిగదిలో సుభద్ర. పెద్దకొడుకు టైఫాయిడ్. కూతురుకు చిన్నపిల్లవేష . మళ్ళీ నీతి. సంఘం. పెద్దమనిషి. పిల్లలతండ్రి.

రత్తాలు అపహాస్యంగా నవ్వుతున్నది. బయటవాన నిలిచింది. తాను ఇప్పటివరకూ తన ప్రజ్ఞ కాకపోయినా, సమయం, సందర్భం కూడకనో, ఏమో, ఇంకోస్త్రీని ముట్టలేదు. ఇప్పుడు ఏ భావంలో పడుతూ ఛీ, నీ జన్మఎప్పుడూ ఇంతే. నీపిరికితనం ఇంతాఅంతాకాదు. అని మనస్సు ఎత్తి పొడుస్తున్నది. ఒక్కసారి ఇప్పుడు, ఏం ఏమైతే—అని ఇంకో అల.

రావు లేచాడు.

రత్తాలు లేచింది. రావు చూశాడు. ఒణుకుతూ బిడియపడుతూ 'తలుపు' అని నీళ్ళు నమిలాడు.

రత్తాలుకు జాలైంది.

'అయ్యగారూ!' అన్నది సానుభూతి ధ్వనించేట్టు. రావుకి తల తిరిగిపోయింది.

'ఇవాళ పెద్దమ్మగారికి పసుపు కుంకుమ చేత్తుండారట. ఆ యమ్మను నేను ఎత్తుకొన్నాను. అదుట్టం. అయ్యా, పున్నెం జేత్తే బతుకు పండుతుంది.'

రావు రత్తాలువేపు నడవలేకపోయినాడు.

రత్తాలు తలుపు దగ్గరకు నడిచింది. అయితే రావు తల వంచుకుని తలుపుదాటిన తరువాత తలుపులు మూసింది.

ఆ వీధిన ఎవరైనా తనకు ఎదురైతే. అని తల వంగిపోతున్నది రావుకు.

శరీరమంతా అలసిపోయింది. సోలిపోతోంది. అసహ్యం, ఏవగింపూ. తనమీదే తనకు, ఎందుకో. తనపిరికితనాన్ని తలచుకొనీ. తన భయాన్ని తలచుకొని.

తన సంసారమంటే ఏవగింపు కలుగుతున్నది.

అందరికీతాను, సంతోషం, సౌఖ్యం, ఆలనా, పాలనా, రక్షణా కల్పించేవాడు. తాను వాళ్ళకు గాఢంగా కావలెనా! వద్దా.

ఇంట్లోకివెళ్ళి తనగదిలో కూచున్నాడు.

ఎవరితో మాట్లాడాలనిపించలేదు. పేరంటాళ్ళందరూ వెళ్ళినట్లున్నారు.

సుభద్ర వచ్చింది. చేతిలో చిన్నపళ్ళెంలో ఏదో టిఫిన్ తీసుకుని. సుభద్రవేపు విచిత్రంగా చూశాడు రావు.

'మీరు మధ్యాహ్నం కూడా సరిగా భోజనం చేయలేదు'.

పెద్దబాబు, గదిలోకి పరిగెత్తినట్లుగా 'నాకు ఫస్ట్‌క్లాస్ వచ్చింది నాన్నారూ' అన్నాడు. 'ఇందాక మారామంటకు వాళ్ళన్నయ్య టెలిగ్రాం ఇచ్చాడు. యూనివర్శిటీనుండి'. పెద్దబాబు ఇక అక్కడ క్షణంవుండలేదు.

సుభద్ర దగ్గరగావచ్చి 'స్నానం చేయండి. బాగా అలసిపోయినట్లున్నారు. అమ్మడు మీగూర్చి వందసార్లడిగింది.

రావు మనస్సు ఎందుకో ఆర్ద్రమైపోయింది.

రత్తాలు ప్రకృతిలా యథేచ్ఛగా ఏ నియమాలకు, నిబంధనలకూ తననుతాను బంధించుకోక, స్వేచ్ఛగా బ్రతుకుతున్నది అదృష్టవంతురాలనీ, ఇవాళ ఇంతకుముందు తాననుకున్నాడా?

లేదా! రత్నాలు బ్రతుకులో పెద్దబాబు సంతోషం, అమ్మడి అభిమానం, అనుభవానికి వచ్చేనా—

అయ్యో, ఇవాళ ప్రొద్దుటునుంచీ తానెంత దిగజారి పోయినాడు, తన మనస్సూ శరీరమూ అలసిపోయినాయి. ఇరుకై పోయినాయి. మురికైపోయినాయి.

స్నానం చేసి, సిగరెట్ కాల్చుకుంటూ, కాసేపు సేదదీర్చుకుంటేకాని మళ్ళీతాను, తానుకాలేడు.

రావు లేచి హాల్లోకి వెళదామని కదిలాడు, పరధ్యానంగా·


తనకళ్ళు వాస్తవమైన విషయాన్నే చూస్తున్నాయా?

తన కన్నతల్లి, తననెత్తురు, తన అమ్మడు బరువుగా, భారంగా, పెద్దపూలజడతో, అలుపుతోకూడినసవ్వుగలత్తృప్తితో తనకాళ్ళదగ్గరవంగి నమస్కారంగా తాకుతున్నది తనపాదాలను.

సిగ్గుగా, బరువుగా, లోపలకు వెళ్ళిపోయింది.

రావు క్షణంసేపు కాలుకదల్చలేక, తరువాత చెమ్మగిలిన కళ్ళను చేతులతో తుడుచుకున్నాడు.

తాను పిరికివాడైతే ఫరవాలేదు. అల్పుడుకాకుండా ఉంటే అదే చాలును. జీవితంలో ప్రతివిషయాన్నీ ఆవైపూ, ఇటు వైపూకూడా చూడాలి. ప్రతివస్తువుకూ, అటువైపూ, ఇటు వైపూవుండితీరుతాయి. అవతలివైపుకూడా చూసినవాడే అస్సలైన నిజాన్ని తెలుసుకోగలుగుతాడు.



డామ్ మొరేస్

శ్రీ ఎస్. వెంకట్ నారాయణ్

డామ్ మొరేస్ 'గోధుమవర్ణపు ఆంగ్లేయుడు.' ఆయన్ను అంతా ఇండో-ఆంగ్లియన్ కవి అంటారు. అట్లా అనిపించుకోవడం ఆయనకు ఇష్టంలేదు; కాదు. భారతదేశంవారు ఆయన్ను భారతీయుడని అంటారు. అది ఆయనకు అదోరకంగా వుంటుంది; కోపాన్ని తెస్తుంది. ఆయన ఈ దేశాన్ని వదిలి పెట్టేశాడు; తల్లిని వదిలిపెట్టినట్లు; ఇది జరిగి చాలా ఏళ్ళయింది మరి.

ఆయనకు పట్టరానికోపం — ఎక్కడఅంటే, ఎందుకుఅంటే—'ఈ భారతదేశం నాకు ఏమిచేసింది? ఏమి ఒరిగించింది? నాకు అడ్డంరావడం తప్ప?' ఇది ఆయన ప్రశ్న. చాలా ఇదైపోయి ఆయన ఈ ప్రశ్న వేస్తాడు.

'ఇండో-ఆంగ్లియన్ కవివి నువ్వు అని ఎవరైనా అంటే, నాకు మహాచెడ్డకోపం వస్తుంది' అంటారు ఆయన.

ఐరోపాలో, అమెరికాలో ఆయన్ను అంతా ఇంగ్లీషుకవి అనే అంటారు. ఆయన భారతదేశంలో జన్మించినమాట నిజమే 'అయినా వారూ మీరూ నన్ను - ఇంగ్లండులోని, అమెరికాలోని- నా సహపాటి వారికన్న భిన్నంగా భావించవలసిన, అనుకోవలసిన అవసరం ఏమి వచ్చిపడింది? ఈ దేశంలో నా కవిత్వాన్ని గురించి తీర్పు చెప్పడానికి వేరురకం మానదండాన్ని మీరంతా ఎందుకు ఉపయోగించాలి? అని గూడా డామ్ మొరేస్ ప్రశ్నిస్తాడు

ఇప్పుడు ఆయనకు ముప్ఫై వసంతాలు నిండాయి. ఇటీవలనే ఆ ముప్ఫయ్యో పుట్టిన రోజు పండుగ చేసుకున్నాడు. తన ఆత్మకథను ప్రకటించాడు ఇప్పుడు భారతదేశంలో వున్నాడు. ఇంకో పుస్తకంకోసం సమాచారాన్ని సమకూరుస్తున్నాడు. ఆయన భారతదేశానికివచ్చి పూర్వం ఒక పది సంవత్సరాలు దాటిపోయింది. ఆ కిందటిసారి ఇక్కడకు వచ్చినప్పుడు 'గాన్ ఎవే' అన్న పుస్తకాన్ని వ్రాశాడు. అదో తగాదా గ్రంథం అయిపోయింది. తాను కలుసుకున్న మనుష్యులను గురించి చూచిన స్థలాలనుగురించి ఆయన వ్రాసినవ్రాతలు అట్లా వున్నాయి. మరి ఆ పుస్తకం అట్లా ప్రసిద్ధి కెక్కింది

ఇప్పుడు ఆయన నేపాలును సిక్కింను చూచుకొని భూటాన్‌ను దర్శించి భార్యతో బిడ్డతో భారతదేశం తిరిగివచ్చాడు పాకిస్తాన్ ప్రభుత్వం గూడా ఆయన్ను రమ్మంది. ఓ పుస్తకం వ్రాయమన్నది. అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్‌తో ఆయన గోష్ఠికి ఏర్పాట్లు గూడా జరిగాయి మరి అక్కడ పరిస్థితులు కొంచెం చల్లబడటంకోసం డామ్ మొరేస్ నిరీక్షిస్తున్నారు.

డామ్ మొరేస్ నిరాడంబరమైన పద్ధతులుగల మనిషి. హెచ్చులులేవు. మెత్తనివాడు కొంచెం బిడియపడుతూ వుంటాడు శిరోజాలు దీర్ఘంగా పెంచి పెట్టుకున్నాడు (తన ఆత్మకథలో ఈ విషయం వ్రాసుకున్నాడు: లండన్‌లో, పారిస్‌లో మొదట్లో హోమోసెక్సుయల్‌లు నన్ను వేటాడారు: అని)

డామ్ మొరేస్ మాట్లాడితే గంభీరంగా వుంటుంది కాని బిగ్గరగా మాట్లాడడు నెమ్మదిగా మాట్లాడుతాడు: వింటుంటే మాటలు ఊదుతున్నాడా, రహస్యాలు చెబుతున్నాడా అన్నట్లు వుంటుంది. ఉగ్రభావం ఎక్కడా కన్పించదు. నిస్సిం ఎజికిల్ ఎంతటి మెత్తనిమనిషో డామ్ గూడా అంతే డామ్ మాట్లాడ్డం వింటూవుంటే, ఈమనిషి కవిత్వం ఏమివ్రాస్తాడు; లోకాన్ని గగ్గోలు కొట్టించే వ్రాతలు ఏమివ్రాస్తాడు! అని అనిపిస్తుంది.

నేను ఇటీవల డామ్‌ను ఢిల్లీలో కలుసుకున్నాను. ఇద్దరం మాట్లాడుకున్నాం — పొగ త్రాగుతూ; ఆసవం సేవిస్తూ. అదో మూడుగంటల ముచ్చట.

డామ్ కవి. అందులో సందేహం ఏమీలేదు. ఎప్పుడూ కవిత్వం ఒక్కటే వ్రాయాలని అతను అనుకుంటాడు. 'మరి కవిత్వం ఒక్కటే వ్రాస్తే గడుస్తుందా. గడవదు' ఇంగ్లండులోగూడా అంతే. అందుచేత డామ్ మొరేస్ వచనం గూడా వ్రాస్తాడు. బి.బి.సి. కి స్క్రిప్టులు వ్రాసి ఇస్తాడు. ఆ గద్య వ్రాతకు రోజుకు ఐదారుగంటలు వినియోగం చేస్తాడు. ఆత్మకథ వ్రాసుకోడానికి డామ్‌కు ఆరు నెలలు పట్టింది. ప్రకటన ఆలస్యం అయింది. 'లాయరు భయపడ్డాడు. పరువునష్టం దావాలు, అనీ పడతాయని అన్నాడు' అన్నాడు.

లండన్‌లో అతనికో ఇల్లువుంది. సంవత్సరానికి ఎనభై వేలరూపాయలదాకా ఆర్జన వుంది. నేను ఆయన్ను కలుసుకొన్న రోజున ఒకవ్యాసం పూర్తి చేశాడు. న్యూయార్కు టైమ్సుకు. డెయిలీ టెలిగ్రాఫ్‌కు గూడా వ్యాసాలు వ్రాస్తున్నాడు. వ్యాసానికి 200 పౌనులు — అంటే 4000 రూపాయలు — ఇస్తారు.

భారతదేశంలో పుట్టి అక్కడ ఇంగ్లండులో వుంటున్నవారిలో డామ్‌కు ఆట్టేమంది స్నేహితుళ్లేరు — వి. ఎస్. నైపాల్, వేద్ మెహతాలు వినా. అక్కడ ఆయనకు ఎదురయ్యేవాళ్లు కవులో, రచయితలో, జర్నలిస్టులో — అంతే. 'మరి అటువంటి వాళ్లు అక్కడ ఆట్టేమందిలేరు' అంటాడు డామ్.

'ఈ పదిసంవత్సరాల్లో దేశం ఎంతో అభివృద్ధి చెందిందయ్యా!' అన్నాడు డామ్. గ్రామాలు మహాపచ్చగావున్నాయి. ట్రాన్సిస్టర్లుగూడా వినిపిస్తున్నాయి — అన్నాడు.

ఇంగ్లీషులో రచనలుచేసే భారతీయులువున్నారు; వారినిగురించి డామ్ ఏమి అనుకుంటున్నాడు?

'చెప్పమంటావా! నేను ఏమీ అనుకోను అసలు ఆలోచించను. (బడిపిల్లవాడిలాగా నవ్వుతాడు డామ్ అల్లరిగా).

వీరి పుస్తకాలు లండన్‌లోగూడా దొరుకుతాయి. దొరికినవన్నీ డామ్ చదువుతాడు. మరి వారిలో ఎంతమంది లెక్కకు వస్తున్నారు! కొద్దిమంది. భారతదేశంలో చెప్పుకోదగినంత బాగా వ్రాసేవాళ్లు ఆట్టేమంది లేరులే - అన్నాడు.

— ఆర్. కే. నారాయణన్ ఇప్పుడిప్పుడు చేస్తున్న రచన వట్టిచప్పగావుంటున్నది.

— కుశ్వంత్ (అవును, అవును సింగ్) బాగా వ్రాస్తున్నాడు.

— నీరద్ సి. చౌధురి — ఆ మనిషి అంటే నాకు గిట్టదు. రచనమాత్రం బాగుంటుంది.

— రాజారావ్! ఇప్పుడు అతను ఎక్కడ వుంటున్నాడు. అతను వ్రాసిన 'సర్పెంట్ అండ్ ది రోప్' చదివాను. చూడు, మంచిగూఢవేదాంతివి, గొప్పవ్రాయసగాడివి కావడం యుగపత్తుగా జరిగే పనికాదు. ఇది నా అభిప్రాయం.

ఇవి డామ్ అభిప్రాయాలు.

కవులలో పదార్థేతరసిద్ధాంతులు వున్నారు. డామ్‌కు వారంటే ఇష్టం. జాన్ డోన్, జార్జి హెర్బర్ట్ — డామ్‌కు ఇష్టమైన కవులు.

రొమాంటిక్స్‌లు, డామ్‌కు నచ్చరు. ఒక్క బైరన్ తప్ప.

'షెల్లీ అంటే నాకు అసహ్యం.'

'కీట్స్ — ఆయన ఉత్తరాలు బాగుంటాయి'

'మరికొంతకాలం — ఒక 45 ఏళ్లు వచ్చేదాకా బతికివుంటే, కీట్స్ ఏమి వ్రాసేవాడో! అట్లా ఆలోచిస్తేనే అందంగా వుంటుంది.'

ముందురోజుల్లో డామ్ కవిత్వం చదివే పని పెట్టుకున్నాడు తర్వాత అది విసుగైపోయింది 'మనిషి పెరుగుతూవున్నకొద్దీ అహంకారం తగ్గిపోతుంది. నువ్వేమంటావోగాని' అన్నాడు.

డామ్‌మొరేస్ శ్రీమతి గాంధీని కలుసుకున్నాడు 'ఆమె విచిత్రమైన వ్యక్తి. కాని ఆమె తండ్రితో గోష్ఠికన్నా, యీమెతో గోష్ఠి తేలిక.'

డామ్ మొరేస్ దలైలామాను కలుసుకున్నాడు 'టిబెటన్ కవిత్వాన్ని ఇంగ్లీషులోనికి మార్చమని ఆయన నన్ను కోరారు.'

ఎప్పుడైనా డాన్ ఎల్. ఎస్. డి అవలంబనం చేశాడా? ఆ, ఒక్కసారి. అదో ప్రయోగపరీక్ష. 'నాకేమీ కాలేదు'

అమెరికా డాన్‌కు నచ్చలేదు. భార్యతో, కుమారునితో నిరుడు ఆదేశం వెళ్ళివచ్చాడు. ఏనాక్ పవెల్ ఎమిగ్రెంట్లను గెంటివేసేయగలిగిననాడు, తాను వుండటం అమెరికాలోనేనని డాన్ ఇటీవల ఒక టెలివిజన్ గోష్ఠిలో ఖుష్వంత్‌సింగ్‌కు చెప్పాడు.

అయితే పవెల్‌కు అంతవిజయం లభిస్తుందని ఆతను అనుకోడంలేదు.

'అయినా నాకు అమెరికాలో చాలామంది స్నేహితులు వున్నారు.'

లండన్‌లో జీవితం వుంది. ఢిల్లీలో జీవితం వుంది. లేదా ఏమిటి? ఎట్లా అనిపిస్తుంది? రచయిత అయినవాడికి 'లండన్ ఓ పెద్దసరస్సు; అందులో రచయిత ఒక పెద్దచేప. ఢిల్లీలో అంటారా, అక్కడ జీవితం రచయితకు చిన్నసరస్సులో పెద్దచేప పద్ధతిగా వుంటుంది.

సోహోకు డాన్ ఇంకా వెడుతూనే వున్నాడా! లేదు ఆక్స్‌ఫర్డ్ రోజుల్లో అయితే ఎక్కువగా వెళ్ళేవాడు ఇప్పుడు అట్టే వెళ్ళడంలేదు అడపా దడపా పోతూవుంటాడు ఇప్పుడు డాన్ గొప్పవాడు. ప్రసిద్ధుడు. మరి ఇప్పుడు గౌరవప్రదం అని పేరు తెచ్చుకున్నపట్టుకు వెడుతూవుండాలి. ఆమాటచెప్పి డాన్ ఒకనవ్వు నవ్వాడు. ఆడపిల్ల నవ్వినట్లు.

జూడిత్ కల్పించుకున్నది. ఇప్పుడు డాన్ కొంచెం బుద్ధిమంతుడైనాడు లెండి అన్నది.

జూడిత్ డాన్‌భార్య అందమైన స్త్రీ: నీలపు కళ్ళు:

ఆమె ఆమాట అనగా మేమూ నవ్వేశాము. నేనూ, జూడిత్.

డాన్‌గూడా మాతో కలిసి నవ్వేశాడు. ఉవహాయిడైన చిన్నపిల్లవాడిలాగ.



పానుగంటివారి 'రాధాకృష్ణ'

శ్రీ ఎస్. గంగప్ప

పానుగంటి లక్ష్మీనరసింహరావుగారి నెరుగని సాహిత్య విద్యార్థి ఉండడన్న అతిశయోక్తి గాదు; స్వభావోక్తి. వారు రెండు మూర్తులతో ప్రత్యక్షమగుదురు; ఒకటి సాక్షి వ్యాసములలోని ఆంధ్ర వచన రచనాదక్షుడు; రెండు ఉత్తమ నాటక రచనా చణుడు. ఈ రెండు స్వరూపములందును గాంభీర్యముతోపాటు హాస్యము గూడ ప్రస్ఫుటమై యొప్పారుచుండును. వారు ముప్పది మూడు నాటకములు రచించి 'ఆంధ్ర షేక్స్పియర్' అని వాసి గాంచిరి. బహుళజనాదరణమునకు పాత్రములైన వారి నాటకములలో రాధాకృష్ణ, విప్రనారాయణ, పాదుకా పట్టాభిషేకము, కంఠాభరణము పేర్కొనదగినవి. వీనిలోను కృష్ణభక్తికి పరాకాష్ఠ యనదగిన రాధాకృష్ణ నాటకము సర్వజనామోదమునంది, బహుళ ప్రచారము గాంచినది.

పానుగంటివారు 1900 లో మొదటి నాటకము రచించిరి; అది నర్మదాపురుకుత్సీయము. రాధాకృష్ణనాటకము వారి నాటకములలో నాల్గవది. వారు భారతీయ పాశ్చాత్య నాటక లక్షణములను గుర్తెరిగి వాని సమన్వయముతో నాటకములు రచించిరి. నాటకమున పద్యము పఠించవలెనుగాని పాడరాదను అభిప్రాయమును గలవారు కనుకనే తేటగీత, ఆటవెలది, సీసము కందము వంటివేగాని వృత్తములు నాటకమున వాడుట వారి కిష్టముండదు. చివరికి కేవలము వచననాటకములే రచించిరి. విషాదాంతములుగా నాటకములు రచింపరాదను నభిప్రాయముండుటచే మొదట సారంగధర నాటకమును మోదాంతముగా రచించిరి కాని తరువాత ఆ అభిప్రాయ ప్రాయములో మార్పుకలిగి జీవితమునకు ప్రతిబింబమైన నాటకమును విషాదాంతముగా ముగించుటయే స్వాభావికమని తలంచి చివరినాటకములలో అట్టి మార్పును దెచ్చినవారు వారు. నాడు ఉండిన గ్రాంథిక వ్యావహారిక భాషావాదములను సమన్వయపరచుటకోయన వారు ఆ రెంటికి మధ్యస్థమై, సరళమై యొప్పు భాషను వాడిరి. ఇవి వారి నాటకములలో గన్పట్టు కొన్ని లక్షణములు. రాధాకృష్ణ నాటకమున వారు రాధయొక్క మధురమోహనమైన కృష్ణభక్తిని ప్రతిపాదించి కృతార్థులైరి. అట్టి భక్తితోపాటు హాస్యము, నాటకీయవ్యంగ్యము సను లక్షణములను గూడ జోడించి నాటకమును మరింత మనోహరమొనరించిరి. నాటకమున నుండవలసిన పాత్రచిత్రణ, రసపోషణ, సన్నివేశ కల్పన—అను మూడు లక్షణములు నందు ముడిపడియున్నవి.

శ్రీకృష్ణుడు జగన్మోహన వేణుగానలోలుడు. అట్టి కృష్ణునియందు భక్తిప్రపత్తులు గలిగినది రాధ. రాధయొక్క కృష్ణభక్తి అనితరసాధ్యమైనది; ముగ్ధమోహనమైనది. ఆమె భక్తి ఐహిక వాంఛల కతీతమై, నిష్కళంకమైనది. మధురభక్తి పరాయణులందరు భగవంతుడొక్కడే పురుషుడనియు, తక్కిన ప్రాణికోటియంతయు స్త్రీ స్వరూపమనియు నమ్మినవారు. ఈ సూత్రము రాధ భక్తికిగూడ వర్తించును. 'మనకాంతుడు తప్ప మరి యెవ్వరున్నారు? సృష్టిలోని జీవతతియంతయు స్త్రీలే యె అందఱకొక్కడే పురుషుడు' (పుట73)—అని రాధ, సత్యభామతో నుడువును. రాధాప్రణయము అలౌకికమైనది; భౌతికవాంఛారహితము కనుకనే తన మనసెల్లప్పుడు బాలకృష్ణుని మీదనేగాని ప్రౌఢుడైన కృష్ణుని మీద లేదు. మధురనుండి తిరిగి వచ్చిన కృష్ణుని గాంచిన రాధ '..నన్ను వలపించిన వాడు, నా ప్రాణనాథుడు, నా యిష్టదైవము, బృందావనాధీశుడుగాని మధురాధీశుడు గాడు కదా... (చెఱగు మొగమున కద్దుచుచున్నది)' '(పుట 65)—ఇట్లు వైముఖ్యమును జూపును

'గీ. మణికిరీటాంగదాది హేమ ప్రసాధ
నములు నిను రాజుగాఁ దెల్పు—నాదుమగడు!
ధరణినాథుఁడుగాఁడు రాధామనంబుఁ
గొల్లగొన్నట్టి కడులేఁత గొల్లవాఁడు.'

(పుట. 66)—

అని బాలకృష్ణుని స్వరూపమునే స్మరించినది. తన సర్వము భగవదర్పణము చేసినది రాధ తనకు సర్వము భగవత్స్వరూపమే కనుకనే మధురయందు బాల కృష్ణునిగాంచి ఆనందించినది. అంతియేగాక 'రాధా! చూచితివా! నా కాంతుఁ డిప్పుడెక్కడ నున్నాడో? ఇంక నీతని నా ప్రక్కనుండి యెన్నఁడును వేఱు వేయకు సుమా! చేసిన యెడల ననుభవింపఁగలవు సుమా?' - అన్న సత్యమాటలకు నాకుఁగాంతుఁడు నా శిరమున నున్నాఁడు. కనులం దున్నాడు; జిహ్వయం దున్నాఁడు! హృదయమున నున్నాఁడు అతఁడు నాలో నున్నాఁడు, నే నాతనిలో నున్నాను. ('పుట' 75)— అని రాధ సమాధానమిచ్చును. రాధాభక్తికి పరాకాష్ఠ చతుర్థాంకము. ఆమె నిరస్తభూషయై, కాషాయాంబరధారిణియై, సర్వసంగపరిత్యాగినియై భగవంతునియం దైక్యము నందుటకై వెడలు చుండును మధుర అనుసరించును. కాని చివరకు యమునానదిలో ఆ సమయమున ప్రతిబింబించు చుండిన చంద్రునిగాంచి కృష్ణుడని భ్రమించి అందు మునిగిపోవును. కనుక ఆమెలో ఇహసుఖలోలుపతగాక పారలౌకికసౌఖ్యమే ప్రధానముగా నున్నదని తెలియును గర్వించిన సత్యభామను గూడ భక్తిమార్గము లోనికి తీసికొని రాగలిగిన పరమోత్కృష్టప్రభావము గలది రాధాభక్తి. అందులోను రాధయొక్క మధుర భక్తిని ప్రతిపాదించుట పానుగంటివారి ఉద్దేశ్యము. కనుక సాంకేతికము (symbolic) గా దానిని నిరూపించిరి '...రాధ కిరువురు చెలికత్తెలు గలరు. ఒకరు లలిత; ఇంకొకరు మధుర. మూడవ అంకమున కృష్ణవిరహార్తయైన రాధాదుఃఖోపశమనార్థము లలితా మధురలు శారద కృష్ణులుగా నటింతురు. అసలు లలిత మధుర లనెడివి భక్తిభేదములు; ఇవి ఉత్తరోత్తర గుణాధికములు. లలిత భక్తితో ఆరంభమైన రాధయొక్క బాలమురళీకృష్ణసాన్నిధ్యవాంఛ మధురభక్తిగా పరిణమించుటను పంతులుగారు నిరూపించినారు. కావుననే చతుర్థాంకములో రాధ వెంట మధుర నొక్కతెనే చిత్రించుట జరిగినది'[1]

అటు సంస్కృత వాఙ్మయమునగాని, ఇటు తెనుగు సాహిత్యమునగాని ప్రాచీనకవులు హాస్యమున కెక్కువ ప్రాధాన్యమీ లేదనవలెను; శృంగారమునకే పట్టము కట్టినారు కాని ఆధునికాంధ్ర వాఙ్మయ ప్రవర్తకులు ఆకొరతను తీర్చివేసిరి. వచనరచనలందును నాటకములందును హాస్యమును పరిపోషించిరి. కందుకూరి, చిలకమర్తివారల ప్రహసనములలో హాస్యముకలదు. ధర్మవరం, కోలాచలం వారల నాటకములలోను ఎడనెడ హాస్యమున్నది. 1897 లో వెలువడిన రెండు నాటకములు—గురజాడవారి కన్యాశుల్కంలోను, వేదంవారి ప్రతాపరుద్రీయములోను ఈహాస్యము చక్కగా పరిపోషింపబడినది. తరవాత హాస్యమున కెక్కువ ప్రాధాన్యము నిచ్చినవారు పానుగంటివారు. ఎప్పుడైన, ఎవ్వరికైన- మానసికవేదన, గ్లానిని పోగొట్టి ఆనందసాగరమున ముంచెత్తునది హాస్యము. గాంభీర్యమైన మనస్తత్త్వము గలవారిలోను హాస్యము తళుక్కున మెరపువలె మెరసి పోవును. అది లేని జీవితము వ్యర్థమేయగును. పానుగంటివారి హాస్యము చాల సున్నితమైనది. సంస్కృత నాటకములలో హాస్యము నందిచ్చువాడు విదూషకుడు. కాని ఆ హాస్యము కొంతవరకు ముదురుపాకమున నుండును. రాధాకృష్ణ నాటకమునగూడ విదూషకుడైన శారదుడు హాస్యమునకు కారణభూతుడు. అయినను నిక్కడ హాస్యము సున్నితమై, మనోహరమై యొప్పుచున్నది. విదూషకుని ప్రతివాక్యమందును హాస్యముండును. రాధ శ్రీకృష్ణుని రాకకై ఎదురుచూచుచు తహతహ పడుచుండును. ఆసమయమున వచ్చిన శారదునితో ఆమె కృష్ణునిరాకనుగూర్చి అడుగును.

రాధ:...ఓయయ్యా! నా హృదయవల్లభుఁడు నీతోవచ్చెదనని చెప్పెనా?

శార:—నాతో వచ్చెదనని యాతడు చెప్పలేదు.

రాధ:—హా కృష్ణా! ఎంతమోసము జేసితివి. సఖీ! నాయలంకారమును దీసివేయుము.

---

1. తెలుగు నాటకవికాసము—డా॥ పి. ఎస్. ఆర్. అప్పారావుగారు—(పుట 272.)

'లలిత:—అమ్మా! తొందరపడకుము అయ్యా! ఎప్పుడువచ్చెదనని చెప్పినాఁడు?

శార: - నా వెనుక వచ్చెదనని చెప్పినాఁడు'

ఇట్లు తనతోపాటుగాక తన వెనుక వచ్చెదనని చెప్పినాడనుటచే హాస్యము కలుగుచున్నది. ఇట్లు విదూషకుని మాట లన్నింటిలోను హాస్యమును పరిపోషించి పానుగంటివారు దాని కెంతయో ప్రాధాన్యము నొసంగిరి.

పానుగంటివారు నాటకీయవ్యంగ్యము (Dramatic Irony) నకు ప్రాధాన్యము నిచ్చినారు. పాశ్చాత్య నాటకములందు దీని వైశిష్ట్య మెక్కువ నాటకమువందలి పాత్రలు ఒక యర్థము నుద్దేశించి వాడిన మాటలు ఇతరులకు మరొక యర్థమును స్ఫురింపజేసినచో దానిని నాటకీయవ్యంగ్యమందురు. ఇది వస్తు సంబంధ (Irony of incident), వాక్య సంబంధి (Verbal Irony) అని ద్వివిధము. ఇట్టిది సంస్కృతమునను గలదు. దీనికి భరతుడు నాట్యశాస్త్రమున పతాకాస్థానకమని పేర్కొనెను [2] భారతీయ పాశ్చాత్య నాటకములందు సముచితస్థానము నాక్రమించిన నాటకీయవ్యంగ్యమునకు రాధాకృష్ణ నాటకమున పానుగంటివారు ఉచితస్థానము నొసంగిరి. ప్రథమాంకమున రాధ 'ఈ మాధవీనికుంజ మంధకారయుతముగా నున్నదేమి?' అని లలితతో నడుగగా ఆమె నవ్వుచు 'నీనాథుండింకను రాకపోవుటచేత'— అని సమాధానము చెప్పెను. రాధ 'నా ప్రాణనాథుఁడు వల్లనివాఁడని పరిహసించుచుంటివా?'—అని కోపగించుకొనును. లలిత:— 'నిన్నరాత్రి యాగిరిమండలముపైఁ జంద్రుఁడు, నీ గిరిమండలముపై గోపాలుఁడు నొక్కసారిగా నుదయించిరికదా? ఈ రాత్రి గూడ నావేళకే నీనాథుఁడు వచ్చునని'—అంటినని చెప్పెను. ఇట్లిద్దరకు వేర్వేరు అర్థములు స్ఫురించినవి ద్వితీయాంకమున శారదునితో 'రాధ బాగున్నదా?'— అని సత్యభామ అడుగును. ఇందు రెండంశములు స్ఫురించును; అందము, క్షేమము. సందేహము గలిగిన శారదుఁడామాటలే ప్రచ్ఛించును. క్షేమముగాదని, సౌందర్యమని సత్య అనును. అప్పుడు శారదుడు 'చెప్ప వీలులేదు'— అని సమాధానమిచ్చును. తాను చెప్పగూడదనియు, అసాధ్యమనియు నిందు రెండర్థము లిమిడియున్నవి. 'అసాధ్య'మని శారదుని సమాధానము. ఇందు హాస్యముగూడ జోడింపబడినది ఇట్లు నాటకీయవ్యంగ్యము పరిపోషింపబడినది, ఇట్టివనేకోదాహరణములు చూపవీలగును ఇవి పదగత నాటకీయ వ్యంగ్యమున కుదాహరణములు సన్నివేశములందలి దానికి గూడ ఇట్లే ఉదాహరణలు చూపవీలగును.

నాటకకర్త అనుసరించవలసిన ముఖ్యలక్షణములలో పాత్రచిత్రణ మొకటి నాటకమునందలి పాత్రలు పిండిబొమ్మలవలెగాక సజీవములై యున్నప్పుడే నాటకము అశేష ప్రజానీకపు మన్ననలకు పాత్రమై ప్రసిద్ధి వహించును. ఇట్టి లక్షణము పానుగంటి వారిలో ఏవిధముగాను కొరవడియుండలేదు. రాధాకృష్ణ నాటకమునందలి పాత్రలన్నియు సజీవములే రాధ, సత్యభామ, కృష్ణుడు, శారదుడు, చివరకు చెలికత్తెలైన లలిత, మధుర, తరళికలు గూడ సజీవపాత్రములే అవి సజీవములు గనుకనే ఆయాపాత్రల ప్రవృత్తులు మన మనస్సుల నాకర్షించి హృదయ ఫలకమున చెరగని ముద్ర వేయగలవు. రాధా భక్తియందు తాదాత్మ్యము చెందని వారుండరన్న విప్రతిపత్తి ఉండదు. ఇట్లే సత్యభామా గర్వము, ప్రీతిశయములను గూడ నాటకకర్త స్ఫుట మొనర్చెను; కృష్ణుని దక్షిణ నాయకత్వము నదేవిధమున మనోహరము గావించెను.

'సజీవపాత్ర చిత్రణమువలెనే సన్నివేశ కల్పనమును చాల విశిష్టమైనది. నాటకకర్త ప్రతిభయంతయు దీనిమీదనే యాధారపడియుండును. నీరసములు, అనుచితములు నైనవానిని త్యజించి సారసములు, ఉచితములునైన సన్నివేశములను మాత్రమే గ్రహింపవలెను రాధాకృష్ణ నాటకమున అయా అంకముల (ప్రారంభనిర్వహణోపసంహారములను గాంచిన ఈ విషయము స్పష్టమగును. మూడవ అంకమునందలి సన్నివేశము ను గల్పించుటయు దానిని నిర్వహించుటయు చాల మనోజ్ఞము. పారిజాతాపహరణమునకు సంబంధించిన కథ నీ యంకమున కవి యతికెను. శ్రీకృష్ణుడు సత్యభామ పాదములకు మొక్కునప్పుడు సత్యభామ తన్నును. చూచిన రాధ చాల బాధపడును, సత్యభామలో మార్పు తెచ్చిన

2. నాట్యశాస్త్రము—19 వ అధ్యాయము—విశేషాంశములు—డా॥ పి. ఎస్. ఆర్. అప్పారావుగారు.

సన్నివేశముగూడ నిదియే. రాధ యమునయందు మునిగిన సమయమున కృష్ణుడు సత్యభామవద్ద నుండెను. భక్తవత్సలుడైన కృష్ణుడు దిగ్గున లేచిపోవగా ఏమిటని సత్యభామ యడుగును. 'ఒక భక్తశిఖామణి యమునలో నాకస్మికముగఁ బడి నటులు నాకుఁ గనఁబడె'నని కృష్ణుడు చెప్పును. ఈ విషయము కరిరాజసంరక్షణార్థమై వెడలు నప్పటి 'సిరికిం జెప్పడు...' — అన్న సన్నివేశమును స్ఫురణకు దెచ్చును ఇట్లు సన్నివేశ కల్పనమునం దందె వేసినచేయి పానుగంటివారు.

సజీవపాత్రచిత్రణమును, ఔచిత్యసహిత సన్నివేశకల్పనము నుండినచో రస ముచితరీతిని పరిపోషింపబడును. రాధాకృష్ణనాటకమున శృంగార రసమున కనుగుణమైన భక్తిరసమును పోషించి నట్లు ప్రస్తావన వలన దెలియును. ఇందు భక్తి ప్రధానరసము; శృంగారహాస్యములు అంగరసములు. కాని ప్రాచీనాలంకారికులలో ధనంజయుడు, హేమచంద్రుడు, మమ్మటుడును భక్తి రసముగాదనిరి. జగన్నాథపండితరాయలు రసమని యంగీకరించి త్రోసిపుచ్చెను రూపగోస్వామి, మధుసూదనసరస్వతియు భక్తిని రసముగా నిరూపించిరి. ఇట్లు భక్తి రసమని యంగీకృతము.[3] కనుక రాధాకృష్ణ నాటకమున ప్రధానరసము భక్తియనుట నిర్వివాదము. అయినను భక్తిరసానుగుణ్యముగ రాధాకృష్ణ నాటకము లేదని శ్రీ పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారు వ్రాకుచ్చిరి.[4] కాని అది ఉచితముకాదని డా॥ పి. ఎస్. ఆర్. అప్పారావుగారి అభిప్రాయము.[5]

నాటకరచనమున ఔచిత్యపరిపాలనము చేసినను, అక్కడక్కడ ఒకటి రెండు అనౌచిత్య స్ఫోరకములైనవి దొరలినవి. శ్రీకృష్ణునంతవానికి ఇల్లాలైన సత్యభామ శారదునితో 'వస్త్రాపహరణ సంబంధముఁ జెప్పితివి గావేమి?' అని యనుట ఉచితముగా తోచదు. 'రాధ యనుపయుక్తురాలైన బాల కృష్ణుని వలచుటయేల?' — అని తరళయడుగగా శారదుడు, 'మొవ్వవంకాయకున్నరుచి ముదిరినదాని కుండునా?' — అనుటకూడ అనౌచిత్యముగనే యున్నది. ఇట్టివి కొన్నిగలవు. అయినను గుణాధిక్యముచే నిట్టివి మరుగున పడిపోవును.

ఇట్లు పానుగంటి నరసింహారావుగారు నాటక కర్తకు వలసిన గుణములన్నింటితోను రాధాకృష్ణ నాటకమును రచించిరి అందు వారు రాధయొక్క కృష్ణునియందలి మధురభక్తిని ప్రతిపాదించి, ప్రకటించి రాధవలెనే ధన్యులైరి.

---

3. కావ్యాలంకార సంగ్రహము — శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారి వ్యాఖ్య. (పుటలు–304, 305, 306, 307)

4. ఆంధ్ర నాట్యప్రకాశిక — శ్రీ పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారు. (పుటలు – 396. 397.)

5. తెలుగు నాటకవికాసము — డా॥ పి. ఎస్. ఆర్. అప్పారావుగారు. (పుటలు — 271, 272, 273.)

సన్నాటా

శ్రీమతి ఐ. వి. యస్. అచ్యుతవల్లి

ఎప్పటి పసుపురంగుగల మేడ అది! ఆ రంగువేసి పది పదిహేనేళ్ళు అయివుంటుంది. పదిహేనేళ్ళ ఎండలకీ, వానలకీ ఆ రంగు తట్టుకుని నిలబడింది. అయినా, యవ్వనంతో మెరిసిపోయే గులాబీల బుగ్గలున్న, పదహారేళ్ళ జవ్వనిలా గేంలేదు. రకరకాల సౌందర్య పోషకాలతోటీ బలవంతంగా, అందాన్ని, లావణ్యాన్ని నిలబెట్టుకుంటున్న నలభయిఏళ్ళ పైబడ్డ, నాయికవేషాలేసే సినీతారలా వుంది, ఆ మేడ! ఒంకు వొంకులు తిరిగిన, లాజులతో, రెండు మూడు అంతస్థులుంటుంది. పైన మూడు అడుగుల పిట్టగోడతో బాల్కనీ వుంది. పూర్వకాలపు జమీందారీ కుటుంబాలకి చెందిన దా మేడ! కాలం కదలిపోవుటతో జమీందార్ల జమీలు కూడా, కరగిపోయాయి. వ్యర్థమైన డాంబికాలు వదలి, ఆ మేడ క్రింది భాగాలని, చిన్న చిన్న వాటాలుగా విభజించి, అద్దెల కిచ్చుకున్నాడు, ఆ జమీందార్ల వారసుడయిన మజుందారు. అతని సంసారం మొదటి అంతస్థులో ఉంటోంది. కింది భాగాల్లో, ఒక సచారీకొట్టు, చిన్న చెప్పుల దుకాణం, ఒక దర్జీకొట్టు, ఒక పాన్‌బీడా షాపు ఉన్నాయి. 'దర్జీ' కుట్టు మిషన్ ఎప్పుడూ, రాత్రింబగళ్ళూ, 'బర్‌ర్‌ర్' మంటూ తిరుగుతూనే ఉంటుంది. పాన్‌బీడాషాపు యజమాని జకరయ్య కీ మధ్య ఏదో లాటరీలో చిన్న ట్రాన్సిస్టర్ వొచ్చింది. ఉదయం ఏడు గంటలనించీ, రాత్రి పదకొండుగంటలదాకా హిందీ, తెలుగు, తమిళం, ఇంగ్లీషు మొదలయిన భాషాభేదం లేకుండా అన్ని రకాల ప్రోగ్రాంలూ పెట్టుతూ ఉంటాడు. నెలకోసారి అప్పు చేసయినా, బ్యాటరీకొనివేస్తూ వుంటాడు. ఆ ట్రాన్సిస్టర్ చెవికోసిన మేకలా అరుస్తూ 'గుర్ర్ర్' అంటూ మధ్యమధ్య గండుపిల్లిలా గుర్రుపెడుతూ వుంటుంది. ఇరుగు పొరుగు భవంతుల్లో పనిచేసే చిన్న కుర్రవాళ్ళు 'కిళ్లీల' కని వచ్చి, ఆ రేడియోకేసి, ఆసక్తిగా చూస్తూంటారు. జకరయ్యకి వాళ్ళు అల్లా చూస్తూవుంటే ఏదో చెప్పలేనంత గర్వం నిండుకొస్తుంది. గడ్డం పొడుగుచేసి, పెదిమలు బిగబెట్టి, నుదుర్లు చిట్లించి ఆ ముల్లుని అటూ ఇటూ కదుపుతూంటాడు. చెప్పులదుకాణం, మేనేజరు, నమ్మయ్య, వరాండా మీదకి ఒక రంగులువెలిసిపోయిన కేన్‌కుర్చీ వేసుకుని ప్రార్థన చేస్తూన్న వాడిలా కళ్ళు మూసుకుని కూర్చుని ఉంటాడు. రెండవ అంతస్థులో సగంభాగం గచ్చులూ అదీ పోయి, రంగులు వెలిసిపోయి శిథిలాలయంలా వుంటుంది. అందులోనే తాలూకా కచ్చేరీలో పనిచేసే వెంకయ్య కుటుంబం ఉంటూంది. వెంకయ్య భార్య సీతాలక్ష్మి శంకరి. నోరూ వాయీలేని, గోమాతలాంటిది! వెంకయ్య తెచ్చిపోసే గింజలేవో ఉడకేసి పెట్టటంతప్పితే ఇంకో గొడవేదీ పట్టించుకోదామె! వెంకయ్యకి, పెళ్ళాం ఎనమండుగురు పిల్లలూకాక, చిన్నప్పుడే భర్తపోయిన అక్క సూరమ్మ కూడా వుంది. సూరమ ఇంట్లోవున్నవీ లేనివీ చూసుకుంటూ ఏ పూట ఏం వండాలో, మరదలుకి పురమాయించుతూ ఉండేది. సూరమ్మ కీమధ్య నాలుగయిదునెల్లాయి వంట్లో బాగా వుంటంలేదు. ఏం జబ్బో ఏమిటో తెలీదు. ఆయాసం, నీరసం, నిస్త్రాణ, అంటూ రోజులో ఎక్కువభాగం మంచానికే అతుక్కుపోయివుండేది. తన జబ్బు గురించి వెంకయ్య ఏమీ పట్టించుకోవటంలేదనీ, ఆమె అభిప్రాయం. తను ఇంత హైరానపడి, కండిలాంటివాణ్ణి కొండంతచేసి, పెళ్ళి పేరంటం చేసినందుకు తనకి సరయిన వైద్య సదుపాయాలు చేయటం వెంకయ్య కనీసపు కర్తవ్యం అని ఇరవయ్యినాల్గు గంటలూ సాధించిపోసేది. వెంకయ్యఅయినా, సూరమ్మ జబ్బుని గాలికి వదిలెయ్యలేదు. గాలినీ ధూళినీ, మంత్రాలనీ, జపాలనీ చేయించాడు. రూపాయీ, అర్ధా పెట్టి తావీజులు కట్టించాడు. శంకరిచేత కొబ్బరికాయలూ, పసుపునీళ్ళూ, కుంకంనీళ్ళూ, పేడముద్దలూ దిగదుడుపులు పెట్టించాడు. హోమియోపతి మాత్రలు గంటకీ రెండుగంటలకీ పుంజీడేసి మింగించాడు. సూరమ్మకి, ఈ తస్పీ, బస్సీ వైద్యాలంటే ఏమాత్రం నమ్మకంలేదు. అంచేతనే ఆమెకి ఏమాత్రమూ రోగం తగ్గినట్లనిపించలేదు. వెంకయ్య ఒంటిగంటకి భోజనానికి వొచ్చేవాడు. ఆ సమయానికి సూరమ్మ పట్టెమంచం మీద నడుంగా బాసింపట్టు వేసుకుని కూర్చునేది. (మంచం కుక్కిఅయిపోయిన నవారుమంచం. అదే సూరమ్మ గారి హంసతూలికాతల్పం! దానిమీద చిరుగుపట్టి, మురికివాసనవేస్తూ వున్న రెండు, మూడు బొంతలుంటాయి. అవి ఆమెకి ముఖమల్ పరుపులు! 'కొబ్బరిపీచు' కుక్కి తయారుచేసుకున్న దిండు కూడా వుంది సూరమ్మకి! 'సూరమ్మది భారివిగ్రహం!' హుం!' అంటూ పెద్దగా దీర్ఘంగా మూలిగేది. అది ఆమె చెప్పబోయే ఉపన్యాసానికి నాంది ప్రస్తావన అన్నమాట!

'ఈ ఇంట్లో నేనున్నా ఒకటే, పోయినా ఒకటే! అసలు ఇదెక్కడి పీడరా బాబూ! ఇదెప్పుడు విరగడయిపోతుం

దిరా నాయినా అంటూ కనిపెట్టుకు కూర్చున్నారు. ఒక్క పూట గుప్పెడు మెతుకులు తింటూ, కాలక్షేపం చేస్తూ పెంచుకుఒచ్చాను. ఆ కృతజ్ఞతేమన్నా వుండి చస్తేగా! అయిదారు నెల్లాయి రోగంతో తీసుకు ఛస్తున్నాను. పెద్ద డాకుటేరుని పిలిపించి చూపిద్దామన్న ఆలోచనే రాలేదు. రోజూ లబో, దిబోమని మొత్తుకుంటూంటే కూడా దిక్కులేదు. ఇన్ని కషాయంపిళ కీ, పంచదారమాత్రలక, పెద్దకాలంలో వొచ్చే రోగాల తగ్గుతాయా! ఏ ఆపరేషనో, ఇండెషనో ఇప్పించాలి. (ఆపరేషన్, ఇంజక్షన్ పెద్ద పెద్ద మందులనీ, అద్భుతంగా పని చేస్తాయనీ ఆమె అభిప్రాయం.) డబ్బుకి ముఖం మాడ్చుకుంటే ఎలాగ? కావాల్సివస్తే నా పొలం బేరంపెట్టి అయినా పెద్ద ఇంగిలీషు డాకటరుని పిలిపించాలి! వెధవడబ్బు శాశ్వతమా! ప్రాణం పోస్తూందా!' అంటూ గొణుక్కుంటూ కూర్చునేది. సూరమ్మకున్న పొలం అంతా అరయకరం కన్నా ఎక్కువలేదు. సూరమ్మభర్త చిన్నప్పుడే పోయేడు. సూరమ్మ తల్లి పేచీలుపెట్టి అడగ్గా, అడగ్గా పల్లేళ్ళూ, జిల్లేళ్ళూ మొలిచిపోయిన దిబ్బమీద ఒక అర యకరం వాసి పడేసాడు, సూరమ్మ మావగారు. అదేదో పెద్ద పల్లపుపొలం అయినట్లూ, దానిమీద బోలెడు ఫలసాయం వస్తున్నట్లూ చెప్పుకుని మురిసిపోయేది.

'మహానుభావుడు! పోతూ పోతూ నా కింత అన్నం పెట్టిపోయేడు' అంటూ నిరంతరం పోయిన భర్తకి కృతజ్ఞత చెప్పుకునేది సూరమ్మ! శంకరి పెళ్లి అయిన కొత్తలో ఆడపడుచు, అర్ధరాజ్యానికి అధికారిణియై వున్నట్లు భావించేది. రానురానూ ఆడపడుచుయొక్క అర్ధరాజ్యంమీద ఆరణాలైనా వసూలు కాకపోయేసరికి ఆరాజ్యం శంకరగిరి మాన్యం అని తెలిసిపోయింది. అయినా శంకరి పన్నెత్తిమారుమాట చెప్పకుండా సూరమ్మ అజమాయిషీ క్రింద, అణిగి, మణిగి పిచికపిల్లల్లె కాపురం చేసింది. సూరమ్మ గొణుక్కుంటూంటే వెంకయ్యకి ముద్ద మింగుడు పడేదికాదు. గ్లాసెత్తి పట్టి మంచినీళ్లు గడగడా తాగుతూ!

'వెధవ పచ్చడిచేసి తగలేశావు! తోటకూరపచ్చడికన్నా ఇంకేమీ దొరకలేదా! వెధవ దరిద్రపుగొట్టు ముఖానికి!' అంటూ, అక్కగారి గొణుగుడు, వినపడకుండా భార్యామణిమీదకు ధ్వజమెత్తేవాడు

'తోటకూరమటుకు ఊరికే వస్తోందా! మునుపు గుప్పెడు నూకగింజలకీ, చాటెడు తోటకూర పడేసేవారు. ఇప్పుడు తవ్వెడుబియ్యంపెట్టినా, గుప్పెడుకూర రాల్చటం లేదు. పావలా కూరకొంటేకాని ఇంటిల్లిపాదికీ సరిపోవటం లేదు. ఎక్కడికని తేవటం? చీమా దోమా లా, ఇంటినిండా పిల్లలాయె! వీళ్లందరికీ ఏం పెట్టాలి?' మనస్సులోనే విసుక్కునేది శంకరి. తమ్ముడు, మరదలుమీదకి దండెత్తటంతో సూరమ్మకి రోగం సగం నయమయినట్లనిపించేది!

అవునే! ఇన్నేళ్లాయి కాపురం చేస్తున్నావు వాడికేం ఇష్టమో తెలీదుటే! వెధవ పచ్చడి మెతుకులు వాడెప్పుడన్నా తిన్నాడా! ఏదన్నా కూర చేయాలన్న జ్ఞానమనా, లేదు నీకు! ఆఫీసులో చేసిచేసి ఇంటికి వస్తాడు నాలుగు మెతుకులు తిందామనుకునేసరికి గొడ్డుకారం పచ్చడి పడేస్తే ఎల్లా తింటాడు? వెధవ పచ్చళ్లు తిని బ్రతికే కుటుంబాలా మావి!' అంటూ మరదలుమీదకి ఆవిడా, సైనిక సన్నాహం చేసేది.

తాత్కాలికంగా అక్కగారి వాగ్బాణాల్ని తప్పించుకోగలిగాననే తృప్తితో ఆఫీసుకి వెళ్లిపోయేవాడు వెంకయ్య. అతనికి అక్కగారంటే వల్లమాలినంత అభిమానం వుండేది. పెద్ద డాక్టరుని పిలిచి పరీక్ష చేయించి మంచి మందులు ఇప్పించుదామనే వుండేది. ఏ డాక్టరు గురించి వాకబుచేసినా కన్సల్టింగ్ ఫీజు పాతిక మొదలు యాభయి రూపాయలదాకా ఉండేది కాని, అంతకి తగ్గివుండేదికాదు. తీరా వాళ్లని తీసుకవచ్చి చూపెడితే, వాళ్లు తమ హోదా తగ్గట్టు, ఏ వంద రూపాయల టానిక్కులో ప్రిస్క్రిప్షన్ వ్రాసి పారేసారంటే, అవి అతను తేలేకపోతే మళ్లీ అదొక రాద్ధాంతం అయితీరుతుంది. అందుకని, రెండు మూడు వందలు చేతిలో పట్టుకుంటేకాని, పెద్ద డాక్టర్ల దగ్గరికి పోకూడదు. ఇవి అన్నీ ఆలోచించుకునేవాడు వెంకయ్య. ఏ నెలన్నా పాతిక రూపాయలు మిగులుతాయేమో అని చూసేవాడు పాతిక పైసలన్నా మిగల్చలేక గిలగిల్లాడేవాడు వెంకయ్య!

సుబ్బాయమ్మ, వెంకయ్య పెద్దకూతురు పదహారేళ్ళు నిండివుంటాయి. వోణీలు వేసుకునే వయస్సు వచ్చేదాకా ఆ మేడకి మూడు సందుల కావలవున్న తాటాకు పాకలో వున్న ఎలిమెంటరీ స్కూల్లో అయిదోక్లాసు చదూకొంటూ ఉండేది. వోణీలు వేయించా ఇంకా ఆడపిల్లకి చదువెందుకు? ఉద్యోగాల్చెయ్యాలా! ఊళ్లేలాలా! అంటూ సూరమ్మ, సుబ్బాయమ్మని చదువు మాన్పించేసింది.

సుబ్బాయమ్మంటే సూరమ్మకి, ఎంతో ఆపేక్ష! ఆ పిల్లకి తన తల్లిపేరు కావాలని పెట్టింది. సీతాలక్ష్మి శంకరమ్మ తొలిసారి కడుపుతోఉండగా ఆడపిల్ల కలగాలని సూరమ్మ జ్ఞాపకం వున్న దేవుళ్లందరికీ ముడుపులు కట్టింది. ఆవిడ కోరిక ఫలించినట్లుగానే సుబ్బాయమ్మ జన్మించింది. ఆవిడ బ్రహ్మానందపడిపోయింది. సుబ్బాయమ్మ తర్వాత రెండేసి ఏళ్ళ కొక్క మగపిల్లాడి చొప్పున కన్నది శంకరమ్మ. గుడ్డిలో మెల్ల అనుకొన్నట్లు, అంతా మగపిల్లలే కలిగారు శంకరికి. ప్రభుత్వం వారు, పట్టుదలగా, కుటుంబ నియంత్రణ ప్రచారం మొదలు పెట్టేసరికే, వెంకయ్య కొంప, సంతానంతో నిండిపోయింది. అయినా, వాళ్లిచ్చే రూపాయిలు ఏ ఖర్చుకయినా వుంటాయని, వేసక్టమీ చేయించు కున్నాడు వెంకయ్య. ఏడుగురు, మగపిల్లల్లో సుబ్బాయమ్మ ఒక్కర్తె ఆడపిల్ల అవటంనించి, మేనత్త దగ్గిర, తల్లి దగ్గిర, బాగా గారాలుపోతూ వుండేది సుబ్బాయమ్మ.

"సుబ్బా!" అని, మేనత్త, తల్లిపిలుస్తుంటే ఆ పిల్లకి, వంటి మీద తేళ్ళూ, జెర్రులూ పాకుతోన్నట్లు అన్పించేది.

"సుబ్బా ఏమిటీ రుబ్బా అన్నట్లు! నాకేదన్నా మంచి పేరు పెట్టి పిలు అత్తా!" అనేది.

"అదేమిటే! పిచ్చిపిల్లా! నీ పేరుకేం! నానమ్మ పేరే తల్లీ! నానమ్మ అదృష్టం ఎవరి కొస్తుందే నా చిట్టీ! పాతి కేళ్లు నిండకుండానే పునిస్త్రీ చావు చూసింది. మహా ఇల్లాలు! నా తల్లి అదృష్టం, నా కొచ్చిందా ఖర్మ!" అనేది సూరమ్మ. ఆమెకి, తొమ్మిదోయేట పెళ్లి అయింది. పదో ఏట మిగిలిన వన్నీ పూర్తి అయ్యాయి. సూరమ్మ తండ్రి వెర్రిబాగులవాడుగా వుండేవాడు. వెంకయ్య పుట్టిన రెండు నెలలకి, సూరమ్మ తండ్రి చెప్పా పెట్టాకుండా వూళ్ల మీదకి లేచిపోయేడు. వెంకయ్యకి అయిదారేళ్లు వచ్చేసరికి, సూరమ్మతల్లి కూడా గతించింది. సూరమ్మ తల్లి, భర్త లేచిపోయినందుకు, ఏమీ కృంగి పోయేది కాదు. ధైర్యంగా పిల్లల్నిద్దర్నీ పెట్టుకుని, కాలక్షేపం చేసేది. తల్లి అంటే ఎంతో ఆత్మీయతగా వుండేది, సూరమ్మకి. తన మావగారితో పోటా పోటీలు పడి, తన కా మడి చెక్క వ్రాయించినందులకు, తల్లి కార్యదక్షతని పొగుడుకునేది. వలభయి నాలుగేళ్ల వాడికి, రోగిష్టి వాడికి, తొమ్మిదేళ్ల పిల్లని, ముడిపెట్టటం అసందర్భంగా, ఆ కాలంలో ఎవళ్లకీ తోచేది కాదు. కర్మ, పూర్వజన్మసుకృతం, అదృష్టం మొదలయిన పదాలన్నీ, వాళ్ల నాలుకల మీద, నిరంతరం వుండేవి. సుబ్బా యమ్మ సూరమ్మకి, రెండో తరందయినా, నాలుగు తరాలు దాటినంత, నాగరీకం నేర్చింది. చదువయితే అబ్బలేదు. తన పేరు నచ్చనందున, "సుభాషిణి"గా మార్చుకుంది. సతతం, ఏవో సినిమా పుస్తకాలూ, నవలలూ, చదూకొంటూ కూర్చు నేది. సుబ్బాయమ్మకి, తోడు నీడలా వుండేది "మాలిని". ఆమె మజుందారు మూడో భార్య! మజుందారుకి, అరవయి ఏళ్లు దాటుతో వుంటాయి. మాలినికి ముప్పయి ఏళ్లున్నా, పద్దెనిమిదేళ్ల పడతిలా, పాలుగారే చెక్కిళ్లతో మృదువుగా వుండేది. మజుందారు మొదటి భార్య, విశాలాక్షి దేవి, మంచం దిగేది కాదు. రెండో భార్య "నందినీ దేవి"కి దైవభక్తి ఎక్కువ. ఉదయం, తొమ్మిది గంటలదాకా పూజలూ, పునస్కారాలూ చేస్తూ, తర్వాత ఇంటి పని చూసుకునేది. విశాలాక్షికి ఇద్దరు కూతుళ్లూ, నందినీదేవికి ఒక కొడుకూ వున్నారు. వాళ్లకీ, పెళ్లిళ్లయినాయి. విశాలాక్షి కూతుళ్లు, ధనవంతుల ఇంటి లోకే వెళ్లారు. నందినీదేవి కొడుకు, దూర ప్రాంతంలో వుద్యోగం చేసుకుంటున్నాడు. అతని పేరు జగన్మోహన చంద్ర. అతని భార్య ఉదయతార, నాలుగేళ్ల కొడుకు, నవీనచంద్ర, చూడ ముచ్చటగా వుంటారు. వాళ్లు వచ్చినప్పుడల్లా, మాలినికి కళ్లు కుట్టుకున్నట్లుండేది. పద్దెనిమిదేళ్ల క్రితం "మాలినీ రాణి"ని పెళ్లి చేసుకుని, ఇంటికి తీసుకువచ్చాడు మజుందారు. భర్త, పెళ్లి సందడి చూసి, నందినీ, విశాలాక్షి మూతులు ముడు చుకు కూర్చున్నారు.

"ఏం జమీలు, కరగటంలేదనో, ఇంకోర్తెని తెచ్చి కట్టుకుంటున్నాడు!" అంటూ, విసుక్కున్నారు. అప్పటికప్పుడే, స్థిరాస్థిలో చాలామటుకు ఖర్చుచేసేసాడు మజుందారు పెళ్లయిన కొత్తలో, మాలినిని చూసి, కంటగించుకున్నా, రాను రానూ, మాలిని పసితనాన్ని చూసి, జాలి పడసాగారు. తమతోపాటుగానే, నందినీ విశాలాక్షి కూడా, ఆదరించకలిగారు. "భగవంతుడు, తన్ని ప్రార్థించకుండానే, దురదృష్టం అనేవరం మటుకు, లోకంలో, సగం మందికి దానం చేస్తాడు కాబోలు!" అనుకునేది మాలిని నిసర్గ సౌందర్యం చూస్తూ, నందినీదేవి. మాలిని కాపు రానికి వచ్చేసరికే, పచ్చమేడ ప్రహరీగోడ పడిపోయింది. అప్ప టికే "జగన్మోహన చంద్ర" మేనమామల వూళ్లో, చదువు కుంటూ వుండేవాడు. మాలినికి మజుందారు అంటే, పెద భయంకానీ, భక్తికానీ వుండేవి కావు. నూట పదహేను మొహిరీ లకి బదులుగా తెచ్చాడామెను మజుందారు. మాలిని తండ్రి పీక మునగా, అప్పుల్లో పడ్డాడు. అతనిదీ పెద్ద జమీందారీ వంశమే! ఆఖరి అమ్మాయి మాలిని, పెళ్లి కెదిగి కూర్చున్నప్పుడు అతనికి దిక్కు తోచలేదు. లోపాయకారీగా, మజుందారుకి కబురంపి, మిత్రు లిద్దరూ, సంప్రతించుకున్నారు. తత్ఫలితంగా, మాలిని, మజుందారు భార్యగా ఇంటికి వచ్చింది. మాలిని అత్త వారింటికి వచ్చేకనే, బయట ప్రపంచం చూడసాగింది. తల్లి గారింట్లో, ఆమెకి విపరీతమైన ఘోష వుండేది. ఇక్కడ ఆసె కాల్చే, పనిపాటా వుండేది కాదు. వీధివేపున్న కిటికీలకి, పేచని, కర్టెన్లు వుండేవి. ఆ కిటికీపద్ద పేము కుర్చీ వేసుకుని కర్టెను కొద్దిగా తొలగించి రోడ్డు మీదకు చూస్తూ కూర్చు నేది. మజుందారు ఆ పచ్చ మేడమీద కూడా బోలెడన్ని అప్పులు చేసాడు. ఖర్చులకి డబ్బు కావల్సివస్తే అప్పులుచేయటం తప్ప ఇంకోలా డబ్బు సంపాయించటం చేతరాదు మజుందారుకి. అతను చిన్నప్పుడు పండితుల దగ్గిర వ్యాకరణమూ సంస్కృత కావ్యాలూ చదువు కొన్నాడు. ఆ చదువు అతనికి జీవనోపాధి చూపెట్ట కలిగింది కాదు. ఇల్లు పూర్వీకుల దర్జాల కను గుణంగా జరగాల్సి వచ్చేది. అతనికి రాబడి మించిన ఖర్చులు అయ్యేవి. ఎక్కువ ఆదాయం అతనికి అప్పులవల్లే సమకూరేది. మజుందారు తల్లి వుండగానే అతని ఇద్దరు కూతుళ్లకీ గొప్ప గొప్ప జమీందార్ల సంబంధాలు చేసాడు. తల్లి చనిపోయేక ఇంటి పెత్తనం మజుందారు చేతిలోనికి వచ్చింది. అప్పటికే తలమునకలుగా వున్న అప్పుల్ని స్థిరాస్థి అంతా అమ్మి తీర్చే సాడు. ఇంక అప్పుడు మిగిలింది పచ్చమేడ! ఇప్పుడు దాని మీద కూడా దొరికినన్ని అప్పులు చేస్తూనే వున్నాడు మజుం దారు. 'జగన్మోహన"కి తండ్రి "దుబారీతనం" తెలుసున్నా ఏమీ అనేవాడు కాదు. అక్క చెల్లెళ్లకి పెళ్లిళ్లయిపోయాయి. అతనా అయిదారు వందలు నెలకి తెచ్చుకుంటున్నాడు. తల్లి పేర ప్రతి నెలా కొంత సొమ్ము పంపేవాడు. వాళ్లందర్నీ వచ్చి తమ దగ్గిర వుండిపోకూడదా అనేవాడు. మజుందారుకి కొడుకు దగ్గరకి వెళ్ళటానికి లజ్జగా వుండేది. "నా జీవితం ఈ మేడలో వెళ్లమారనీ! తర్వాత్తర్వాత నీ తల్లులని నీవే

చూడ్వాలి! నీకు నేనేమీ మిగల్చలేకపోయినా, ముగ్గురి పోషణ భారం మటుకు తగిలించాను.'' అనేవాడు. ఆయన ఆ మాటలు కొడుకుతో అంటూంటే మాలినికి నిలువెల్లా నిప్పుల్లో వున్నట్లు మండి పడేది. మాలినికి రోజులు గడుస్తున్నకొద్దీ తనకి జరిగిన అన్యాయం ఏమిటో తెలిసి వస్తోంది. ''సవతుల కిద్దరికీ వంటినిండా బంగార మన్నా వుంది. తనకి అదీ లేదు. అన్నీ కలిపి, పది పన్నెండు తులాలకన్నా ఎక్కువ లేదు. పెద్దావిడని, కూతుళ్ళు భరాయిస్తారు. చిన్నావిడని, కొడుకు భరాయిస్తాడు. తన్నెవరు భరాయిస్తారు? ఈయన కెందుకింత వైపల్యం పుట్టుకురావాలి? ఇంత చిన్న పిల్లని నేనేం చేసుకుంటాను; మా లబ్బాయికి చేసుకుంటాను అని ఎందుకు అనలేదు ? ఎంత కఠినబుద్ధి !'' అనుకునేది. మజుందారుని తిట్టుకునేటప్పుడు, పెళ్ళికి ముందు ఆయన, తన్ని చూడ లేదనే సంగతి విస్మరించేది. స్నేహితుడు, ఆపద్ధర్మంగా ఆదుకొమ్మనగానే, సరే అన్నాడు మజుందారు. అప్పటికి జగన్మోహనుడు పదారేళ్ళ వాడు. పెళ్ళి ఇంకా చేయదల్చుకో లేదు. పద్దెనిమిది సంవత్సరాల్లో ఎన్నో మార్పు లొచ్చాయి. ఆ ఇంట్లో మాలినికి పూర్తి స్వేచ్ఛ వుండేది. ఎక్కడికి పడితే అక్కడికి వెళ్ళుతూ వుండేది. ఘోషా అదీ ఏమీ పాటించేది కాదు. వారానికి అయిదారు సినిమాలన్నా, చూస్తూ వుండేది. మజుందారుకి పెద్దతనం వచ్చింది. రెక్కలు తెగిన జటాయువులా వున్నాడు. మాలిని, మర్యాద, మంచీ, పట్టించుకునేవాడు కాదు. సుబ్బాయమ్మ ఎదిగాక, మాలినీ, ఆ పిల్లా, ప్రాణ స్నేహితులయ్యారు. పది ఫైసలకీ, పదిహేను పైసలకీ, కిళ్ళీ కొట్లమీద, అద్దెల కిచ్చే పుస్తకాల్ని సుబ్బాయమ్మ తెచ్చి పెడుతూ వుండేది. వాటి ఇద్దరూ మాలిని గదిలో కూర్చుని, ఏదో పరీక్షకి వెళ్ళుతూన్నట్లు దీక్షగా చదివేవారు. సుబ్బాయమ్మని తనతోపాటు సినిమాలకి తీసుకవెళ్ళేది. కానీఖర్చులేకుండా సుబ్బాయమ్మకి కాలక్షేపం అయిపోతూ వుండేది. మాలిని సినిమాలకి తరుచూ వెళ్తూంటే, తను చాలా అందంగా వుంటాననే విషయం ఒకటి గుర్తుకు వచ్చింది. రోడ్డుమీద, ఆమె వయ్యారంగా నడుస్తూ వుంటే, దారినపోయేవాళ్ళు తన్నే కళ్ళు విప్పుకుని చూస్తూ నిలబడి పోవడం గమనించింది. రోజుకి వందసార్లయినా నిలువు టద్దం ముందు నించుని, చిరునవ్వులు నవ్వుకోవటం, జుట్టు రకరకాలుగా, సిగలు జుట్టుకోవటం, ముఖభంగిమల్ని మార్చి మార్చి చూసుకోవటం చేస్తూ వుండేది. చివరికి ఆమెలో సినిమాల్లో జేరిపోయి, గొప్పపేరూ, లక్షల కొద్దీ ధనమూ సంపాదించ వచ్చుననే గాఢ ఆకాంక్ష మొలకెత్తింది. ప్రతి రోజూ పెద్ద పెద్ద సినీయాక్టర్లకీ, డైరెక్టర్లకీ జాబులు వ్రాస్తూ వుండేది. తనకి నటించాలని వున్నదనీ, తను చాలా అందంగా వుంటాననీ, తను రోడ్డుమీదకు కాలు పెట్టే సరికి తను వైజయ౦తిమాలో, సావిత్రో అనుకుని, తనచుట్టూ అసంఖ్యాకమైన ప్రజలు గుమిగూడు తున్నారనీ వ్రాసుకుంటూ పోయేది. ఆ వుత్తరాలన్ని చదివి, సుబ్బాయమ్మ ఆశ్చర్యపోయేది. తా మిద్దరూ చదూకొంటూ వున్న పుస్తకాలలోని వాక్యాలకి మల్లే వుండేవి, ఆ వుత్తరాలు! మాలిని ఎప్పటికయినా, పెద్ద తార అయిపోయి తీరుతుందని సుబ్బాయమ్మ నమ్మేది.

సుబ్బాయమ్మ కెప్పుడూ, తాను చదివిన పుస్తకాల్లోని నాయకులు కలల్లోనికి వచ్చేవారు. వాళ్ళంతా చాలా అందంగావుండేవారు డబ్బు, పెద్ద హోదా వుండేవాళ్ళు తమ తల్లితండ్రులతో పోట్లాడి, సుబ్బాయమ్మనే పెళ్ళి చేసుకుంటాం అని పట్టుపట్టేవారు. సుబ్బాయమ్మ, తల్లీ తండ్రి, మేనత్త, ''మేము కట్నాలు ఇచ్చుకోలేం. మీ అంతస్థుకి తగం!'' అనేవారు దీనంగా. ''నేను డబ్బుకి, అమ్ముడుపోను. నాకు మనసు మమత ముఖ్యం! సుభా, మంచి మనసుకి, నిర్మలమైన మమతకి నేను అమ్ముడుపోయాను'' అనేవారు. సుబ్బాయమ్మ కలల్లోని నాయకులకి, నిర్దిష్టంగా, ఇదీ అనీ ఒక రూపం వుండేది కాదు. ఒకసారి, నాగేశ్వరరావులా, ఇంకోసారి కాంతారావులా, ఇంకోసారి రామారావులా వుంటూ వుండేవి, వాళ్ళ రూపాలు. ఎప్పుడో కారూ, హోదారూ, దర్జా, దర్పమూ వున్న యువకుడు తన్ని ప్రేమించుతాడని, రూఢి చేసుకున్నది, సుబ్బాయమ్మ. ఆకాశం శూన్యంగానే వుంటుంది. అయినా ఎంతో అందంగా వుంటుంది. ఆ మబ్బులు పరుగెట్టుతూంటే, వాటల్లో మన కెన్నో పోలికలు దొరుకుతాయి. ఒకసారి అందమయిన నర్తకిలా, వేరొకసారి విజయుడు ఎక్కిన రథంలా, ఇంకోసారి మయూరిలా మనం ఏమి ఊహించుకుంటే ఆ చిత్రాలు ఆ మబ్బుల్లో కదిలీ, కదలని ఆ నీలినీరదాలలో మనకు కన్పట్టుతాయి. ఉద్వేగపూరితా లయిన వ్యక్తుల మనస్సులు కూడా శూన్యాకాశం లాంటివే! వాళ్ళు ఊహించుకున్న సంఘటనలు, తప్పక జరుగుతాయనే నమ్మకం లేకపోతే వాళ్ళు ఆ మాత్రం సంతోషంగానైనా జీవితాలు గడపలేరేమో! ఆ ఎదురు చూపులో అమితమైన జీవనాసక్తి!

ఆ రోజు ఉదయం, ఎనిమిది గంటలు దాటుతో వుంది. రథసప్తమి వెళ్ళిన నాలుగు రోజులనాడు ! అప్పుడే ఝామెక్కిపొద్దెక్కినట్లు, సూర్యుడు చురచురలాడుతూ ప్రయాణం సాగించు తున్నాడు.

ఆదివారం అవటంనించి, క్రింది వాటాల్లో వున్న షాపులో వాళ్ళు దుకాణాలు తెరవలేదు. అంచేత ఆ పేట సందడిగాలేదు. వందినీదేవి పూజాగదిలో కూర్చుని ఆదిత్యస్తోత్రం చదువుతూ తన్మయం పొందుతూ వుంది. మజుందారు మహాశయుడు ఈజీచైరులో శరీరం జేరవేసి, అరమోడ్పు కళ్ళతో హుక్కా పీలుస్తూ కూర్చున్నాడు. ఆ సమయంలో ''క్రీక్'' మంటూ ఒక నల్లగా, నిగనిగ మెరిసిపోయేకారు సరిక్రొత్త ఎంబాసిడర్ కారు వచ్చి ఆ పచ్చమేడముందు ఆగింది. అరుగులమీదకువున్న కొట్టు గదులు, పెద్ద పెద్ద తాళాలువేసి వున్నాయి. ఆ గది గుమ్మాలు, ఎండా, వానా, తగలకుండా, షెడ్సుని ఆధారంగా చేసుకుని, గోనెపట్టా గుడ్డలు వ్రేలాడదీసివున్నాయి. ఉన్నతమైన దర్వాజాలు. ఇటు, అటూ, వున్న గోడలు పూర్తిగా పడిపోయి, ఆ మేడ పరిస్థితి ఎంత దీనదశలో వున్నదీ, తెలియ చెప్తోంది. కారులో కూర్చున్న లతమ, రెండుపార్లు కారుహారన్ని

"హియ్ హయ్!" మనిపించి మేడకేసి, పరీక్షగా చూసాడు. అతన్ని 'రిసీవ్' చేసుకుందుకు, ఎవరూ ఇవతలకి రాలేదు. కారు హారన్ మ్రోగటం, ఇంట్లోవున్న అందరికీ వినపడింది!

"అదుగో! వాకిట్లో ఏదో కారువచ్చి ఆగినట్లుంది. వెంకాయి "డాటరు"ని తీసుకు వచ్చాడు కామాల్ను! ఎంతైనా, రక్తం పంచుకు పుట్టినవాడు, వసే శంకరీ! కుంపటి మీద కాసిని వేణ్నీళ్ళు పడేయి. డాటరు వచ్చినట్లున్నాడు.కారాగింది. కాస్త డికాషను కూడా తీసి కాఫీ చేయి, డాటరు గారికి ఇద్దువుకాని. ఆయన చూసియామంటాడో! ఇండేషను చాలంటాడో, ఆపరేషను కూడా చేసుకోవాలంటాడో! ఏమంత వయసు ముదిరిందనో మాయిదారిరోగం ఒచ్చిపడింది! మొన్న పున్నమి వెళ్ళిన ఉదియికే ఉదూ నలభయి ఎనిమిదీ నిండుతా! వున్నదేదో పూడ్చిపెట్టటానికి ఒస్తాయి మాయి రోగాలు. ఈ రోగం రాకపోతే ఈసరికి, సుబ్బాకి మెళ్ళో మూడుముళ్ళూ వేయించేద్దును! ఎన్ని ఆలీసు (హార్లిక్స్)సీసాలుతాగను? అవిఅన్నీ ఏమయిపోయాయో! ఒకటే నీరసం! ఎంతతిన్నా బలం పట్టందే వంటికి! చెర్లో పోసినట్లే! తిన్న తిండి అంతాను. కారేసుకు ఒచ్చినట్లున్నాడు డాటరుబాబు. యంబీ, యస్సీ అయ్యుంటాడు. నలభయ్యో, యాభయ్యో వడుకుతాడుకామాల్ను. పోన్లే, ఏం చేస్తాం? ఆ మడిచెక్క అమ్మి పారేస్తేసరి! ప్రాణం కన్నానా!" అనుకుంటూ, నూరమ్మ, తన ప్రక్క సుబ్బరంగా సర్దుకొని, తిన్నగా, పడుక్కుంటూ "హొ— హొ" అంటూ ఆయాస పడసాగింది.

కారాగిన చప్పుడికి ఉలిక్కి పడింది "మాలిని". అద్దం ముందుకు వెళ్ళి నించుని కళ్ళు విప్పార్చుకుని చూసుకుంది.

"కోష్! కారు ఆగింది. ఆ కారు తనకోసమే వొచ్చి వుంటుంది. అందులో వున్నవాళ్ళు, సినీయాక్టర్లో, డైరెక్టర్లో అయివుంటారు. హాలులో కూర్చున్న తన భర్త దగ్గరికివస్తారు.

"మిస్ మాలిని ఇక్కడేకదా వుండేది! ఆమెని కలుసుకోవాలని ఒచ్చాము. మేము తీయబోయే "అతకని మనసులు" పిక్చరులో హీరోయిన్‌గా, ఆమెని బుక్ చేస్తున్నాము. యాభయివేలు. ఎడ్వాన్సుగాఇచ్చి, కంట్రాక్ట్ వ్రాయించుకోవాలని అనుకుంటున్నాము" అంటూవుంటారు. "ఛ! ఈ రోజా తలకి స్నానం చేసింది. జుట్టు ఎంతకీ ఆరదు. ఒంకులొంకులుగా కాలి మడమలని తాకే ఈ జుట్టు ఎప్పటికి చిక్కుతీసుకోగలదు? ముఖాని కింకా పసుపు చాయలు మిగిలే వున్నాయి. ఇప్పుడు ముఖానికి ఇంత నూనె పులుముకొని నలుగుపిండితో తోముకుంటేకాని, ఆ పసుపుచాయలు వదలవు! ఈ పసుపు రాసిన ముఖంతో పురాణకాలపు పునిస్త్రీలా వాళ్ళెదుటకి ఎల్లా వెళ్ళటం?" అనుకుంది మాలిని. ఆమె వొత్తయిన పొడవాటి జుట్టు ఇంకా ఆరలేదు. నుదుటమటుకు, ఆరిన ముంగురులు తమాషాగా, ఎగురుతున్నాయి. ఆ తడిజుట్టును, అల్లానే, మెలికద్రిప్పి నడినెత్తికి ముడివేసి వెండిపిన్నులు గుచ్చింది. ఆ పిన్నులకి మూడేసి ముత్యాలగుత్తులువున్నాయి. ముఖం శుభ్రంగా, కడుక్కొచ్చి విశాలంగా సోగగావున్న కన్నులకి కాటుక తీర్చిదిద్దింది. నుదుట విల్లువంపులా వున్న కనుబొమ్మలమధ్యగా ఆవగింజంత సింధూరపుబొట్టు పెట్టుకుంది. లేత మబ్బురంగులో జరీ పువ్వులున్న చీరకట్టుకుని, ముదరు నీలం పట్టు చోళీ ధరించింది. బీరువాకి, బిగింపబడ్డ నిలువుటద్దంముందునించుని, చెంపల్లో సన్నని గుంటలుపడేలా చిరునవ్వు నవ్వుకుంటూ, హాలులోంచి తన కోసరంవచ్చే పిలుపుకోసరం నిరీక్షిస్తూంది మాలిని.

కారు ఆగి, హారన్ మ్రోగగానే సుబ్బాయమ్మ, బాల్కనీలోకివచ్చి క్రిందికి చూసింది. ఎంతగా హారన్ మ్రోగించినా, ఎవరూ గుమ్మంలోనికి రాకపోవటంనించి, డోరు తలుపుతీసుకుని, దిగి, మేడకేసి పరీక్షగా చూస్తూ నిలుచున్న యువకుడు కనపడ్డాడు. అతను, తెల్లగా, పొడుగ్గా దర్జాగా వున్నాడు. ఉంగరాల జుట్టు, నవ్వేకళ్ళూ! పాంటు జేబులో చేతులుపోనిచ్చి, మేడకేసి దీక్షగా చూస్తున్నాడు. సుబ్బాయమ్మ హృదయం దడదడలాడింది. శరీరం ముచ్చెమటలు పోసింది. కళ్ళు సంతోషంతో తళతళ్ళాడేయి! లేతపెదవులు, సన్నగా అదరసాగాయి! ఎలాగో తన్నుతాను నిలబెట్టుకుని వక్కసారి అతనికేసి సిగ్గులమొగ్గలా చూసింది. మళ్ళీ తన వెంపు చూసుకుంది. చేతులకి వెలసిపోయిన ఎర్రటి రబ్బరుగాజులు! అంచులు బురద కొట్టినట్లున్న కనుమాసిపోయిన, చీటీపువ్వుల పరికిణీ! తల్లి పాతచీర చినిగిపోతే,కాస్త గుడ్డ, వోణిగా చేసుకుని వేసుకుంది! చేతులకందని జుత్తు, చీకిరి, బాకిరిగా వీపునిండా పరచివుంది. అతణ్ణి ఆ అందాల రాజకుమారుణ్ణి ఆ పిల్ల చాలాసార్లు సినిమాహాలువద్ద చూసింది. రెండుమూడుసార్లు తన్ని అతను గుర్తు పట్టినట్లు చిరునవ్వు నవ్వినట్లుకూడా అనుమానం! ఇవ్వాళ, ఏకంగా ఇంటికే ఒచ్చాడు! బహుశా, తన తండ్రి ఎవరో తెలుసుకోవటం గురించి వచ్చి వుంటాడు. తను ఇంకా ఇల్లాగే వుంటే ఎల్లా?

గభాలున లోపలికి వెళ్ళబోయింది. పరికిణి కుచ్చెళ్ళు కాళ్ళకడ్డంపడి, బోర్లగిలా పడిపోయింది. మోకాళ్ళు గీరుకుపోయాయి. వాటిక కరుచుకుని రక్తం కూడా వచ్చింది. ఉత్సాహం ఉరకలలో, ఆపిల్లకి ఆదెబ్బలేం పెద్దబాధకరిలిగించలేదు. లోపలికి వెళ్ళి, మేనత్త, తండ్రితో పోరిపోరి పెళ్ళిచూపులకని కుట్టించివుంచిన, పెద్దపెద్ద గులాబీ పూల పరికిణి, లేత గులాబీ రంగు వాయిల్ వోణీ, ధరించి, తలనిండా నూనెరాసుకుని గట్టిగా బిగించి జడవేసుకుని తల్లి, దేముడు పూజకోసరంకోసి వుంచిన ముద్దమందార పూవు జడలో పెట్టుకుంది. బొట్టూ, కాటుకా పెట్టుకుని, చెంగుచెంగుమంటూ మూడేసి మెట్లు ఒక్కోఅంగలో దిగుతూ, మజుందారుగారి ఇంటిలోనికి ఒచ్చిపడింది. ఆసరికే మాలిని, సింగారించుకుని కూర్చుంది. ఆ అబ్బాయి చేతిలోఏవోకాగితాలు పట్టుకుని నెమ్మదిగా దర్వాజా దాటి మేడమీదకు వచ్చాడు. మాలినీ, సుబ్బాయమ్మా, కిటికీ కర్టెను తొలగించి, ముఖమంతా కళ్ళు చేసుకుని చూస్తున్నారు. అతను మజుందార్‌తో పదినిముషాలు మాట్లాడేడు. అతను

ఏవో మాట్లాడుతున్నాడు. వీళ్ళకి ఏమీ వినిపించటంలేదు. ఎవళ్ల వూహాలోకంలో వాళ్ళు తేలుతున్నారు. అతను మజుందారుగారికి ధన్యవాదాలు చెప్పి, రెండో అంతస్తుకేసి వెళ్లాడు. సుబ్బాయమ్మ మనసు పరవశించి పోయింది. ఆశాడోలికల్లో వూగిపోతూ తూరీగల్లె ఎగురుకుంటూ, తమ ఇంటికి వెళ్లింది. మాలినికూడా అనుసరించింది. వీళ్లిద్దరు వెళ్లేసరికి సూరమ్మ, హైరానపడుతూ ఆ యువకుడితో మాట్లాడుతోంది. అతను సూరమ్మ మంచంకి కాస్త ఎడంగా వేసివున్న ముక్కాలిపీటమీద కూర్చున్నాడు. శంకరి, ఒంటినిండా చెంగుకప్పుకుని, సత్తు గ్లాసుతో కాఫీతీసుకువచ్చి ఇచ్చింది. అతను వద్దనకుండా, ఆప్యాయంగా తీసుకున్నాడు.

"ఏమిటో! మహా నీర్సం తండ్రీ! ఎంతతిన్నా నీర్సమే నాయనా! రెండడుగులు వేస్తే, ఆయాసం దడా! ఏం రోగమో ఏమిటో, అంతు పట్టకుండా వుంది. మా వెంకాయ పెళ్లికి రెండుకుంచాల 'అండా'నీఒక్కచేత్తో ఒంపిపడేసాను. ఆరునెలాయి ఇలా ఖాయిలా పడిపోయేను. ఏమిటో ఇంట్లో ఇబ్బందుర్శించీ, మా వెంకాయ రేపూ, మాపూ అంటూ నిన్ను తీసుకురావటానికి వాన్నేసాడు! అబ్బా! అయ్యో!' అంటూ ఒకటే హైరానపడసాగింది, సూరమ్మ. ఆ యువకుడు ఇల్లు పైకప్పు, గోడలూ అన్నీ పరిశీలనగా చూస్తూ, కాఫీ త్రాగటం పూర్తి చేసేసాడు. నెమ్మదిగా లేచి నించున్నాడు. చెవుడుబారి పోయి పొగచూరిపోయిన గోడలూ, గచ్చులు పోయిన నేలా, సగం వూడిపోతూన్న వూచలతో వున్న కిటికీలూ, అన్నీ అతనివైపు ఆ లక్ష్మీప్రసన్నుని వైపు ఆత్రుతగా చూస్తున్నాయి!

"మీకు వంట్లో బాగాలేదా మామ్మగారూ! డాక్టరు కోసం ఎవర్నయినా పంపేరు కాబోలు! నేను డాక్టరుని కాను మామ్మగారూ! ఈఇల్లు మా నాన్నగారికి, బాకీ క్రింద దాఖలు పడిందట! ఇదంతా బాగుచేయించి, ఏదో గవర్నమెంటు ఆఫీసుకి అద్దెకిస్తారట! వచ్చేనేలాఖరులో ఈ ఇంటిని అందరూ ఖాళీ చెయ్యాల్సొంటుందని చెప్పి రమ్మన్నారు. మజుందారుగారు, అప్పులు పోనూ, మిగిలిన డబ్బు పట్టుకుని వారి కుమారుడిదగ్గరకు వెళ్లివుంటా రనుకుంటాను. మిగిలిన వాళ్లంతా, వేరే ఇళ్లు చూసుకోవాల్సి వుంటుంది. మీ తమ్ముడుగారితో కూడా చెప్పండి! వస్తాను. మళ్లీ కనపడతాలెండి!" అంటూ మెట్లు దిగసాగాడు. ఇన్నాళ్లూ మజుందారిగారి ధర్మమా అంటూ కానీ అద్దె కట్టనవసరం లేకుండా ఆ ఇంట్లో కాలక్షేపం చేశారు, వెంకయ్య కుటుంబం వాళ్లు. పులిమీదపుట్రలా ఇదొకటి వొచ్చి పడింది! అతని బూట్లు టక్‌టక్ మంటూ చేసే చప్పుడు అఖరయ్యేదాకా, ఆ మూడు జతల కళ్లూ శూన్యద్రుక్కులత చూస్తూ వుండిపోయేయి!



గ్రంథ విమర్శలు

కళా పూర్ణోదయః

(ఆంధ్రకావ్యానువాదః: అనువదితా శిరోమణిః సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రీ: ఆంధ్రప్రదేశ సాహిత్య ఏకాడెమీ సంస్థయా ప్రకటితః. డెమీ 1/8 పృష్ఠాని 206; మూల్యమ్: రు. 6/-)

ఆంధ్ర కావ్యాలలోనే కాక, భారతీయ భాషా కావ్యా లన్నిటిలోను, కథాకల్పన విషయములో విశిష్టత కలది పింగళి సూరన కళాపూర్ణోదయము. దాని కిది సంస్కృతాను వాదము. వసుచరిత్రము పుట్టిన వంద సంవత్సరాలలోనే కాళహస్తి కవి దానికి సంస్కృతీకరణ గౌరవము కలిగించినాడు. పూర్వము సంస్కృతభాషమీద దండయాత్ర సాగించిన ప్రాకృత భాషావుల కావ్యాలు, నేడు ముఖ్యముగా వాటికున్న సంస్కృత చ్ఛాయలవల్లనే, కొంతవరకు నిలిచి ఉన్నవి నేటి భారతీయ భాషలలో పుట్టుచున్న కావ్య సందోహమంతా కొన్ని వందల సంవత్సరాల తర్వాత వాటి సంస్కృతాను వాదాలద్వారానే నిలిచే అవకాశ మున్నది. కావున ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ దూరదృష్టితో చేపట్టిన కార్యనిర్వహణములో ఈ సంస్కృతీకరణములు ప్రధానమైనవి. కొన్ని శతకములు మనుచరిత్రము సంస్కృతీకరించి ప్రకటించి నారు. కళాపూర్ణోదయ ప్రకటనము వానిలో మరి యొకటి.

దేశభాషా కావ్యాల విశిష్టత భారతదేశ మంతటా కల సహృదయ లోకానికి అందించవలెనంటే సంస్కృత భాషలోనికి అనువదించడమే ఉత్తమ మార్గము ప్రాంతీయ దురభిమానాలు లేనివారు ప్రధానముగా సంస్కృతభాషాకోవిదులైన సహృదయులే అని తోస్తుంది.

కాబట్టి దేశభాషా కావ్యాలను సంస్కృతీకరించు వారిమీద గురుతరమైన బాధ్యత ఉన్నది. వారు విశిష్టకావ్యాలే ఎన్నుకోవలె; అనువాదము సమర్థతతో నిర్వహించవలె.

కళాపూర్ణోదయము ఇందుకు ఎన్నుకొనుట సర్వవిధాల సంభావ్యమే. కవి అవతరణికలో "అత్యపూర్వ కథా సంవిధాన వైచిత్రీ మహనీయంబును, శృంగారరసప్రాయంబును, బుధ్యావస్తువర నాకర్ణనీయంబునుగా" ఈ మహాకావ్యంబు నిర్మింపం గడంగితినని ప్రతిజ్ఞ చేసినాడు. ఆ ప్రతిజ్ఞను సమర్థతతో నిర్వహించినాడనియే ఆంధ్రవిద్వల్లోకము అభిప్రాయ పడుతున్నది.

అనేక కథలు ఏదో ఒక సూత్రముతో అనుసంధించే ప్రయత్నముతో పుట్టినవే, పంచతంత్రమూ, హితోపదేశము, దశకుమార చరిత్రము కథాసరిత్సాగరము, బృహత్కథామంజరి ఇత్యాది కథాసందోహ కావ్యాలు. వానిలో కథలమధ్య కథలు కూర్పుటేకాని బిగువైన మూలసూత్రగథనము లేదు.

కళాపూర్ణోదయము, అట్లుకాక, సరస్వతీ చతుర్ముఖుల లీలాకేళిని ఆధారము చేసుకొని, ఆ కేళీ స్తంభమాధారముగా 'గృహరాజు మేడ'వలె నిర్మించిన కథామందిరము. ఈ విధముగా నిర్మాణములోనే కాక కథాకథనములోకూడా విశిష్టమార్గ మవలంబించినది కళాపూర్ణోదయము. దీనిని సంస్కృతీకరించుటకు ఎన్నుకొనుటలో శ్రీ శాస్త్రిగారు సర్వవిధాల ఔచిత్యము పాటించినా రనుటకు సందేహము లేదు.

శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారు ప్రసిద్ధ వైయాకరణులు, సాహిత్యవేత్తలు, సంస్కృత కావ్య రచనలో చిరకాలానుభవ మున్నవారును గనుక అనువాదమును సమర్థతతో నిర్వహించిరనియే భావింప వలసి ఉన్నది.

భాషాంతరీకరణములు చేయుటలో ప్రధానోద్దేశము మూలగ్రంథస్వరూపము, చేతనయినంత

వరకు ఉన్నదున్నట్లు గుణదోషములతో సహా, రెండవ భాష తెలిసినవారికి అందించుటయే అని విశ్వభాషలతో ఆధునికవిద్యాంసుల భావము. ఆంధ్రదేశములో మాత్రము కవిత్రయము నాటినుండి నేటివరకూ దానికి విరుద్ధమైన అభిప్రాయమే ఎక్కువ ప్రచారములో ఉన్నది. ఈ ఆంధ్రసంప్రదాయమును అనుసరించియే శ్రీ శాస్త్రిగారు, ఎంతో స్వాతంత్ర్యము వహించి, ఈ అనువాదము చేసినారు. సంక్షేపము కొరకై మధురలాలస చేసిన యోగశాస్త్ర ప్రశంస, మధురలాలసా కలాపూర్ణుల వివాహోత్పూర్వ ప్రేమ కథను కవి తొలగించినారనియు, మూలములో 20 పేజీలు నడచిన కలాపూర్ణుని యుద్ధయాత్రను ఒక్క స్రగ్ధరావృత్తములో ఇమిడ్చినారనియు, అగ్గించుచు ఉపోద్ఘాతము రచించిన డా. పి. రామచంద్రుడు మరియు పన్నెండవ సర్గము అనవసరమును కావ్యైక్యతకు భంగము కలిగించునదియు గనుక పూర్తిగా వదలివేసిన బాగుండెడిదని, అదే ధోరణిలో సూచన చేసినారు.

కాబట్టి శ్రీ శాస్త్రిగారు సూరన కలాపూర్ణోదయమును యథామతిగా సంస్కరించి ఉజ్జ్వలతరముగా ఉండునట్లుగా సంస్కృతీకరించినారన్నమాట.

ఆంధ్రములో నిది గద్యపద్యములున్న చంపూకావ్యము. అనువాదము కేవల పద్యకావ్యము. మూలములో ఆశ్వాస విభజనముండగా ఇందులో సర్గవిభజనమున్నది. ఎనిమిది ఆశ్వాసములు పన్నెండు సర్గలైనవి.

సాధారణముగా సంస్కృత కావ్యాలలో, సర్గలో శ్లోకాలన్నీ ఒకే వృత్తములో నడిచి సర్గాంతము సూచించడానికి వేరే వృత్తముంటుంది. ఏదో ఒక సర్గలో అనేకవృత్తాలు కూర్చడముకూడా ఉన్నది. కాని సర్గ అంతా ఒకే వృత్తములో ఉండడము సామాన్య మర్యాద. ఈ అనువాదములో వృత్తభేదము పాటించడములో మాత్రము ఆంధ్ర సంప్రదాయమే అనుసరించారు.

సంస్కృతకావ్యాల ప్రకటనలో శ్లోకమునకు ముందు వృత్తనామ ముండడము పరిపాటికాదు. ఆంధ్రకావ్యాలు ప్రకటించిన ముద్రాపకులు సాధారణముగా వృత్తనామము సూచిస్తారు. ఈ ప్రకటనములో కొన్ని వృత్తాలకు ముందు మాత్రము పూర్తిగా వృత్తనామము నేరుగా అచ్చువేసియుండుట విశేషము. కాని ఈ మర్యాద చాలా వృత్తాలకు జరుగలేదు. కారణము చింత్యము.

కావ్యములో ప్రధానఘట్టాల పేర్లు ఆయా ఘట్టాల ఆరంభములో ఇచ్చుట ఆంధ్ర గ్రంథ ప్రకాశకుల అభ్యాసము. ఇందులో సంస్కృత గ్రంథ ప్రకటనాచారమునే అనుసరించి అట్టి ఘట్టాలు సూచింపలేదు.

మూలగ్రంథములో 105 పద్యగద్యములున్న మంగలాచరణము, కృతిపతి వంశవర్ణనము వదలివేసినారు. అట్లే ఆశ్వాసాద్యంత పద్యములను వదలి వేయబడినవి.

మూలములో కథా ప్రారంభము చేయుచు ద్వారకాపురవర్ణనము కావించు వస్తునిర్దేశముతో కావ్యానువాదము ఆరంభించినారు. అందుచేత ఆంధ్ర కావ్యారంభ మర్యాద అనువాదము చదువువారికి తెలియరాదు.

ప్రథమాశ్వాసములో 102 గద్యపద్యములలో నడచిన కథ అనువాదములో 94 శ్లోకములున్న 'ప్రథమస్సర్గః' ఐనది. మూలములో ద్వారకాపుర వర్ణనముకల 1–20 పద్యములలో 1—5 పద్యములు అనువదించి, 6–19 వదలివేసి, 20 వ పద్యములోని 'మాటలు వేయునేటికి...' అను పద్యము 'బహూనా కి మద్య...' అనే శ్లోకముతో అందుకొని సాగించినారు.

ఈ విధముగా కొన్ని ఘట్టములు వదలి వేయుట, వర్ణనాదికము తగ్గించుటయేగాక, అనువదించిన పద్యములుకూడ కొన్ని సంక్షేపించుట కొన్నిమూలానుసరణము చేయుట సంభవించినది. ఉదాహరణార్థము సూరనకు అభిమానమైన కవితా రీతులు ప్రథమాశ్వాసములో కలభాషిణి నోట అనిపించిన సీసపద్యము లయవిభాతి, వాటి సంస్కృతానువాదములు ఈ క్రింద ఇస్తున్నాము :

19-వ శతాబ్దంయొక్క మధ్యకాలంలో కారల్ మార్క్స్ ఫ్రెడరిక్ ఏంగిల్సు లిరువురూ ఆనాడు లభ్యమైన శాస్త్రీయవిజ్ఞానాన్ని — నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులనూ పరిశీలించి కొన్ని నూతన సిద్ధాంతాలను వెలయించారు. ఆ సిద్ధాంతాలను 'సైంటిఫిక్ సోషలిజం'అని వారి అనుయాయులు వర్ణిస్తూ వుంటారు. వారు వెలయించిన సిద్ధాంతాల ప్రకారం వర్గపోరాటమే మానవచరిత్ర: పెట్టుబడిదారీ – కార్మికవర్గాలమధ్య జరిగే పోరాట ఫలితంగా శ్రామిక నియంతృత్వం— సోషలిజం యేర్పడి–పిమ్మట కమ్యూనిజంవైపు సమాజం పురోగమించి, రాజ్యాంగయంత్రం (స్టేట్) రాలిపోతుంది.

మార్క్సిస్టుల జోస్యంప్రకారం మానవ చరిత్ర పరిణామం చెందలేదనుటకు గత చరిత్రయే ప్రబలతార్కాణం. గత వందయేండ్లలో శాస్త్రీయ విజ్ఞానం అపారంగా అభివృద్ధిచెంది, మానవుడు నిర్మించుకొన్న సిద్ధాంతసౌధాలు సంకుచితమైన చట్రాలని రుజువుచేసింది. వివిధదేశాలలో సోషలిస్టు సమాజాలు నిర్మాణమైనా వాని మధ్య అంతర్గత వైరుధ్యాలు యేర్పడినాయి. ఈనాడు సోవియట్‌రష్యా, చైనా, యుగోస్లావియాలలోవున్న ఆర్థికవ్యవస్థలు ఒకేవిధంగా ఉన్నాయా? పెట్టుబడిదారీ సమాజాలు కూడ కొత్తపుంతలలో రూపు దిద్దుకొంటున్నవిగదా? భారతదేశంవంటి అభివృద్ధిచెందుతూవున్న దేశాలలో మిశ్రమ ఆర్థిక విధానం అమలులో వున్నదిగదా? వర్తమాన పరిస్థితుల కనుగుణంగా ఆయాఆర్థిక వ్యవస్థలలో మార్పులు, చేర్పులు వస్తున్నాయి. ఈనాడు ఒక కొత్త తరహా వ్యవస్థ —'A New Indusrrial State'—రూపొందుచున్నదని గాల్‌బ్రేత్ వంటి ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

'మార్క్సిస్టు రాజకీయ ఆర్థికశాస్త్ర మూల సూత్రాలు' అన్న యీ గ్రంథంలో పైన పేర్కొన్న పరిణామాల ప్రస్తావన లేదు. ఇది కేవలం పాతబడిన మార్క్సిస్టు సాంప్రదాయిక ప్రకారం పాతమూసలో వ్రాయబడిన గ్రంథం. ఇందులో 'రాజకీయ అర్థశాస్త్రపు ప్రధానాంశం'—, 'పెట్టుబడిదారీ ఆర్థిక విధానం' —'గుత్తపెట్టుబడిదారీ విధానదశ— సామ్రాజ్యవాదం'- 'సోషలిస్టు ఆర్థిక విధానం' అను నాలుగు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయంలో 'రాజకీయ అర్థశాస్త్రం ఆర్థిక జీవితాన్ని అధ్యయనం చేస్తుంది' అని వివరింపబడింది. ఈ శాస్త్రం 'ఉత్పత్తికి సంబంధించిన సామాజిక పార్శ్వాన్ని పరిశీలిస్తుంది'. ఆ పరిశీలనవలన చరిత్రలో ఆదిమ—సాముదాయిక, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ, సోషలిస్టు అను ముఖ్యమైన ఐదు ఉత్పత్తి తరహాలు' ఉన్నవని తెలుస్తోంది. (19 పేజి). ఈ శాస్త్రం 'సమాజాభివృద్ధిని శాసించే ఆర్థిక నియమాలను బహిర్గత మొనరిస్తుంది.' (పేజి 28) ఈ ఆర్థిక నియమాల స్వభావాన్ని గురించి లియోంటివ్ అతి విడ్డూరమైన వ్యాఖ్యానం చేస్తున్నాడు.—'ఆర్థిక నియమాలు ప్రజల యిచ్ఛా చైతన్య సంకల్పాలపై ఆధారపడక పోవడమేగాక, అవే వారి స్వేచ్ఛా, చైతన్య సంకల్పాలను నిర్ణయిస్తాయి' అని ఆయన తీర్పు. (పేజి 29). అనంతమైన స్వేచ్ఛా పిపాసతో బహుముఖాలైన వ్యవస్థలను నిర్మించుకొంటూవున్న మానవుడు కొన్ని ఆర్థిక నియమాలకు కట్టుబడి తన స్వేచ్ఛా, చైతన్యాలను కోల్పోవుచున్నాడా? ఆ నియమాలను అతడు అధిగమించుట లేదా? సృష్టికర్త సంకల్పశక్తిని అతని సృష్టియే అరికట్టునా? రెండు, మూడు అధ్యాయాలలో ప్రత్యేకముగా చెప్పదగిన అంశములు లేవు. నాలుగవ అధ్యాయమైన 'సోషలిస్టు ఆర్థిక విధానంలో' లియోంటివ్ యీ క్రింది విషయాలు ఉద్ఘాటిస్తున్నాడు:— 1. ప్రభుత్వాధికారం బూర్జువావర్గంనుండి కార్మిక వర్గానికి మారినతర్వాతమాత్రమే సోషలిజం నిర్మాణ ప్రారంభం సాధ్యమవుతుంది. 2. సోషలిస్టు విప్లవం ద్వారా యిది సాధ్యమవుతుంది. (పేజి 91). 3. నేడున్న పరిస్థితులలో అనేకదేశాలలో సోషలిజానికి పరివర్తన పార్లమెంటరీ పద్ధతిలో సాధ్యం. ఈ పరివర్తన ప్రతిఘటింపబడిన బలప్రయోగం అనివార్యం (పేజి 95). 4. సోషలిస్టు ప్రభుత్వం ఏదోవిధంగా భూమిని, రైళ్లను, ఫ్యాక్టరీలను, బ్యాంకులను ప్రజలందరి ఆస్తిగా మారుస్తుంది.

గ్రంథాన్ని ముగిస్తూ రచయిత 'సోషలిజం

నుండి కమ్యూనిజానికి' మానవసమాజం పరివర్తన చెందుతుందనీ, అవాడు 'ప్రతిఒకనినుండీ అతని శక్తికొలదీ, ప్రతిఒకనికీ అతని అవసరాన్నిబట్టి' అన్న సూత్రం రాజ్యంచేస్తుందనీ పేర్కొంటాడు. అలాంటి పూర్తి కమ్యూనిజం యేర్పాటైనపిమ్మట మానవ సమాజం యే దిశవైపు పరిణమిస్తుందో రచయిత చెప్పలేదుకనుక పాఠకులు ఎవరికి తోచినట్లు వారు ఊహించుకోవచ్చు.

—వి. ఆర్.

అసురగణం

(నవలిక)

(తమిళమూలం : శ్రీ క. నా. సుబ్రహ్మణ్యం అనువాదం : శ్రీయుతులు బి. వి సింగరాచార్య, పి. సభాపతి. ప్రచురణ : ఎం. శేషాచలం అండ్ కంపెనీ, మద్రాసు—1 వెల రూ. 1-75)

కథ కొంచెం మాత్రంగానే ఉండి, భావనా ప్రవంతి, జిజ్ఞాస, విమాంస విశేషంగావున్న ఈ నవల మొదట 'భారతి'లోనే ప్రచురితమైంది. తమిళ రచయితలలో శ్రీ క. నా. సుబ్రహ్మణ్యం ఆధునిక భావాలు కలవాడు. విశ్వసాహిత్యాన్ని అవలోకించి జీర్ణింప చేసుకున్నవాడు. సర్ జాన్ ఫ్రేజర్ రచించిన 'Golden Bough' అనే సుప్రసిద్ధ గ్రంథం ఈ నవలిక రచనకు ప్రేరణ కలిగించిందని చెప్పవచ్చు. లారెన్స్ స్టెర్నీ, ఫ్రాన్జ్ కాఫ్కా, మార్సెల్ ప్రూస్ట రచనల వారసత్వంకూడా ఈ నవలకుందని రచయిత తన ముందు మాటలో చెప్పుకున్నాడు. 'లోకంలో ప్రతివ్యక్తి తాను అసాధారణుడనుకొని గర్వపడుతూ వుంటాడు ఈ కథలో రాముడుకూడా దీని కతీతుడు కాడు. ఈ అసాధారణత్వంలోని సాధారణత్వాన్ని, అబద్ధంలోని నిజాన్ని, నిజంలోని అబద్ధాన్ని, మానవుని ఛాయలో దాగివున్న దేవ అసుర మనుష్య గణాల్ని కొంతవరకు చూపడమే నా నవల లక్ష్యం' అనికూడా రచయిత చెప్పుకున్నాడు. ఈ నవలలో కథానాయకుడు రాముడు 19 ఏండ్ల కుర్రవాడు. కాలేజీలో బి. ఎ. రెండవ సంవత్సరం చదువుతున్న వాడు. మద్రాసు నగర నివాసి. ఇతని స్వభావం విచిత్రమైనది. లోకంలో సాధారణులైన ఇతరు లందరిలాగ తాను కాననే ఒక ఊహ అడుగడుగునా అతనిలో మొలకెత్తుతూ వుంటుంది. నలుగురిలా కాకుండా ప్రత్యేక వ్యక్తిగా వుండటం అతనికి గర్వం. ఆతని మనస్సు పోకడే విచిత్రమైనది. ప్రయోజకుడుగా బ్రతకడం అతనికి ఇష్టం లేదుట. ఆలోచనాపరుడుగా బ్రతకటమే ఇష్టమట. ఆలో చనల్లోపడి కొట్టుకుపోవడానికి అలవాటుపడిన వాడు. కాబట్టి ఇతరుల్లాగ వుండడం చేత నవడు. ఆలోచనల్లో కొట్టుకుపోవడమనేదే తన అసాధారణత్వానికి మొట్టమొదటి లక్షణ మను కుంటాడు. ఈతని వ్యక్తిత్వంలో ద్వంద్వం, Contradictions వైరుధ్యాలు చాలా గోచర మవుతాయి. స్త్రీని గురించిన జాగృతి తన కింకా కలుగలేదంటాడు. కాని డబ్బిచ్చికొన్న ఒక రాత్రి అనుభవంమాత్రం వుందట విధివిలాసంలోనూ, అదృష్టంలోనూ, అనివార్యమైన కార్యకారణ ఫలితా ల్లోనూ ఇతనికి అంతగా నమ్మకంలేదుట. అయినా ఒకానొకదాన్ని విధివిలాసం అనే అనుకుంటాడు వేరే దారిలేక! ప్రేమఅనే చావులో జీవించడం సాధ్యం కాదు అనుకుంటూనే తన క్లాస్‌మేట్ హేమని ప్రేమిస్తాడు. హేమపై ఆకర్షణ కలిగిం దతనికి. కాని ఆమెను మాట్లాడించలేదు. తన మనస్సులో ఎన్నో అనుకుంటాడు. కాని బైటికి చెప్పియ్యలేడు. హేమ ఇంటికి పోకూడదనుకుంటాడు. మరు నిమిషం లోనే ఆమె ఇంటికి వెళ్లాలనిపిస్తుందతనికి తను చేసిన ప్రతిజ్ఞను తాను భంగంచేస్తే లోకం మునిగి పోతుందా అని తనను తాను సమర్థించుకుంటాడు. పరస్పరం విరుద్ధమైన ఆలోచనల్ని నిమిష నిమిషానికీ ఆలోచించగలవాడిని ఆలోచనాపరుడని అనవచ్చా అని తన్నుతాను ప్రశ్నించుకుంటాడు. ఈ ఆలోచించట మనేది యాతనఅన్న స్పృహ అతనికి వుంది. అయినా ఆలోచనల్ని నిర్లక్ష్యం చేయలేడు. ఆలోచించవలసిన నిర్బంధం అతను ఎంత ప్రతిఘటించినా అతన్ని వేధిస్తూనే వుంటుంది. కాసేపు తాను అసాధారణుణ్ణని అనుకుంటాడు. మళ్లీ అలా అనుకొని గర్వపడటానికి ఆధారమేముంది అనుకుంటాడు. తను అసాధారణుడుగా వుండవచ్చునట. కాని తన చెల్లెలు, తనకు కాబొయ్యే

భార్య సాధారణంగా వుండాలని కోరుకుంటాడు. అతనికి ఎన్నోసందేహాలు. తన మాటలకి తలూపే వాళ్లని చూస్తే అసహ్యమట. అలాంటివాళ్లు తన్ను గోతిలోకి దింపేస్తారని అతని సందేహం. తన్ను వేరుగా వుంచి ఆ వేరుబాటు తనాన్ని తాను బాగా గ్రహించేట్టు చేసి తమాషా చూస్తోందట ఏదో శక్తి! కంటికి కనిపించేవన్నీ నిజమైనవని నమ్మాలనిపిస్తుంది అతనికి కాని మళ్ళీ ఏదో సందేహం. ఒక స్థిరమైన విశ్వాసం లేదు. ప్రతిదాన్నీ ఒక అనుభవంగా శోధించి చూడటమే ఇతనికి సరదా. అస్తమానం పిచ్చి ధోరణిలో ఆలోచించే తనలాంటి వాళ్ళు అసురగణం తాలూకు ఆకర్షణలో పడక తప్పదనుకుంటాడు. అసలు అసురగణమంటేనే ఆదర్శాలు, ఆలోచనలు, సందేహాలు అని రచయిత భావం. తన ప్రేయసిని పెళ్ళిచేసుకునేటందుకు అడ్డుపెట్టిన (అడ్డుపెడుతున్నదని అతని సందేహం) ఆమె తల్లిని ఊహలో హత్య చేస్తాడు. అది యథార్థంగావే జరిగిందని పోలీసు స్టేషనుకుపోయి లొంగిపోతానంటాడు. వాళ్ళు నిజం తెలుసుకొని ఇతన్ని పిచ్చివాడిక్రింద లెక్కకడతారు. ఏది ఊహ? ఏది నిజం? అన్న విచికిత్సలో పడతాడు ఏది చెరసాల? ఏది విమోచనం? ఈ జిజ్ఞాస అతనికి తేలదు. ఆలోచనల చెరసాలలో బంధింపబడ్డ వ్యక్తి. అతనే అన్నట్లు ఎన్నటికీ విడివడని, జవాబేలేని చిక్కుప్రశ్నలు వేసుకుంటూ తలకు తంటాలు తెచ్చిపెట్టుకోవడంలో ఘనుడు అతను. ఎన్నోమతాలు, ఎన్నోసూత్రాలు! ఎన్నో మనస్తత్వ సూత్రాలు! చూడగా ఇతనిలో గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' నవలలో సృష్టించిన సీతారామారావు లక్షణాలు కన్పిస్తాయి. కాని సీతారామారావువంటి Hopeless మనిషి కాడు. సీతారామారావు తాను స్వయంకృతాపరాధంగా త్రవ్వుకొన్న గోతిలో తానే పడి హతమైపోతాడు. కాని ఈ నవలలోని రాముడు భిన్నమైనవాడు. తాను మనగలననే విశ్వాసం కలవాడు. అగ్నిపర్వతం చరియల్లో కూడా ఆశతో జీవించగలవాడే మానవుడని అతని విశ్వాసం. ఇతనికి కొన్ని గట్టినమ్మకాలు ఉన్నాయి. చావు, జీవితం ఏవీ అతన్ని కదిలించలేవట. తాను అసాధారణుణ్ణనే గట్టి నమ్మకం తాను మనిషినని ధృఢపరచుకునేటందుకు అతనికి అవసరమైందట. ప్రతిమనిషి, ప్రాణికూడా ఒక విధంగాచూస్తే తక్కిన మనుష్యులందరిలో సర్వప్రాణికోటికీ భిన్నంగా వుండక తప్పదు. ఈ మూల సూత్రాన్ననుసరించే లోకం అభివృద్ధి చెందుతూ పురోగమిస్తోందని అతని అభిప్రాయం. చివరకు అతని ఓటమి అతనికి బోధపడింది. శూర్పణఖ అని భావించి ఆమెను చంపడానికి ప్రయత్నించి నానాఅవస్థలుపడ్డ అతను చివరికామెను తల్లిగా స్వీకరించడానికికూడా సిద్ధమయ్యాడు. కాబట్టే రచయిత అంటాడు. 'మానవుల ఛాయల్లో దేవతల్నీ చూడవచ్చు. దానవుల్నీ చూడవచ్చు. మానవుల్ని మట్టుకే చూడటం నేర్చుకున్నవాడు పరిపక్వత పొందినవాడని చెప్పవచ్చు.' నిజానికీ, అబద్ధానికీ మధ్యవున్న గీటు చాలా సున్నితమైంది. కాబట్టే మానవుడు నిజానికీ అబద్ధానికీ మధ్య ఉయ్యాల లూగుతూ బ్రతకడం సాధ్యమవుతున్నది అనుకుంటాడు, కథానాయకుడు.

భావుకత, తాత్త్వికచింతన, ప్రధానమైన ఇంతటి చైతన్యస్రవంతి ధారావాహికంగాకల ఈ రచనను తొలుత 'భారతి' ప్రచురించి తెలుగు పాఠకలోకంలో ఆలోచకులైనవారికి ఒక మంచిరచనను అందజేసిందని చెప్పాలి. ఇట్టి రచనను అనువదించడం తేలికైన పనికాదు. మూలంలోని భావాలను వాటి కక్కడవున్న పటిష్ఠతతో తెలుగులోకి తెచ్చారు అనువాదకులు. మూలరచయితే తెలుగులో వ్రాశాడా అన్నంత నిర్దుష్టంగా ఉపయుక్తంగా స్పష్టంగా వుంది అనువాదం. ఈ రూపంగా ఆధునిక తెలుగు సాహిత్యంలోకి ప్రతిభావంతమైన రచన ఒకటి చేరిపోవడం ఆధునిక సాహిత్యప్రియులందరూ హర్షించదగ్గ విశేషం.

గరికపోచలు

(కథల సంపుటి)

(రచన : శ్రీ పురాణం సూర్యప్రకాశరావు జీవనగంగ ప్రచురణలు, విజయవాడ. వెల రూ. 1-50.)

ఈ సంపుటిలో చిటిపొటి కథలు అమ్మాం బాపతు అన్నీ కలిసి తొమ్మిది వున్నాయి. వీటిలో మొదటిదీ. చివరదీతప్ప తక్కినవి సునాతుగా వున్నాయి.

అయితే మొదటి దానికి 'పాత కథ' అని ఎందుకు పేరు పెట్టారో బోధపడదు. అసలు ఈ సంపుటిలో కొన్ని కథలకు రచయిత ఆ పేర్లు ఎందుకు పెట్టారో సరిగా బోధపడక పాఠకుడు తికమక పడ వలసిందే. మొత్తం సంపుటికిమాత్రం పెట్టిన పేరు బాగుంది. మొదటి కథలో తాను ప్రేమించడం, భగ్న మనడం, త్యాగం చేయడంవంటి అనుభవాలు తన భార్య సరస్వతికి తెలియవులే అన్న సంతృప్తితోవున్న చక్రపాణికి ఆమె 'నా కంతా తెలుసు. మీరేమీ చెప్పనక్కర్లేదు. కొందరి జీవితాలలో ఘటనలు ఇలాగే వుంటాయి' అని చెప్పడం ఆశ్చర్యకరంగానే కాక కథకు కొసమెరుపుగాకూడా వుంది. ఈ కథలో వాస్తవికత, రచించిన తీరు విశిష్టంగా వున్నాయి. 'ముందడుగు' అనే కథలో రచయిత ఒక పాత్రచేత శరత్ రవీంద్రులు అభ్యుదయ రచయితల కోవకు చెందిన వాళ్ళు అని అనిపించారు! ఏమైనా కథ చివర రచయితలకు ఒక మంచి హెచ్చరికకూడా చేశారు— ఏమిటంటే రచయిత తాను చెప్పింది తానే ఆచరించ లేక పోవచ్చు కాని పాఠకులు తాను చెప్పిందాన్ని గాఢంగా నమ్మి ఆచరణలో పెట్టగలిగి వుండవచ్చు. అందుకే మనం ఏది చెప్పినా చాలా జాగ్రత్తగా చెప్పాలి.' 'సిగరెట్టు' అన్న కథలో రచయిత చెప్పిన నీతి ఏమిటయ్యా అంటే సిగరెట్టు ఏదో మితంగా ఒకటీ రెండూ కాలిస్తే పరవా లేదు. దర్పాలు వెలగబెట్టడానికీ, ఆలోచించాల్సి వచ్చినప్పుడల్లా, వెర్రిమోహం వేయాల్సి వచ్చినప్పుడల్లా కాలిస్తే మొగుడూ పెళ్ళాం పిల్లలూ తల్లి కాల్చేసి పారేసిన సిగరెట్ పీకల్లాగా తయారవుతారు. అప్పుడు వళ్ళికి లించాల్సిందే. 'తెలిసీ తెలియనివాడు' అనే కథలో అతగాడు ఎవరూ అని ఆలోచిస్తే అంతుచిక్కదు. 'తెలివి'అన్న కథలో మోసాన్ని మోసంతోనే ఎదుర్కో వాలని చెప్పినవారు చివరకు తామే మోసపోవడం జరగడం కద్దు అని చెబుతూ 'రాజకీయాలకు ఆయువు పట్టు మధ్యతరగతి' అని ఒక వాస్తవం చెప్పారు. 'బాలకాండ' అనే కథ అర్థవంతంగా, హాస్యస్ఫోరకంగా వుంది. నలుగురు పిల్లలుగల దిగువ మధ్యతరగతికి చెందిన స్త్రీ పిల్లలులేని కొత్తదంపతులు ఏ బాదర బందీ లేకుండా స్వేచ్ఛగా సినిమాలకనీ, షికార్లకనీ తిరుగుతూవుంటే ఓర్వలేక ఈర్ష్య పడుతుంది. పిల్లలతో తాను సతమతమవుతున్నా 'పిల్లలులేని బ్రతుకూ ఒక బ్రతుకే. ఆడదాని జీవితం మాతృత్వం తోనే ధన్యత చెందుతుంది' అని అంటుంది. పిల్లలులేని ఆ పక్కింటి అమ్మాయి గర్భవతి అయిందని తెలిస్తే 'పిల్లల్ని కనగానే సంబరంకాదు' అని మూతి తిప్పుకుంటుంది. ఈ ఆడవాళ్ళు క్షణాని కొకరకంగా మాట్లాడుతారుకదా అని భర్త అనుకుంటుంటే 'ఏదో అని వుంటానుకోండి. అనేకం అనుకుంటూవుంటాం. అవే ఎల్లకాలం మనసులో పెట్టుకున్నారుంటామా ఏమిటి?' అని ఎదురుప్రశ్న వేస్తుంది. చిత్రంగా వుంటాయి కొందరు ఆడవాళ్ళ మాటలు!

ఈ సంపుటిలో ప్రతికథా ఒక ప్రయోజనాన్ని ఆశించి వ్రాసిందే. కథలకు పెట్టిన శీర్షికలే కొన్ని తగినవిగాలేవు. కొంత ఆలోచించి పేర్లు పెట్టి ఉంటే బాగుండేది. 88 పేజీల ఈ సంపుటానికి ధర రూపాయిన్నరఅంటే అధికంగానే వుందని చెప్పాలి.

చీకటి కడుపున కాంతి

(నవల)

[రచన : శ్రీమతి సి. ఆనందారామం. ఎమెస్కో పాకెట్ బుక్స్, యం. శేషాచలం అండ్ కంపెనీ. మద్రాసు-1. ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాదు వెల రెండు రూపాయలు]

జాన్ హెన్రీ న్యూమన్ అనే విఖ్యాత ఆంగ్ల కవి 'లీడ్ కైండ్లీ లైట్' అనే మకుటంతో వ్రాసిన తన సుప్రసిద్ధ కావ్యఖండికలో 'నన్ను చుట్టివేస్తున్న అంధకారం మధ్యనుంచి నాకు దారి చూపి నడిపించు. దూరంగావున్న దృశ్యాన్ని చూడాలని నేను కోరను. నాకు ఒక్క అడుగు చాలు' అంటాడు. ఈ నవల అంతా చదివితే ఇందులోని కథానాయిక అటువంటి మహాప్రార్థనతోనే ఇష్టం లేకపోయినా ఈ జీవితం నుంచి నిష్క్రమించిందా అనిపిస్తుంది. వైవాహిక జీవితంమీద చాలా ఆశలు పెంచుకున్న నాగిణి ఇంట్లో ఆర్థికమైన ఇబ్బందులకు తట్టుకోలేక మద్రాసు

సినీమారంగంలో అడుగుపెట్టి పతితయై ఒకానొక గ్రామంలో రామచంద్రను కలుసుకుంటుంది. అతను వ్యవసాయ పట్టభద్రుడు. ఉద్యోగం చేయడం ఇష్టం లేక స్వతంత్రమతంలో వ్యవసాయం చేసుకొంటూ నియమంగా బ్రతుకుతున్నవాడు అవివాహితుడు. ఇద్దరికీ పరిచయం, స్నేహం ఏర్పడుతుంది. అయితే ఆత్మీయమైన స్నేహానికి వ్యక్తిగత చరిత్రలతో సంబంధమేముంటుందని అనుకోవడంలోనే వారిజ పొరపాటు పడింది. ఆమె గత చరిత్ర తెలియడంతోటే ఆమెను దగ్గరకు తీసుకున్నందుకు తాను మైలపడ్డానని బాధిస్తాడు అతను. ఆమె పూజలతో శాంతిని సాధించాలని ప్రయత్నిస్తుంది. ఒక ఊహా ప్రపంచాన్ని సృష్టించుకొని అందులో జీవిస్తూ వుంటుంది. భావనలో ఎల్లప్పుడూ రామచంద్ర సాన్నిధ్యంలో వుంటుంది. ఆనందం వెతుక్కోవలసిన అవసరంలేదనీ, అది సృష్టి అంతటా నిండివుందనీ గ్రహిస్తుంది. రామచంద్రకు తల్లిదండ్రులు కుదిర్చిన లతతో వివాహమవుతుంది. కాని లత మూర్ఖురాలు. ఎంతసేపూ చీరెలపై నగలపై మోజేకాని భర్తను ప్రేమించి అతన్ని తన వశం చేసుకోదు. భావుకుడైన రామచంద్రకు లతతో కాపురం ఆశాభంగాన్నే కలిగించింది. ఆమెతో హృదయపూర్వకమైన ప్రేమ, ఆ ప్రేమతో కూడిన తనను అహం పూర్తిగా నశించిన ఆత్మార్పణ పొందలేకపోయాడు. ఒక వైపు లతతో రామచంద్ర గడిపిన నిజమైన లౌకిక జీవితాన్నీ, మరొకవైపు భావనలో బ్రతకడం నేర్చిన వారిజ రామచంద్రతో తన జీవితాన్ని ఊహించుకున్న వైనాన్నీ రచయిత్రి ఈ కథలో పేర్కొని ఈ నవలకొక నవ్యత్వాన్ని తెచ్చారు. రామచంద్రకు జబ్బు చేసిందనీ, తన సపర్యలవల్ల అతనికి నయమైందనీ, అతనితో తనకు సాన్నిహిత్యం ఎక్కువైందనీ, తన గత చరిత్రలోని మాలిన్యాన్ని క్షమించి అతను మరచి పోగలిగినాడనీ, తనను గాఢంగా ప్రేమిస్తున్నాడనీ ఊహించసాగింది. ఇందుకు కారణాన్నికూడా రచయిత్రి చెప్పింది. మరే వాంఛలేకుండా పూజలతో పవిత్రంగా గడపాలనుకున్న వారిజ అలా చేయలేకపోతోంది. ఆమె శరీరం ఇంకా కామాన్ని వాంఛిస్తోంది. ఎలా జయించాలి ఈ కామాన్ని? ఈ పాశవిక శక్తులనుండి మానవుడి కసలు విముక్తిలేదా? మానవుడుచేయగలిగింది వీటిని అణచి వుంచుకోవడమేనా? అనే ప్రశ్నలతో వారిజ మథనపడుతుంది. అటు రామచంద్రకూడా లతే అతనికి పెళ్ళి అయినా వారిజకోసం, ఆమె మెప్పుకోసం పరితపిస్తాడు, ఆక్రోశిస్తాడు. ఎప్పటికప్పుడు లతను వారిజతో పోల్చుకొని ఆ మాధుర్యపు పరమావధిలేదనీ, ఆ రసమయ లోకాలు లేవనీ అసంతృప్తి చెందుతాడు. అయితే లత వారిజకు చెల్లెలని అతనికి తెలీదు. వారిజకు తన చెల్లెలే అతని భార్య అని ముందుగా తెలుస్తుంది. వారిజను అతను వాంఛించినప్పుడల్లా తాను ఎంగిలి చేసిన మిఠాయిని ఇచ్చే అతనిని దూరంగా వుంచుతుంది. అతనికి ఏ మూలనుంచైనా సరే సమాశ్వాసన దొరకాలి. అందుకు తనకు విలువ లక్ష్యంలేదంటాడు. తన మనసులోవున్న చికాకులన్నీ మరపించే ప్రియురాలు కావాలనీ, ఆమె వారిజేననీ గాఢంగా విశ్వసిస్తాడు. తన చెల్లెలితో అతని కాపురం అపస్వరంగా వుందని తెలిశాక దాన్ని కుదుటపడ వేయాలనే ఉద్దేశంతో వారిజ లత ఇంటికి వెళ్లడంతో కథ ముగింపుకువచ్చే అవకాశం కలిగింది. లత వారిజ చెల్లెలని తెలిశాక రామచంద్ర తన భార్యను ఇంటినుంచి వెళ్ళగొట్టి రైలెక్కించి పుట్టింటికి పంపిస్తాడు. వారిజను తన దాన్నిగా చేసుకోవాలని రామచంద్ర మరొక ప్రయత్నంచేసి విఫలుడవుతాడు. తన ఆరాధనా మూర్తికి మసిపూయకూడదనీ, అతని ఔన్నత్యం వున్నంతవరకే తాను అతన్ని గౌరవించగలదనీ ఆమె వాదన. ఈ విషయంలో వారిజ పాత్రను ఇంత దృఢమైనదాన్నిగా చిత్రించి అక్రమ సంబంధం కలిగించకుండా వుంచినందుకు రచయిత్రిని అభినందించాలి. అక్రమ సంబంధాలను నవలల్లో అతి తేలకగా ప్రవేశపెట్టుతున్న ఈనాడు అలాంటి పనేమీ చేయించనక్కరలేకుండానే కథను ఒక పరిణామానికి రచయిత్రి తీసుకొచ్చారు. పుట్టింటికి పోయిన లతకు ఆమె అన్న చేసిన శాస్తితో బుద్ధి వచ్చి తన భర్త ఎంతో మంచివాడన్న జ్ఞానోదయం కలుగుతుంది. సరాసరి బయలుదేరి భర్త దగ్గరికి వచ్చేస్తుంది. ఈ లోగా ఇక తాను బ్రతికి వుంటే రామచంద్ర లతల కాపురం సవ్యంగా సాగదని వారిజ ఈ లోకంనుంచి నిష్క్రమిస్తుంది. వారిజ

చేసిన ఈ ఆత్మార్పణకు అత హృదయ పూర్వకంగా కుమిలిపోతుంది నేను అంతా చదివిన తర్వాత 'సంపూర్ణమైన చీకటి ఎక్కడుంది అసలు? మిమ్మల్ని చూడాలని పరితపిస్తున్న నా కళ్ళు ఈ చీకట్లో పేరుకున్న కాంతిరేఖల సాయంతోనే మిమ్మల్ని చూడగలవు' అన్న నాయిక మాట పదేపదే జ్ఞాపకముస్తుంది. మనుషులు కలుసుకోవటమంటే అదేనేమో!

ఈ నవలను రచయిత్రి బహుపరిణత రీతిలో రచించారు. కథలో ఏ ప్రధానమైన అంశాన్ని బహిర్గతం చేసి దానిని పాఠకునికి ఎంత సన్నివేశంగా చెప్పాలో రచయిత్రికి బాగా తెలుసు కాబట్టి నవలం పాఠకుణ్ణి ఆసక్తితో చదివించేదిగా వుంది. ప్రతి పాత్ర రూపకల్పన పరిపూర్ణంగా తీర్చిదిద్దినట్లుగావుంది. పాత్రల నిర్మాణంలో, సన్నివేశాల చిత్రణలో లోపం ఎక్కడా కన్పించదు. ప్రకృతి వర్ణనలు, పాత్రల మానసిక స్థితుల చిత్రణ మంచి భాషలో చక్కని శైలిలో రచింపబడి వున్నవి కాకపోతే 'కొంచెం రోజుల్లో వెళ్ళిపోతాను', 'అయిన ప్రతిదీ చాలా తీవ్రంగా తీసుకుంటాడు' వంటి వాక్యాలను సవరించి వ్రాసివుంటే బాగుండేది. పాలేరు పిరన్న డైలాగు 127 పేజీలో 'ఉజ్జ్వలమైన మీ భవిష్యత్తునంతా వదిలి ఈ మారుమూల గ్రామంలో' అన్నది పాత్రోచితంగా కన్పించదు.

—డి. ఆర్.

విన్నవి - కన్నవి

(వ్యాసాలు రచయిత కీ॥ శే॥ అట్లూరి పిచ్చేశ్వరరావు ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ-2. వెల : రూ. 1-80)

రాజకీయంగా కమ్యూనిజం ఏం పరిణామం సాధించిందో ఇక్కడ అప్రస్తుతం. అయితే ఒక ఉపకారం మాత్రం ఆంధ్ర జీవితానికి చేసింది. కమ్యూనిజం ఆంధ్రదేశంలో కాలూనక పూర్వం ఆధునిక వ్యక్తుల్లో ఆలోచనాపరులు లేరు. Intelligentsia అనీ, Thinkers అనీ, సైద్ధాంతికులనీ, మేధావులనీ, కమ్యూనిజంలో ఆలోచనాపరులను పేర్కొనటం కద్దు!

ఆంధ్రులు సహజంగా హాస్యకుశలతకలవారు. కొద్దిమందే అవసరమయిన విషయాలను Serious గా తీసుకోగలరు. చాలామంది అంత Serious విషయాన్ని హాయిగా నవ్వి పారేస్తారు.

ఆంధ్ర జీవితంలో ప్రధానంగా కావ్యాలూ, అప్రధానంగా వచన కావ్యాలు ఆనందం కలిగించేవి నిన్న మొన్నటిదాకా. వచనం పట్ల విచన రచనపట్ల సమ్యగభిప్రాయమ్మూ, ఆలోచన రేకెత్తించే వచన స్థితిని సాహిత్యంలో ప్రవేశపెట్టిన గౌరవం కొంత వరకు, తదితరులతోపాటు కమ్యూనిస్టులకూ దక్కుతుంది.

ఆలోచనాపరుల్ని, అవసరమైన విషయాలను serious గా స్వీకరించే వ్యక్తుల్ని కొంతవరకు కమ్యూనిజం సృష్టించింది. ఇది దేశగత పరిణామం. వచనాభివృద్ధిని కమ్యూనిజంకూడా సాధించింది. ఇది సాహితీగత పరిణామం.

పిచ్చేశ్వరరావు కమ్యూనిస్టు కాకపోతే ఆలోచనాపరుడుకాక పోయేవాడు. హాయిగా కావ్యాలు చదువుకొని ఆనందించేవాడు. Valid reason లేకపోతే నమ్మేగుణం అలవడేది కాదు. ప్రతి సంప్రదాయం ప్రశ్నించి సిద్ధాంతందాకా చర్చించుకొంటూ పోయే గుణం కలిగేది కాదు. ఈ చిన్నవ్యాసాల సంపుటి ఆ రెండు గుణాలకు నిదర్శనం.

ఈ పుస్తకంలో కొన్ని ఆలోచనలూ, కొన్ని గేయాలు, కొన్ని అనువాదాలూ ఉన్నాయి.

ఒక భావం, వ్యక్తి, వ్యవస్థయొక్క బలం అస్తిత్వంలోకంటే నాస్తిత్వంలో అస్తిత్వ రాహిత్యంలో స్పష్టంగా గోచరమవుతుందనే ఆలోచన చెప్పే ప్రఖ్యాత జపాన్ రచయిత టాజ్సాబో ఇషికావా రచన అనువాదం 'చీకటిలో ఆలోచనలు.'

ప్రత్యక్ష ప్రమాణం లేకపోతే ఏ సిద్ధాంతం అయినా నమ్మటానికి, స్వీకరించటానికి భయపడే సమాజానికి మేలుకొలుపువంటిది 'పరిశోధన' అనే బెంగాలీకథ అనువాదం. ప్రత్యక్ష ప్రమాణ సంపాదనార్థం వామనరావు పొందిన దుర్గతి అన్ని విషయాలకూ ప్రమాణం కావాలనటంకంటే హేతువాదంతో

తార్కిక దృష్టితో ఆలోచించి ఆలోచనల సమన్వయంతో సిద్ధాంతం చేరుకోవటం ఉచితమనిచెప్పే ఈ రచన కథాదృష్టితో పేలవమయింది. ఇంత పెద్ద కథ అంత చిన్నవిషయం స్థాపించటంకోసం అనువదింపనక్కరలేదు. అంతకంటే, ఈ కథ చదివి కాంక్షిత సిద్ధాంతలక్షణం చేరుకోనేకంటే దూరంగా భిన్నాభిప్రాయాన్ని పాఠకుడు పొందగల ప్రమాదమూవుంది.

చెహొవ్‌ట్స్ అభినయం పై వ్యక్తంచేసిన దృక్పథం ఆంధ్ర నాటకరంగానికి ఉపయోగపడవచ్చు.

శ్రీ గజ్జెల మల్లారెడ్డి కవిత్వం కార్టూను కవిత్వం అని ఎవరెవరో అనటం విన్నతర్వాత, అటువంటి కవిత్వం పిచ్చేశ్వరరావు చాలాకాలం ముందుగా వ్రాసినట్లు గ్రహించవచ్చు!

'గడ్డికట్టలు', 'కార్టూన్లు', 'కాకదంత పరీక్ష', 'వైతాళికం' చక్కని వచనకవితలు. ఈ కవితలలో కమ్యూనిజం గూర్చి రచయిత చెప్పేతీరు,

'మహాప్రవాహానికి మరుగు గడ్డికట్టలు అడ్డమా?
దురాశా పక్షాలు, పదవీ కాంక్షాపక్షాలు
కమ్యూనిస్టు వ్యతిరేక పక్షాలు
పక్షాలుకాదు పకులు. పక్షాలులేని పకులు'
ఇలా వుంటుంది.
'త్రివేదీ సత్కారంలో ఒకరు నోరు విప్పరు.
జౌనాను. కమ్యూనిస్టులు ప్రథమ శత్రువులు!'
ఇంకా ఇలా వుంటుంది.
'విర్యాగంలో నిర్యాణం?
ఇంగ్లీషులో యూనివర్సల్ సూయిసైడ్ అంటారు
అదిగో మళ్ళీ సైడ్ కెనాల్స్‌లోకి జారుతున్నారు?
కెనాల్స్‌లో పెనాయిల్ వేయాలండీ!'

అపహాస్యంతోకూడిన వచన కవిత్వంలో అదే కార్టూన్ కవిత్వంలో పిచ్చేశ్వరరావు అందె వేసిన చేయి!

ఆలోచనలు అని చెప్పుకోదగ్గ వ్యాసాలు మొత్తం పది. అందులో వ్యక్తం చేసిన భావాలూ, అభిప్రాయాలూ అందరూ హర్షిస్తారు అన్న నమ్మకం ఎవరికీ అక్కర లేదు. కొన్ని నచ్చుతాయి. కొన్ని నచ్చవు. సహజమే! అయితే కమ్యూనిజం ఎర్రకళ్ళ జోడుతో ప్రతి విషయమూ ఎర్రగా చూచినప్పుడు కామెర్ల రోగి లక్షణం కనిపించినంతగా వుంటుంది. అయితే రచయితలో ఆలోచనల తీవ్రత, తర్కవిధానం – అసలు ఆలోచించే గుణం పాఠకులకు ఆనందం కలిగిస్తుంది. అసలు ఆలోచించే సామర్థ్యం కించపరచుకుంటున్నవారిలో ఆలోచించేవాడు ఉండటమే ఆనందం. ఎలా ఆలోచించాడన్నది అభిప్రాయభేదానికి గురి అయితే అవుగాక!

ఉద్యమ విజయమూ, ఫాలాగోడనా, రచయిత మనుగడ, అభ్యుదయ నిర్వచనం, సాహిత్యం పై అమెరికా దండయాత్ర, రచనానుష్టు, విద్యార్థుల రాజకీయాలు, అమెరికా- చార్లీ చాప్లిన్ మొదలగు విషయాలమీద పిచ్చేశ్వరరావు ఆలోచించి వ్యక్తంచేసిన అభిప్రాయాలు గమనించదగ్గవి

మనం అమెరికాను తిట్టాలా వద్దా! కొందరికి అక్కరలేదు కొందరికి వుంది. కమ్యూనిస్టులకు మరీ వుంది. కంటిలో దూలం ఉన్నవారిని, కంటిలో నలుసో నలుసుల గుంపో వున్న మనిషిని సంస్కరించే ప్రయత్నం బాగువేసె దృష్టి పెట్టుకోవాలి. ఇంటగెలిచి రచ్చగెలవమన్నారు. అమెరికా పై రచయిత ప్రదర్శించిన తీవ్రతాదృష్టి అభిప్రాయం కాదు. పక్షపాత అభిప్రాయం. చార్లీ చాప్లిన్‌ని అమెరికానుంచి బహిష్కరించటం న్యాయం కాకపోవచ్చు. కళాదృష్టితో, భారతీయ దృష్టితో, అమెరికా పుస్తకాలను అంటే భవిష్యత్తు ఆస్తిని తగలబెడుతుంటే బేన్ చేస్తుంటే సహించగలరా? ఎవరూ సహించరు. అయితే ఆంధ్రదేశంలోనే అసభ్యసాహిత్యమని, అనవసర సాహిత్యమని బేన్ చేస్తుంటే ఏం చేస్తున్నారు? ఏదో చేశారు. ఏం ప్రయోజనం సాధించారు? ఏదో సాధించినట్లే కనిపిస్తుంది! కొన్నివిధాల రచనలమీద బేన్ చేస్తుంటే ఊరుకోవచ్చా! కొందరు వూరుకొంటారు కొందరు వూరుకోరు. ఎందువల్ల? అభిప్రాయభేదాలు! కమ్యూనిస్టు సాహిత్యం బేన్ చేయుటం కొందరికి కష్టం! కొందరికి ఇష్టం! అలాగే అసభ్య సాహిత్యం! చెప్పవచ్చిం దేమిటంటే మన దేశంలోనే సాహిత్య బహిష్కరణవుంటే ఇతర దేశాల గొడవ మన కెందుకు? మనదేశం బాగు

చేసుకొని, ఇతరదేశాన్ని వ్రేలెత్తి చూపించవచ్చు! తప్పులేదు. మరి ఆ దశకు ఈ దేశం చేరుకొందా? Thinkers! Intelligentsia! ఆలోచనాపరులూ! మేధావులూ! ఆలోచించండి!

శ్రీ శ్రీ అంటే ఈ రచయితకు విపరీతమయిన అభిమానం. భగవంతుడి విషయంలో కమ్యూనిజం మాట ఏమిటో కాని, శ్రీ శ్రీ ఈ రచయితకు దేవుడు! శ్రీ విశ్వనాథ సత్యనారాయణ అంటే బోలు మనిషి, గడ్డి బొమ్మ! రెండూ అతివాదాలు! సమన్వయం అవసరం! సద్విమర్శకుడు ఉచితానుచితాలు అర తానరత్వాతలు, మంచిచెడ్డలు తూకం వేయగల న్యాయనిర్ణేత వంటివాడు. పాక్షిక దృష్టి ప్రదర్శించటం, రాజకీయంలో ఏమిటోగాని, సాహిత్యంలో ఆత్మవంచన!

'సాహిత్యం గూడ ఒక వృత్తిలాంటిదే.' ఈ అభిప్రాయం తర్క సహితం హేతుబద్ధం కాదు.

'పోరాటం లేనిదే పురోగమనంలేదు' రచయిత అభిప్రాయం. ఇది సొంతం కాదు. అయినా పోరాటం అంటే అర్థం యుద్ధం అనే అయితే ఆ అభిప్రాయం పూర్తి సత్యం కాదు.

వేదకాలం నాటి మానవుణ్ణి గూర్చి చెబుతూ 'ఆనాటి మానవుని ఆదర్శం ప్రధానంగా కుక్షింభరత్వం' అని రచయిత చూపిన అభిప్రాయం. సామాన్య దృష్టితో ఆలోచిస్తే ఆదర్శం ప్రధానంగా కుక్షింభరత్వమే కావచ్చునేమో కాని, అది సమగ్ర సత్యం కాదు. స్వచ్ఛమయిన అభిప్రాయమూ కాదు. ఆదర్శం ప్రధానంగా ఆదర్శం కోసమే! ఇంకొక మెట్టు పైకి పోతే, ఆదర్శం ఒక జబ్బు! మళ్లీ మాట్లాడితే ఆదర్శం ఒక స్వార్థం. ఆ స్వార్థం కుక్షింభరత్వం కంటే భిన్నమయింది. పైది పాక్షికమైన అభిప్రాయం.

ఏమయినా, కీ॥ శే॥ అట్లూరి పిచ్చేశ్వరరావు 'విన్నవీ— కన్నవీ' ఆలోచింపజేసే రచన. ఏ సిద్ధాంతం నమ్మిన రచయిత అయితేనేమి, ఇటువంటి రచనలు తెలుగులో ఎంత అధికంగా వస్తే తెలుగుజాతికి సాహితికి అంత పుష్టి!

— రవి.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad.